ఆదివారం
24-03-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 272
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

90కి పైగా ఘటనల్లో 110 మందిని కాపాడాం

న్యూఢిల్లీ: అరేబియా, ఎర్ర సముద్రంలో వాణిజ్య నౌకలపై దాడుల క్రమంలో గత నవంబర్ నుంచి 90కిపైగా ఘటనలు జరిగాయని నేవీ చీఫ్ అడ్మిరల్ ఆర్.హరికుమార్ తెలిపారు. 'గత నవంబర్ నుంచి మార్చి వరకు సముద్ర జలాల్లో 90కి పైగా డ్రోన్లు, క్షిపణులు, సముద్రపు దొంగల దాడులు జరిగాయి. ఈ క్రమంలో నిర్వహిస్తోన్న ఆపరేషన్లలో 5వేలమందికి పైగా నేవీ సిబ్బంది, 21 నౌకలను రంగంలోకి దింపాం. గల్ఫ్ ఆఫ్ ఎడెన్‌లో ఐదు ప్రధాన ఘటనలలో 110 మందిని కాపాడాం. వారిలో 45 మంది భారతీయులు కాగా 65 మంది విదేశీయులు' అని ఆయన వెల్లడించారు.

రష్యాలో ఉగ్రదాడి

133 మంది మృతి - మరో 107 మందికి గాయాలు

- 60 మంది పరిస్థితి విషమం
- మృతులు పెరిగే అవకాశం
- క్రాకస్ సిటీ హాల్‌లో కాల్పులు
- కాంప్లెక్స్‌లో మంటలు
- నలుగురు ఉగ్రవాదులు సహా 11 మంది అరెస్టు: ఎఫ్ఎస్‌బీ
- మేమే చేశాం: ఐసిస్

మాస్కో: రష్యా రాజధాని మాస్కోలో భీకర ఉగ్రదాడి జరిగింది. ఈ ఘటనలో 133 మంది చనిపోయారు. మరో 107 మందికి గాయాలయ్యాయి. మృతుల్లో ముగ్గురు చిన్నారులు ఉన్నారు. అలాగే గాయపడిన వారిలో ఆరుగురు చిన్నారులు ఉండగా సుమారు 60 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు క్రెమ్లిన్ శనివారం ప్రకటించింది. క్రాకస్ సిటీ కాన్సర్ట్ హాల్‌లో ఆటోమేటిక్ ఆయుధాలతో దుండగులు దాడి చేశారు. కాల్పుల్లో కొందరు చనిపోగా ఇదే క్రమంలో కాంప్లెక్స్‌లో మంటలు చెలరేగి అందులో చిక్కుకొని అనేకమంది ప్రాణాలు కోల్పోయారు. రష్యన్ రాక్ బ్యాండ్ 'పిక్‌నిక్' కాన్సర్ట్ సమయంలో ఈ ఘటన జరిగింది. ఒక్కసారిగా హాహాకారాలు వినిపించాయి. పోలీసులు వెంటనే అక్కడకు చేరుకొని హాల్‌లో చిక్కుకున్న వారిని బయటకు తీశారు. గాయపడిన వారిని అంబులెన్స్‌లలో ఆసుపత్రులకు తరలించారు. ఉగ్రదాడికి సంబంధించిన వీడియోలు వైరలయ్యాయి. దుండగులు కాల్పులు జరపడం, జనాలు భయంతో పరుగులు తీస్తున్నట్లు దృశ్యాలు అందులో కనిపించింది. మొత్తం ఐదుగురు సాయుధులు దాడి చేసినట్లు తెలుస్తోంది. కాగా, నలుగురు ఉగ్రవాదులు సహా 11 మంది అనుమానితులను అరెస్టు చేసినట్లు ఎఫ్ఎస్‌బీ భద్రతా సేవల అధిపతి అలెగ్జాండర్

- మిగతా 2 లో

బీజేపీలో దుమారం

- కాషాయ పార్టీ అభ్యర్థుల్లో టీడీపీ ముద్ర?
- ఓట్ల బదిలీపై ఆందోళన
- నేతల్లో అసంతృప్తి జ్వాల
- కేంద్ర నేతలకు బీజేపీ ఫిర్యాదులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : బీజేపీ రాష్ట్ర పార్టీలో తీవ్ర దుమారం చెలరేగింది. కూటమి పొత్తులో భాగంగా బీజేపీకి కేటాయించిన సీట్లకు అభ్యర్థుల ఎంపిక తీరుపై ఆ పార్టీ నేతల్లో అసంతృప్తి నెలకొంది. ఓటమి పాలయ్యే సీట్లను టీడీపీ కట్టబెడుతోందంటూ బీజేపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో టీడీపీతో పొత్తులో భాగంగా బీజేపీకి ఐదు ఎంపీ, పది అసెంబ్లీ స్థానాలను టీడీపీ కేటాయించింది. దేశ వ్యాప్తంగా ఎన్‌డీఏ కూటమిపైన, నరేంద్ర మోదీపై ఉన్న వ్యతిరేకతతో ఆ పార్టీ ఆచితూచి వ్యవహరిస్తోంది. రాష్ట్రానికి ప్రత్యేక హోదాతో పాటు విభజన హామీల అమలులో బీజేపీ పూర్తిగా విఫలమైంది. ప్రజల నుంచి వాటిని చెరిపివేసే దిశగా బీజేపీ తనదైన శైలిలో మతపరమైన అంశాలతో ముందుకు వెళుతోంది. 2019 ఎన్నికల్లో ఒక శాతంలోపు ఓటింగ్ ఉన్న బీజేపీ ఓట్ల వాటాపై కలవరం చెందుతోంది. టీడీపీ, జనసేన ఓట్లు బీజేపీకి మరలుతాయా?, లేదా? అనేదీ ప్రశ్నార్థకంగా మారింది. ఈ ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిగా ఏర్పడి బరిలోకి దిగుతున్నట్లు ప్రకటించాయి. ఈ కూటమిలో టీడీపీ ఇప్పటివరకు మూడు జాబితాలను విడుదల చేసింది. బీజేపీ మాత్రం వెనుకబాటుకు గురైంది. ఎంపీ స్థానాల కోసం అంతా టీడీపీ నుంచి బీజేపీలోకి చేరిన నేతలుగానీ లేక చంద్రబాబుకు సానుకూలంగా ఉన్న వారు గానీ పోటీలో ఉండేలా కసరత్తు చేయడంపై బీజేపీలో పెద్ద దుమారం నెలకొంది. తొలుత విజయనగరం, అనకాపల్లి, విశాఖపట్నం, రాజమండ్రి, నరసాపురం, ఏలూరు, ఒంగోలు, రాజంపేట, హిందూపురం ఎంపీ స్థానాలను బీజేపీ ఆశించింది. ఇప్పటికే టీడీపీ ప్రకటించిన 13 ఎంపీ స్థానాల్లో విశాఖపట్నం, హిందూపురం ఎంపీ స్థానాలు ఉన్నాయి. విశాఖపట్నం టీడీపీ అభ్యర్థిగా మాత్కుమిల్లి భరత్, హిందూపురం ఎంపీ అభ్యర్థిగా బీకే పార్థసారథిని ప్రకటించారు. దీంతో తాము కోరిన స్థానాలు ఇవ్వకపోవడంపై బీజేపీ నేతలు అసంతృప్తికి గురవుతున్నారు.

టీడీపీకే విశాఖ... జీవీఎల్‌కు చుక్కెదురు

బీజేపీ నాయకుడు జీవీఎల్ నరసింహారావు విశాఖపట్నం ఎంపీగా పోటీ చేసేందుకు కొంత కాలంగా ప్రణాళిక రూపొందించుకున్నారు. బీజేపీ కేంద్ర నాయకత్వం దగ్గర సైతం ఆయన పోటీకి సానుకూల వాతావరణం ఏర్పడింది. టీడీపీతో పొత్తు కారణంగా విశాఖ ఎంపీ సీటును బాలకృష్ణ రెండో అల్లుడు భరత్‌కు ఇవ్వడంతో ఆయనకు చుక్కెదురైంది. దీంతో ఈ ఎన్నికల్లో జీవీఎల్‌కు సీటు లేనట్లేనని స్పష్టమైంది. ఏలూరు ఎంపీ సీటు కోసం మాజీ ఎంపీ సుజనా చౌదరి తీవ్రంగా ప్రయత్నించారు. అక్కడ బీజేపీ నేత మరొకరు తనకు బీజేపీ ఎంపీ టికెట్ వస్తుందని ఆశించారు. దీంతో టీడీపీ ఏలూరు ఎంపీ అభ్యర్థిగా పుట్టా మహేశ్ యాదవ్‌ను ప్రకటించడంపై అక్కడ బీజేపీ నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నరసాపురం సీటు పొత్తుల్లో భాగంగా బీజేపీకి వెళ్లేందుకు దాదాపు ఖరారైంది. ఇక్కడ వైసీపీ రెబల్ ఎంపీ రఘురామ కృష్ణరాజు మాత్రం పొత్తుల్లో భాగంగా టీడీపీ లేదా, బీజేపీలో ఎవ్వరికి ఖరారైనా తానే అభ్యర్థిననే దీమాతో ఉన్నారు. అయితే నరసాపురం ఎంపీ స్థానం బీజేపీకి ఇస్తే, బీజేపీలో ఉన్న అసలైన నేతలకు మాత్రమే ఇవ్వాలంటూ ఆ పార్టీ రాష్ట్ర నేతలు పట్టుపడుతున్నారు. దీంతో రఘురామ కృష్ణరాజు సీటుకు ఎసరు పడే అవకాశముంది. అటు పొత్తుల్లో భాగంగా టీడీపీకి ఆ సీటు వచ్చినా, అక్కడ రఘురామ కృష్ణరాజుకు ఎంపీ అభ్యర్థి ఇచ్చే అంశంపై టీడీపీ ఆలోచనలో పడింది. గతంలో వైసీపీ ఎంపీ అభ్యర్థిగా గెలిచిన అనంతరం దాదాపు నాలుగున్నరేళ్లపాటు ఆయన నియోజకవర్గానికి దూరంగా ఉన్నారు. స్థానిక సమస్యలపై ఆరా తీయలేదు. దీంతో ఆయన టీడీపీ, లేదా బీజేపీ నుంచి పోటీకి దిగితే ఓటమి తథ్యమనే సంకేతాలు అందుతున్నాయి. ఇప్పటికే నరసాపురం వైసీపీ ఎంపీ సీటును బీసీ మహిళలకు కేటాయించింది. దానికి అనుగుణంగా బీజేపీ లేదా టీడీపీ అభ్యర్థిని నిలిపే ఆలోచనలు ఉన్నాయి. ఇది రఘురామ కృష్ణరాజుకు మింగుడు పడటం లేదు.

సీఎం రమేశ్‌పై వ్యతిరేకత

అనకాపల్లి నుంచి బీజేపీ నేత సీఎం రమేశ్ బరిలో దిగేందుకు అన్ని విధాలా. చక్కదిద్దుకున్నారు. ఆయన బీజేపీలో ఉన్నప్పటికీ, టీడీపీ అధినేత చంద్రబాబుకు సన్నిహితుడిగా మెలుగుతున్నారు. సీఎం రమేశ్‌కు అనకాపల్లి టికెట్ ఇవ్వడంపై సొంత బీజేపీలోనే వ్యతిరేకత నెలకొంది. తాజాగా ఆయనపై హైదరాబాద్ జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో సినీనటుడు వేణు ఫిర్యాదు చేయడం కలకలంగా మారింది. వేణుకు చెందిన పీసీఎల్ జాయింట్ వెంచర్ కంపెనీలో రూ.450 కోట్ల మేర మొత్తానికి రమేశ్ ఫోర్జరీకి పాల్పడినట్లు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇది సీఎం రమేశ్‌కు పెద్ద ఎదురుదెబ్బ కానుంది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, మాజీ

- మిగతా 2 లో

వైసీపీ పెద్దల చేతికి
విశాఖ ఉక్కు భూములు?

- పెద్ద ప్లాట్‌లకు తక్కువ... చిన్న ప్లాట్‌లకు ఎక్కువ ధర
- ముందుగానే రింగయిన బడాబాబులు
- అధికారులతో లాలూచీ
- విశాఖ ఉక్కు అమ్మకానికి కుట్ర

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: విశాఖ నగరం నడిబొడ్డున ఉన్న ఉక్కు భూములను కొంతమంది వైసీపీ కీలక నేతలు హస్తగతం చేసుకున్నట్లు తెలుస్తోంది. విలువైన ప్లాంట్ భూములు కొట్టేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశాఖ

- మిగతా 2 లో

మరో నలుగురు అభ్యర్థులతో
సీపీఐ జాబితా

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల తేదీ సమీపిస్తుండటంతో భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) మరో నలుగురు అభ్యర్థులను ప్రకటించింది. బీహార్, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో పోటీ చేసే స్థానాలు, అభ్యర్థుల జాబితాను పార్టీ ప్రధాన కార్యదర్శి డి.రాజా శనివారం విడుదల చేశారు. బీహార్‌లోని బెగుసరాయి నుంచి అవదేశ్ కుమార్ రాయ్, మధ్యప్రదేశ్‌లోని సిద్దీ స్థానం నుంచి సంజయ్ కుమార్ నామ్‌దేవ్, షాదోల్ నుంచి సమర్ షా పోటీ చేస్తుండగా చత్తీస్‌గఢ్‌లోని బస్తర్ నుంచి ఫూల్ సింగ్ కచ్‌లమ్ పోటీ చేస్తారని రాజా ప్రకటించారు.

ఆప్‌పై ఉక్కుపాదం

- పార్టీ కార్యాలయానికి తాళం
- అధికార నివాసాల్లోకి వెళ్లనివ్వని వైనం
- కేంద్రం తీరుపై అతిశి, భరద్వాజ్ ఆగ్రహం
- తమను నియంత్రించే అధికారం పోలీసులకు ఎక్కడిదని నిలదీత
- ఎన్నికల వేళ నిరంకుశత్వ చర్యలపై ఈసీకి ఫిర్యాదు చేస్తామని ప్రకటన

న్యూఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)పై కేంద్రప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. ఆ పార్టీ కేంద్ర కార్యాలయాన్ని మూసివేయించింది. అధికార నివాసాల్లోకి వెళ్లనివ్వకుండా నాయకులను అడ్డుకునేలా పోలీసులను పురామాయించింది. దీంతో ఆప్ సీనియర్ నాయకులు సౌరభ్ భరద్వాజ్, అతిశీ ఆగ్రహం వ్యక్తం చేశారు. గూండాయిజం మొదలైందని, శాంతి భద్రతలు క్షీణించాయన్నారు. పోలీసుల

- మిగతా 2 లో

హైకోర్టుకు కేజ్రీవాల్ — రిమాండ్‌ను సవాల్ చేసిన సీఎం : తక్షణ విడుదలకు వినతి 2లో

గాజాలో తక్షణమే కాల్పుల విరమణ

ఐరాస పిలుపు

ఈజిప్టు పర్యటనలో గుటెర్రస్

2లో

కవిత కస్టడీ మూడు రోజులు పొడిగింపు

- బెయిల్ పిటిషన్ దాఖలు... వ్యతిరేకించిన ఈడీ
- విచారణకు సహకరించడం లేదన్న దర్యాప్తు అధికారులు
- ఆమె బంధువుల ఇళ్లలో సోదాలు చేస్తున్నట్లు వెల్లడి

న్యూఢిల్లీ/హైదరాబాద్ : దిల్లీ మద్యం పాలసీ కుంభకోణం మనీ లాండరింగ్ కేసులో నిందితురాలిగా ఉన్న బీఆర్ఎస్ నాయకురాలు కె.కవిత ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కస్టడీని శనివారం ఇక్కడి కోర్టు మార్చి 26 వరకు పొడిగించింది. వారం రోజులుగా కవితను ప్రశ్నిస్తున్నారు. వారం రోజుల కస్టడీ ముగియడంతో ఎమ్మెల్సీ కవితను రౌజ్ అవెన్యూ సీబీఐ ప్రత్యేక కోర్టులో ఈడీ హాజరుపరిచింది. తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు

- మిగతా 2 లో

కూటమికి 160 సీట్లు

- కడప సహా 24 ఎంపీ స్థానాల్లోనూ గెలుపు మాదే
- రాష్ట్ర ప్రయోజనాల కోసమే మూడు పార్టీల పొత్తు
- టీడీపీ అధినేత చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తు పెట్టుకున్నాయని టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఉద్ఘాటించారు. రాజకీయ ప్రయోజనమో, వ్యక్తిగత ప్రయోజనమో కాకుండా రాష్ట్రాభివృద్ధి కోసమే మూడు పార్టీలు కలిసి వెళుతున్నాయని స్పష్టం చేశారు. 160కి పైగా స్థానాలతో ఏపీలో అధికారంలోకి రాబోతున్నామని, కడప పార్లమెంటుతో సహా 24 ఎంపీలూ గెలవబోతున్నామని చంద్రబాబు దీమా వ్యక్తం చేశారు. కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులతో విజయవాడలోని ఏ1 కన్వెన్షన్‌లో శనివారం వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా అభ్యర్థులకు చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. పొత్తులో భాగంగా మనమంతా భేషజాలు లేకుండా జట్టుగా ముందుకు నడవాలి. ఈ ఎన్నికల్లో మనం జాగ్రత్తగా వ్యవహరించాలి. వైసీపీ ప్రభుత్వం వచ్చాక రౌడీయిజం, అధికార దుర్వినియోగం

- మిగతా 2 లో

ఇదీ లోకం!

తూతూమంత్రపు తనిఖీలు

అక్రమార్కులకు విశాఖ పోర్టు కేంద్రం

డ్రగ్స్ రవాణాపై సమగ్ర విచారణ కోసం ప్రజాసంఘాలు, వామపక్షాల డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: విశాఖ పోర్టులో పట్టుబడిన డ్రగ్స్‌పై ఎన్నో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విశాఖలో సంధ్య ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ సంస్థ రొయ్యల మేత పేరుతో డ్రగ్స్ దిగుమతి చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ నెల 16వ తేదీన షిప్ విశాఖ వచ్చినప్పటికీ 21వ తేదీ వరకు అత్యంత రహస్యంగా ఉంచారు. ఇందులో వైసీపీ, టీడీపీ, బీజేపీ నేతల పాత్ర ఉన్నట్లు ప్రజలు భావిస్తున్నారు. విశాఖతో పాటు రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ, టీడీపీ, బీజేపీ నేతలు మాత్రం పరస్పరం ఆరోపించుకుంటున్నారు. ఇందులో నిఘా వ్యవస్థ వైఫల్యం కనిపిస్తోంది. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి దోషులు ఎంతటివారైనా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మేధావులు, నగర ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. బ్రెజిల్ నుంచి సంధ్య మెరైన్ ఎక్స్‌పోర్ట్సుకు డ్రగ్స్‌తో కూడిన కంటైనర్ ఎలాంటి ఆటంకం లేకుండా ఇక్కడకు వచ్చింది. ఇంత యథేచ్ఛగా డ్రగ్స్ విశాఖపట్నానికి వచ్చిందంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంత నిర్లక్ష్యంగా ఉన్నాయో అర్థమౌతోంది. సంధ్య మెరైన్ ఎండీ కూన వీరభద్రరావు, డాక్టర్ కేవీ ప్రసాదరావు ఉమ్మడిగా ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ వ్యాపారం చేస్తున్నారు. డాక్టర్ కేవీ ప్రసాదరావు స్వయాన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి వియ్యంకుడు. వారు విశాఖలో పినాకిల్ హాస్పటల్ కూడా నడుపుతున్నారు. సమాజానికి

- మిగతా 2 లో

గాజాలో తక్షణమే కాల్పుల విరమణ

ఐరాస పిలుపు - ఈజిప్టు పర్యటనలో గుటెర్రస్

ఐరాస/కైరో: ఐదు నెలలకుపైగా ఇజ్రాయిల్, హమాస్ మధ్య పోరు సాగుతుండటంతో గాజా అస్తవ్యస్తమైంది. పలస్తీనియన్లు తినడానికి తిండి, తాగడానికి నీరు, ఉండటానికి ఇల్లు, వైద్యం చేయించుకోవడానికి ఆసుపత్రులు లేక అష్టకష్టాలు పడుతున్నారు. ప్రతి క్షణం ఒక యుగంగా గడుపుతున్నారు. పస్తులు ఉంటూ ప్రాణాలు విడుస్తున్నారు. అత్యంత మానవీయ సంక్షోభ పరిస్థితులపై ఐక్యరాజ్య సమితి (ఐరాస) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. తక్షణమే కాల్పులు విరమించాలని మారోసారి పిలుపునిచ్చింది. ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్ శనివారం ఈజిప్టు-గాజా సరిహద్దును సందర్శించారు. దక్షిణ గాజా నగరమైన రఫాలో భారీ సైనిక ఆపరేషన్ చేపట్టనున్నట్లు ఇజ్రాయిల్ హెచ్చరించిన సమయంలో ఐరాస చీఫ్ పర్యటన చర్చనీయాంశంగా మారింది. రఫాలో 2.3 మిలియన్ల మంది పలస్తీనియన్లు ఆశ్రయం పొందుతున్నారు. గుటెర్రస్ ఈజిప్టులోని అర్ అరిష్ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆయనకు ప్రాదేశిక గవర్నర్ మహమ్మద్ శుషా స్వాగతం పలికారు. ఇదే విమానాశ్రయంలో గాజా కోసం వచ్చే అంతర్జాతీయ సహాయ సామాగ్రి నిల్వఉన్నది. గాజాకు పంపేందుకు ఏడు వేల ట్రక్కులు సిద్ధంగా ఉన్నాయని కానీ ఇజ్రాయిల్ తనిఖీల ప్రక్రియ వల్ల సాయం ఆలస్యమవుతోందని శుషా కార్యాలయం పేర్కొంది. గుటెర్రస్ తన పర్యటనలో భాగంగా అల్ అరిష్ ఆసుపత్రిని సందర్శించి అక్కడ చికిత్స పొందుతున్న బాధిత పలస్తీనియన్లను పరామర్శిస్తారు. అలాగే ఐరాస మానవతా వర్కర్లనూ కలుస్తారు. ఇజ్రాయిల్ పద్ధతిలో మార్పు రాకపోవడంతో అంతర్జాతీయ సమాజం పిలుపు ఇచ్చినప్పటికీ రంజాన్ వేళ మానవతా దృక్పథంతో గాజాలో పరిస్థితి మెరుగు కాగలదన్న ఆశలు క్షీణించాయి. అమెరికాతో పాటు ప్రపంచ దేశాల విన్నపాలను ఇజ్రాయిల్ పూర్తిగా బేఖాతరు చేసింది. భీకర దాడులను కొనసాగిస్తూ నిత్యం వందల మంది పలస్తీనియన్ల ప్రాణాలు హరిస్తోంది. మృతుల్లో అధికారంగా చిన్నారులు, మహిళలు ఉండటం గమనార్హం. ఇప్పటికే ఇజ్రాయిల్ దాడుల్లో చనిపోయిన పలస్తీనియన్ల సంఖ్య 32వేలు దాటింది. గాయపడిన వారి సంఖ్య 75వేలకు చేరుకున్నట్లు సమాచారం.

స్లోవేకియాలో అధ్యక్ష ఎన్నికలు

తొలి దశలో పెల్లెగ్రిని, కోర్కోక్ ఆధిక్యత

బ్రటిస్లావా: స్లోవేకియా అధ్యక్ష ఎన్నికల్లో భాగంగా శనివారం తొలి దశ పోలింగ్ జరిగింది. మొత్తం తొమ్మిది మంది అధ్యక్ష రేసులో ఉన్నారు. పార్లమెంటు స్పీకర్ పీటర్ పెల్లెగ్రిని, విదేశాంగ శాఖ మాజీ మంత్రి ఇవాన్ కోర్కోక్ (విపక్షాలు మద్దతిచ్చే అభ్యర్థి) ఆధిక్యత కొనసాగించారు.

పెల్లెగ్రినికి 37శాతం ఓట్లు రాగా ఇవాన్ కోర్కోక్‌కు 36శాం ఓట్లు వచ్చినట్లు ఇప్సోస్ ఏజెన్సీ సర్వే తేల్చింది. స్లోవికియా అధ్యక్ష పదవి అలంకారప్రాయమైనదేగానీ అంతర్జాతీయ ఒప్పందాలు ఆమోదించడం, న్యాయమూర్తులను, సాయుధ దళాల కమాండర్ ఇన్ చీఫ్‌ను నియమించవచ్చు. పార్లమెంటు చేసే చట్టాలను వీటో చేసే అధికారం ఉంటుంది.

ఆప్‌పై ఉక్కుపాదం

(మొదటిపేజీ తరువాయి)

అత్యుత్సాహాన్ని ఆక్షేపించారు. తమను నియంత్రించే అధికారం ఖాకీలకు ఎక్కడిదని నిలదీశారు. ఇలాంటి నిర్బంధకాండ నడుమ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ ఎలా చేయాలని ప్రశ్నించారు. తమ నాయకులు ఇలా విధంగా వివక్షకు గురవుతుండటంపై కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై మాట్లాడేందుకు తమకు సమయం ఇవ్వాలని కోరారు. పోలీసు దూకుడుకు ఎన్నికల సంఘం కళ్లెం వేస్తుందని ఆకాంక్షిస్తున్నట్లు భరద్వాజ్ 'ఎక్స్'లో పేర్కొన్నారు.

ఢిల్లీలోని ఆప్ ప్రధాన కార్యాలయాన్ని కేంద్ర ప్రభుత్వం స్వాధీనపర్చుకున్నదని, కార్యాలయానికి వెళ్లే అన్ని మార్గాలను మూసివేయించిందని అతిశీ ఆరోపించారు. ఎన్నికల వేళ ఉద్దేశపూర్వకంగా జాతీయ పార్టీ కార్యకలాపాలను నిరంకుశంగా అడ్డుకుంటోందని కేంద్రంపై విరుచుకుపడ్డారు. ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని శనివారం విలేకరుల సమావేశంలో ప్రకటించారు. ఎన్నికల సంఘం నిష్పాక్షికంగా వ్యవహరిస్తుందని, పోలీసు అధికారులపై కఠిన చర్యలు తీసుకునేలా మార్గదర్శకాలను జారీ చేస్తుందని ఆకాంక్షించారు. ఎన్నికల కమిషనర్‌ను కలిసేందుకు సమయాన్ని కోరామని, నేరుగా వెళ్లి ఫిర్యాదు చేస్తామని చెప్పారు. మద్యం కుంభకోణం డబ్బు బీజేపీ ఖాతాల్లోకి వెళ్లిందని ఆరోపిస్తూ ఈ వ్యవహారంలో ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాను అరెస్టు చేయించగలరా అంటూ ప్రధాని మోదీతో పాటు ఈడీకి అతిశీ సవాల్ విసిరారు. మద్యం కేసులో తమ అధినేతను అక్రమంగా అరెస్టు చేయడమే కాకుండా పార్టీ ప్రధాన కార్యాలయాన్ని అన్ని వైపుల నుంచి మూసివేయడం ఏమిటంటూ నిలదీశారు. ఎన్నికల వేళ రాజ్యాంగాన్ని అతిక్రమిస్తూ... అరాచక విధానాలను కేంద్రం అనుసరిస్తోందని ఆరోపించారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఓ జాతీయ పార్టీ కార్యకలాపాలను ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటోందని, దీనిపై ఈసీకి ఫిర్యాదు చేస్తామని అతిశీ వెల్లడించారు. 'మద్యం' సొమ్మంతా ఎన్నికల బాండ్ల రూపంలో బీజేపీ ఖాతాల్లోకే వెళ్లిందని, ఇదే వ్యవహారంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాను అరెస్టు చేయగలరా అని ప్రధాని మోదీకి, ఈడీకి అతిశీ సవాల్ విసిరారు. ఈ కుంభకోణానికి సంబంధించి తమ పార్టీ నేతల్లో ఏ ఒక్కరి వద్ద డబ్బు దొరకలేదని నొక్కిచెప్పారు. రెండేళ్లుగా సీబీఐ, ఈడీ సోదాలు కొనసాగుతున్నా ఒక్కరూపాయి రికవరీ కాలేదు...ఆ డబ్బు మొత్తం ఎక్కడికి వెళ్లినట్టో అని అతిశీ వ్యాఖ్యానించారు. అరబిందో ఫార్మా యజమాని శరత్ చంద్రారెడ్డి దర్యాప్తు, ఆయన వాంగ్మూలంలో కేజ్రీవాల్ పేరు ప్రస్తావన గురించి మాట్లాడుతూ 'శరత్ చంద్రారెడ్డి వాంగ్మూలం ఆధారంగానే కేజ్రీవాల్‌ను అరెస్టు చేశారు. మద్యం కుంభకోణానికి సంబంధించి 2022, నవంబరు 9న శరత్ చంద్రారెడ్డిని దర్యాప్తు అధికారులు ప్రశ్నించారు. తానెప్పుడూ కేజ్రీవాల్‌ను కలవలేదని, ఆప్‌తో ఎలాంటి సంబంధాలు లేవని ఆయన వారిలో చెప్పారు. కానీ మరుసటి రోజే శరత్‌ను ఈడీ అరెస్టు చేసింది. కొన్ని నెలలు జైల్లో ఉన్న తర్వాత శరత్ వాంగ్మూలం మారిపోయింది. కేజ్రీవాల్‌ను కలిశానని, మద్యం విధానం గురించి ఆయనతో మాట్లాడానంటూ శరత్ చంద్రారెడ్డి వాంగ్మూలం ఇచ్చారు. దీంతో ఆయనకు వెంటనే బెయిల్ లభించింది. శరత్ చంద్రారెడ్డి బీజేపీకి తొలుత 4.5 కోట్లు... ఆపై 55 కోట్లు విలువైన ఎన్నికల బాండ్లు ఇచ్చాడు. ఈ సొమ్మంతా బీజేపీకి వెళ్లింది. దీనిపై నడ్డాను అరెస్టు చేయించగలరా? అని మోదీని, ఈడీని అతిశీ ప్రశ్నించారు. కేజ్రీవాల్ అరెస్టుకు నిరసనగా ఆప్ అధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు జరగడంతో దీనదయాళ్ ఉపాధ్యాయ మార్గ్‌లోని ఐటీవో సమీపంలోని ఆప్ కేంద్ర కార్యాలయాన్ని శుక్రవారం అధికారులు మూసివేసి ఎవరినీ లోనికి వెళ్లనివ్వని సంగతి తెలిసిందే.

గాజాపై ఐరాసలో అమెరికా తీర్మానం

వీటో చేసిన రష్యా, చైనా

న్యూయార్క్: గాజా పరిస్థితిపై ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి (యూఎన్‌ఎస్‌సీ)లో అమెరికా తీర్మానాన్ని రష్యా, చైనా వీటో చేశాయి. ఆరు నెలల్లో 32వేల మంది పలస్తీనియన్లను చంపిన ఇజ్రాయిల్... సైనిక దాడులను తక్షణమే నిలిపివేయాలని, తక్షణమే కాల్పులు విమరించాలని, ఇది అత్యవసరమని పేర్కొంటూ అమెరికా తీర్మానం చేసింది. పరిస్థితి చేయి దాటిపోతోందని హెచ్చరించింది. వేలాది మంది పలస్తీనియన్లను ఇజ్రాయిల్ నిర్బంధించి, తీవ్రంగా వేధించినట్లు పేర్కొనకుండా ఇజ్రాయిల్ బందీలను తక్షణమే విడుదల చేయాలన్న డిమాండును కాల్పుల విరమణపై యూఎన్‌ఎస్‌సీ చర్చల్లో ప్రస్తావించింది. ఓ వైపు ఖతార్‌లో రాజీ కోసం చర్చలు జరుగుతుండగా మరోవైపు భద్రతా మండలిలో ఓటింగ్ జరగడం ప్రాధాన్యతను సంతరించుకుంది. గాజాలో మానవతా సంక్షోభం పరిష్కారానికి తక్షణ-సుస్థిర కాల్పుల విరమణ ఒప్పందంలో భాగంగానే హమాస్ నిర్బంధంలో ఉన్న బందీలను విడుదల చేయాలని అమెరికా రాయబారి లిండా థోమస్ గ్రీన్‌ఫీల్డ్ వెల్లడించారు. ఈ తీర్మానాన్ని ఆమోదించడం ద్వారా తమ ఒప్పందాన్ని అంగీకరించేలా హమాస్‌పై ఒత్తిడి పెరుగుతుందని చెప్పారు. అమెరికా తీర్మానానికి 11 అనుకూల, మూడు వ్యతిరేక ఓట్లు వచ్చాయి. గయానా గైర్హాజరైంది. రష్యా, చైనా వీటో అధికారాన్ని వినియోగించగా అల్జీరియా కూడా ఈ దేశాల సరసన చేసింది.

విశాఖ ఉక్కు భూములు?

(మొదటిపేజీ తరువాయి)

ఉక్కు ప్రైవేటీకరణకు ద్వారాలు తెరిచాయి. ఆర్థికంగా కష్టాల్లో ఉన్న స్టీల్‌ప్లాంట్‌ను ఏమాత్రం ఆదుకోకుండా పాలకులు నష్టాల సాకుతో ప్రైవేటీకరణకు పూనుకున్నారు. అందులో భాగంగా విశాఖలోని ప్లాంట్ ఆస్తులను ఇటీవల అమ్మకానికి పెట్టారు. ఈ భూముల అమ్మకం ప్రక్రియ ఎన్‌బీసీసీ చేపట్టినప్పటికీ అధికార పార్టీ పెద్దలు కొంతమంది వ్యూహాత్మకంగా అడుగులు వేసి తక్కువ ధరకే సొంతం చేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. స్థలాలకు అన్ని వైపులా రహదారులున్నప్పటికీ చిన్నచిన్న ప్లాట్లుగా విభజించకుండా, వైసీపీ పెద్దల కన్నుపడిన స్థలాలను పెద్ద బ్లాకులుగానే వేలం వేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ప్రీబిడ్ సమావేశంలోనే కొంతమంది వైసీపీ నేతలు, వ్యాపారులు సిండికేట్ అయ్యారని సమాచారం. ఈ వేలంలో పెద్ద ప్లాట్లకు తక్కువ ధరతో, చిన్న ప్లాట్లకు ఎక్కువ ధరతో బిడ్లు పడటం విశేషం. రాష్ట్రంలో వివిధ జిల్లాలకు చెందిన కొందరు వైసీపీ నేతలు భాగస్వాములుగా ఈ పెద్ద బ్లాకులను గుప్పిట్లోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు నగరంలో వివిధ చోట్ల 25 ఎకరాల స్థలాలున్నాయి. వీటి విలువ బహిరంగ మార్కెట్లో రూ.2 వేలకోట్ల వరకు ఉంటుందని అంచనా. హెచ్‌బీ కాలనీలో 22.90 ఎకరాలు ఉండగా, అందులో 11.80 ఎకరాలు, ఆటోనగర్‌లో రెండెకరాలు, పెదగంట్యాడలో 0.89 ఎకరాలు అమ్మేందుకు మొదటి విడతలో సిద్ధం చేశారు. ఫిబ్రవరి 27న విశాఖలో పెట్టుబడిదారుల సదస్సు నిర్వహించారు. 67,307 చదరపు గజాల్లో 130 ప్లాట్ల అమ్మకానికి ఈ-వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హెచ్‌బీ కాలనీ స్థలాలను 14 పెద్ద బ్లాక్‌లుగా, 111 చిన్న ప్లాట్లుగా, ఆటోనగర్‌లో 4 బ్లాకులుగా, పెదగంట్యాడ స్థలం మొత్తం ఒకే బ్లాక్‌గా విభజించారు. హెచ్‌బీ కాలనీలోని బ్లాక్‌లు ఒక్కోటి 635-5350 చదరపు గజాల మధ్య విస్తీర్ణం ఉండగా, ఆటోనగర్‌లో 1676-2,895 చదరపు గజాల విస్తీర్ణం ఉండేలా విభజించారు. హెచ్‌బీ కాలనీలో గజం రూ.78 వేల నుంచి రూ.85 వేల ధర పెట్టగా, ఆటోనగర్‌లో రూ.30-32 వేలుగా నిర్ణయించారు. ప్రీబిడ్ పేరుతో ఈ నెల 5, 6 తేదీల్లో ఆసక్తిగల పెట్టుబడిదారులందరినీ మరోసారి ఒకచోటకు చేర్చినట్లు సమాచారం. కేవలం పెద్దబ్లాక్‌ను దక్కించుకోవడానికి వైసీపీ బడానేతలు కొందరు కలిసి తమ బినామీలను రంగంలోకి దింపారని, ఆ మేరకు సిండికేట్ అయినట్లు సమాచారం. ఈనెల 14న ఈ-వేలం జరిగింది. ఇందులో పెద్దల బినామీలు కన్నేసిన బ్లాక్ వైపు ఎవరూ రాకుండా జాగ్రత్త పడినట్లు తెలిసింది. పెద్ద బ్లాకులకు నిర్ణయించిన ధరపై కేవలం రూ.వెయ్యి మాత్రమే పెంచి ఈవేలంలో దరఖాస్తు చేశారు. హెచ్‌బీ కాలనీలో చదరపు గజం మార్కెట్ ధర రూ.లక్ష ఉండగా, రూ.78-85 వేలుగా నిర్ణయించారు. అదే హెచ్‌బీ కాలనీలోని చిన్నప్లాట్లు చదరపు గజం రూ.1.50 లక్షల వరకు ధర పలికినట్లు సమాచారం. ఇప్పటికే రాజధాని పేరుతో విశాఖలో భూముల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. తక్కువ ధరకు కాజేస్తున్న భూములను రియల్ ఎస్టేట్ సంస్థల ద్వారా భారీ ప్రాజెక్టులకు అమ్మకానికి కొంతమంది నేతలు ఇప్పటికే ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది. విశాఖ పోర్టుకు చెందిన 11 ఎకరాల భూమిని ఇనార్బిట్ మాల్‌కు కారుచౌకగా కట్టబెట్టారన్న ఆరోపణలు ఉన్నాయి. విలువైన ప్రభుత్వ రంగ సంస్థల ఆస్తులను వేలం రూపంలో కనీస ధరతో కొనుగోలు చేసి...అధిక ధరలకు అమ్ముకొని కొంతమంది కోట్లాది రూపాయలు సొమ్ము చేసుకున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. విశాఖ స్టీల్‌ప్లాంట్ కూడా తమ నష్టాలు పూడ్చుకోవడానికి ఆస్తులు అమ్మకానికి పెట్టడంపై అటు కార్మిక సంఘాలు, ఉద్యోగులు, కార్మికులు, నిర్వాసితులు పెద్దఎత్తున ఆందోళన చేస్తున్నారు. విలువైన విశాఖ స్టీల్‌ప్లాంట్ భూములను దశలవారీగా అమ్మకాలు చేపట్టి చివరికి స్టీల్‌ప్లాంట్‌ను మూసేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పన్నాగం పన్నుతున్నట్లు కార్మిక సంఘాలు, వామపక్షాలు మండిపడుతున్నాయి.

కవిత కస్టడీ మూడు రోజులు పొడిగింపు

(మొదటిపేజీ తరువాయి)

కుమార్తె కవిత దేశ రాజధానిలో మద్యం లైసెన్సుల భారీ వాటాకు ప్రతిఫలంగా ఆమ్ ఆద్మీ పార్టీకి రూ.100 కోట్ల ముడుపులు చెల్లించినట్లు ఆరోపణలు ఎదుర్కొన్న 'సౌత్ గ్రూప్'లో కీలక సభ్యురాలిగా ఉన్నారని ఈడీ ఆరోపించింది. నలుగురు వ్యక్తుల వాంగ్మూలాలు, ఆమె ఫోన్ నుంచి సేకరించిన సమాచారానికి సంబంధించిన ఫోరెన్సిక్ నివేదికను ఈడీ సమర్పించింది. ఆమెను మరో 5 రోజుల కస్టడీకి ఇవ్వాలని కేంద్ర దర్యాప్తు సంస్థ అధికారులు కోర్టును కోరారు. కేసు దర్యాప్తు పురోగతిని ఈడీ న్యాయవాది కోర్టుకు వివరించారు. మరికొందరితో కలిపి ఆమెను ప్రశ్నించాల్సి ఉందని పేర్కొన్నారు. కవిత కుటుంబ సభ్యుల వ్యాపార లావాదేవీలపై విచారణ జరుపుతున్నామని తెలిపారు. హైదరాబాద్‌లోని ఆమె మేనల్లుడి ఇంట్లో కూడా సోదాలు నిర్వహిస్తున్నట్లు దర్యాప్తు సంస్థ కోర్టుకు తెలిపింది. కవితకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని.. వైద్యులు సూచించిన ఆహారాన్నే ఇస్తున్నామని దర్యాప్తు అధికారులు వెల్లడించారు. రెండు పక్షాల వాదనలు విన్న కోర్టు కవిత కస్టడీని మరో మూడు రోజులు పొడిగిస్తూ తీర్పు వెలువరించింది. ఈనెల 26న ఉదయం 11:30 గంటలకు కోర్టు ముందు హాజరుపరచాలని ఆదేశించింది. మరోవైపు సీబీఐ కోర్టులో బెయిల్ పిటిషన్‌ను కవిత తరపు న్యాయవాది దాఖలు చేశారు. వెంటనే ఈడీకి నోటీసులు ఇవ్వాలని కోరారు. కాగా, కవిత తనకు బెయిల్ ఇవ్వాలని దాఖలు చేసిన పిటిషన్‌ను ఈడీ వ్యతిరేకించింది. కోర్టులోకి వెళ్లే ముందు కవిత మీడియాతో మాట్లాడారు. తన అరెస్టు అక్రమమని... తనపై తప్పుడు కేసులు పెట్టారని, ఈడీ అధికారులు అడిగిన వివరాలే మళ్లీ మళ్లీ అడుగుతున్నారని ఆరోపించారు. అక్రమ కేసులపై కోర్టులో పోరాటం చేస్తానని ఆమె స్పష్టం చేశారు. ప్రస్తుతం బెయిల్‌కు విచారణ అర్హత లేని వాదించింది. తెలంగాణ శాసన మండలి సభ్యురాలు కవిత (46) ను మార్చి 15న హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లోని ఆమె నివాసం నుంచి ఈడీ అరెస్టు చేసింది.

కవిత ఆడపడుచు, మేనల్లుడి నివాసాల్లో సోదాలు

ఢిల్లీ మద్యం పాలసీలో అక్రమ నిధుల బదిలీ లేదా నేరాల ద్వారా వచ్చిన ఆదాయాలలో బీఆర్‌ఎస్ నాయకురాలు కవిత మేనల్లుడు ప్రమేయం ఉందని ఈడీ శనివారం ఆరోపించింది. ఈ కేసులో కవిత బంధువు మేకా శరన్ పాత్ర వెలుగులోకి రావడంతో హైదరాబాద్‌లోని అతని నివాసంలో శనివారం సోదాలు నిర్వహించినట్లు ఢిల్లీలోని న్యాయమూర్తి జస్టిస్ కావేరీ బవేజా ప్రత్యేక ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ (పీఎంఎల్‌ఏ) కోర్టుకు ఈడీ వివరించింది. అలాగే కవిత ఆడపడుచు నివాసంలో కూడా దర్యాప్తు అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. కవిత ఆడపడుచు అఖిల, మేనల్లుడు మేకా శరన్ ద్వారా లావాదేవీలు జరిపినట్లు, ఇద్దరికి ఉన్న కంపెనీల ద్వారా నగదు బదిలీ అయినట్టు ఈడీ అనుమానిస్తోంది. ఈ నేపథ్యంలో శరన్ నివాసంలో సోదాలు నిర్వహిస్తున్నప్పటికీ, మేకా శరన్ ఈడీ అధికారులకు ఫోన్‌లో అందుబాటులో లేరు. మార్చి 15న హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లోని బీఆర్‌ఎస్ నాయకురాలి ఇంట్లో సోదాలు సందర్భంగా శరన్ మొబైల్ పరికరాన్ని స్వాధీనం చేసుకున్నట్లు కవితకు రిమాండ్ పొడిగింపు పత్రాల్లో ఈడీ కోర్టుకు తెలిపింది. శరన్‌ను రెండుసార్లు విచారణకు పిలిచినా అతను హాజరు కావడంలో విఫలమయ్యాడని వివరించింది. గత ఏడు రోజుల విచారణలో శరన్‌కు 'ఇండో స్పిరిట్స్ (కవిత, మాగుంట శ్రీనివాసులు రెడ్డి (వైసీపీ ఎంపీ), అతని కుమారుడు రాఘవ్ మాగుంట, వ్యాపారవేత్త, ఇండో స్పిరిట్స్ ప్రమోటర్ సమీర్ మహేంద్రు) మధ్య కుట్రతో సృష్టించబడిన నేరాల ద్వారా వచ్చిన ఆదాయాన్ని బదిలీ చేయడం/వినియోగం చేయడంలో ప్రమేయం ఉన్నట్లు తేలింది. 'కేసులో దర్యాప్తుకు సంబంధించిన సమాచారం శరన్ వద్ద ఉంది. అతను దర్యాపునకు సహకరించడం లేదు. అందువల్ల పీఎంఎల్‌ఏ సెక్షన్ 17 ప్రకారం అతని ప్రాంగణంలో సోదాలు జరుగుతున్నాయి' అని ఈడీ తెలిపింది. శరన్ ద్వారా నేరం ద్వారా వచ్చిన ఆదాయాన్ని బదిలీ చేయడం/వినియోగం చేయడం, అరెస్టు చేసిన వ్యక్తి (కవిత) పాత్రను నిర్ధారించడం కోసం సమీర్ మహేంద్రు తదుపరి విచారణ కోసం తన దరఖాస్తును అనుమతించాలని కూడా కోర్టును అభ్యర్థించింది. ఈ కేసులో మహేంద్రును గతంలో ఈడీ అరెస్ట్ చేసింది. శరన్ కవితకు 'సమీప బంధువు' అని, మార్చి 15న ఈడీ దాడి చేసిన సమయంలో ఆమె ప్రాంగణంలో కూడా ఉన్నాడని, ఇది 'గమనించవలసిన విషయం' అని చెప్పింది. ఆమె మేనల్లుడి వ్యాపారం, వృత్తి గురించి కవితను ప్రశ్నించగా, ఆమె దాని గురించి 'తనకు తెలియదు' అని చెప్పారని ఈడీ వివరించింది.

హైకోర్టుకు కేజ్రీవాల్

న్యూఢిల్లీ: ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ తన అరెస్టు, కస్టడీని ఢిల్లీ హైకోర్టులో శనివారం సవాల్ చేశారు. వాటిని అక్రమమైనవిగా పేర్కొన్నారు. ఆదివారంలోగా అత్యవసరంగా విచారణ జరిపించాలని ఉన్నత న్యాయస్థానాన్ని కోరారు. తన విడుదలకు ఆదేశాలివ్వాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. అత్యవసర విచారణకు హైకోర్టు తిరస్కరించింది. కేసును వచ్చే వారం పరిశీలిస్తామని పేర్కొంది. కాగా, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు కేజ్రీవాల్‌ను గురువారం అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం రౌస్ అవెన్యూ కోర్టులో ప్రవేశపెట్టారు. కేజ్రీవాల్‌ను పది రోజుల కస్టడీకి అప్పగించాలని కోరారు. అయితే ఏడు రోజుల రిమాండ్‌కు కోర్టు అంగీకరించింది. ఆ మేరకు ఉత్తర్వులు జారీచేసింది. కేజ్రీవాల్‌కు అరెస్టు నుంచి రక్షణ కల్పించేందుకు ఢిల్లీ హైకోర్టు అంతకుముందు నిరాకరించింది. 'మేము రెండు పక్షాలను విన్నాం. ప్రస్తుత దశలో అరెస్టు నుంచి రక్షణ కల్పించాలనుకోవడం లేదు' అని హైకోర్టు వ్యాఖ్యానించింది. రిమాండ్ అనంతరం కేజ్రీవాల్ తన భార్య ద్వారా ఆప్ కార్యకర్తలకు ఓ సందేశం పంపారు. సమాజం కోసం పని చేయాలని, ఎవరినీ ద్వేషించవద్దని హితవు పలికారు. తనను ఎక్కువ కాలం కటకటాల వెనుక ఉంచే జైలే లేదన్నారు. త్వరలో బయటకు వస్తా... ఇచ్చిన హామీలన్ని అమలు చేస్తానని కేజ్రీవాల్ వెల్లడించారు.

'నన్ను ఎంతోకాలం జైలులో ఉంచలేరు'

కేజ్రీవాల్ సందేశాన్ని వెల్లడించిన సతీమణి

న్యూఢిల్లీ: తనను సుదీర్ఘకాలం కటకటాల వెనుక ఉంచే జైలే లేదని ఆప్ అధినేత, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. త్వరలో బయటికి వచ్చి తానిచ్చిన హామీలన్నీ నెరవేరుస్తానని భరోసా ఇచ్చారు. ఈ మేరకు ఈడీ కస్టడీలో ఉన్న కేజ్రీవాల్ సందేశాన్ని ఆయన సతీమణి సునీత వీడియో ద్వారా చదివి వినిపించారు. బీజేపీ నేతలను సోదరసోదరీమణులంటూ కేజ్రీవాల్ సంబోధించారు. తన అరెస్టు విషయంలో బీజేపీ నేతలపై ఎలాంటి ద్వేషం చూపించొద్దని కోరారు. ఈ అరెస్టు తనను ఆశ్చర్యపర్చలేదన్నారు. 'సమాజం కోసం మీ పని కొనసాగించండి. బీజేపీని ద్వేషించవద్దు. వారు మన సోదరసోదరీమణులు. దేశాన్ని బలహీనపరిచే ఎన్నో శక్తులు ఉన్నాయి. జాగ్రత్తగా ఉండండి. అలాంటి శక్తుల్ని గుర్తించి, ఓడించండి. మీ సోదరుడు, కుమారుడినైన నాపై ఢిల్లీ మహిళలు నమ్మకం ఉంచాలని కోరుతున్నాను. నన్ను సుదీర్ఘకాలం ఎవరూ జైలులో ఉంచలేరు. త్వరలో వచ్చి మీకిచ్చిన హామీలు నెరవేర్చుతాను' అని ఆయన మాటలను సునీత వెల్లడించారు. కేజ్రీవాల్ అరెస్టును సునీత ఖండించారు. అధికార వ్యామోహంతో, నియంతృత్వంతో ప్రతి ఒక్కరినీ అణచివేయాలని ప్రధాని మోదీ ప్రయత్నిస్తున్నారని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఆమె ధ్వజమెత్తారు. 'ఎక్కడున్నా ఆయన జీవితం దేశానికే అంకితం. ప్రజలే అంతిమ నిర్ణేతలు. వారికి అన్ని విషయాలు తెలుసు. జైహింద్' అని పోస్టు పెట్టారు. ప్రస్తుతం జైల్లో ఉన్నా కేజ్రీవాలే ముఖ్యమంత్రి బాధ్యతలు కొనసాగిస్తారని ఆప్ ఇప్పటికే ప్రకటించింది. ఒకవేళ ఆయన సీఎం పదవికి రాజీనామా చేయాల్సి వస్తే ఆ స్థానం భర్తీ చేసేందుకు పార్టీ నుంచి విద్యాశాఖ మంత్రి అతిశీ, వైద్యశాఖ మంత్రి సౌరభ్ భరద్వాజ్ పేర్లు తెరపైకి రావచ్చని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. వీరితో పాటు సునీత పేరు కూడా రేసులో నిలిచే అవకాశం ఉంది. ఆమె రెవెన్యూ సర్వీస్ మాజీ అధికారిణి. ప్రస్తుత వీడియో సందేశం తర్వాత తదుపరి సీఎం ఆమే అంటూ ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

రష్యాలో ఉగ్రదాడి

(మొదటిపేజీ తరువాయి)

బోర్ట్నికోవ్ తెలిపారు. ఈ మేరకు సమాచారాన్ని అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు చేరవేశారు. రెండు దశాబ్దాల్లో రాష్యాలో ఇలాంటి ఉగ్రదాడి జరగలేదని తెలుస్తోంది. రష్యా అధ్యక్షుడిగా పుతిన్ తిరిగి ఎన్నికైన కొద్ది రోజులకే భీకర దాడి జరగడం చర్చనీయాంశంగా మారింది. ఈ దాడిని ముక్తకంఠంతో ఖండించాలని ప్రపంచ దేశాలకు రష్యా పిలుపునిచ్చింది. ఇదిలావుంటే, ఈ దాడికి బాధ్యత వహిస్తూ ఐసిస్ ఓ ప్రకటన చేసింది. తమ వారిని సురక్షితంగా స్థావరాలకు వెళ్లిపోవాలని సూచించింది. దీంతో రష్యా నేషనల్ గార్డ్ అప్రమత్తమై ఉగ్రవాదుల కోసం వేట మొదలు పెట్టింది. మరోవైపు రష్యా ప్రభుత్వం దేశం మొత్తం హై అలర్ట్ విధించింది. భారీగా భద్రతా ఏర్పాట్లు చేసి బలగాలను మోహరించింది. పెద్దస్థాయిలో నిర్వహించాల్సిన కార్యక్రమాలు అన్నింటిని రద్దు చేసింది. దోషులను ఉపేక్షించబోమని అధ్యక్షుడు పుతిన్ హెచ్చరిక జారీచేశారు. 24వ తేదీ అనగా ఆదివారాన్ని జాతీయ సంతాప దినంగా ప్రకటించారు. శుక్రవారం రాత్రి ఉగ్రదాడి జరుగగా మృతులకు సంతాప సూచికంగా శనివారం పుష్పగుచ్ఛాలు, కొవ్వొత్తులతో స్థానికులు, బంధుమిత్రులు నివాళులర్పించారు.

ఉక్రెయిన్ పాత్రపై సందేహాలు

ఈ దాడి వెనుక ఉక్రెయిన్ పాత్ర మీద రష్యా ప్రభుత్వ వర్గాలు సందేహాలు వ్యక్తంచేశాయి. ఉక్రెయిన్‌ను నిందిస్తూ కొందరు సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారు. ఇటువంటి కరుగట్టిన ఉగ్రవాదాలు నక్కేది అక్కడే అంటూ విషం చిమ్మారు. అయితే ఈ దాడితో తమకు ఎలాంటి సంబంధం లేదని ఉక్రెయిన్ ప్రకటించింది. 'రష్యా సైన్యంతో యుద్ధ క్షేత్రంలో నేరుగా తలపడుతున్నాం. యుద్ధభూమిలోనే తాడోపేడో తేల్చుకుంటాం. ఇలాంటి చర్యలకు పాల్పడబోం' అని ఉక్రెయిన్ అధ్యక్షుడికి సలహాదారు మైఖల్ పోడల్యాక్ పేర్కొన్నారు.

ముందే హెచ్చరించిన అమెరికా

రష్యాలో ఉగ్రదాడి జరిగే అవకాశమున్నట్లు అమెరికా ముందే హెచ్చరించింది. శ్వేతసౌధం జాతీయ భద్రతా మండలి అధికార ప్రతినిధి అడ్రియెన్నీ స్పందిస్తూ 'ఉగ్రదాడి జరగవచ్చని నెల క్రితమే నిఘా వర్గాలు సమాచారమిచ్చాయి. కాన్సర్ట్‌లు, ప్రజలు ఎక్కువగా గుమిగూడే ప్రదేశాలు లక్ష్యంగా దాడులు జరగొచ్చని హెచ్చరించాయి. నిఘా వర్గాల సమాచారం అందిన వెంటనే అమెరికా... రష్యాను అప్రమత్తం చేసింది' అని తెలిపారు.

ఐరాసతో సహా ప్రపంచ దేశాల ఖండన

మాస్కో కాన్సర్ట్ హాల్ వద్ద ఉగ్రదాడిని హేయమైన, పరికిపింద చర్యగా పేర్కొంటూ ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్ తీవ్రంగా ఖండించినట్లు అధికార ప్రతినిధి స్టిఫనే దుజారిక్ తెలిపారు. బాధితులకు సానుభూతిని, మృతులకు సంతాపాన్ని తెలిపినట్లు వెల్లడించారు. అలాగే, అమెరికా, యూరప్, భారత్, అఫ్ఘాన్, పాకిస్థాన్, శ్రీలంక, పలస్తీనా, అరబ్‌తో పాటు అనేక దేశాల విదేశాంగ శాఖలు వేర్వేరు ప్రకటనల్లో రష్యాకు సంఘీభావాన్ని ప్రకటించాయి. ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించాయి. ఇది పిరికిపంద చర్య అని అఫ్ఘాన్ పేర్కొనగా నాగరిక సమాజంలో హేయమైన నేరాలకు స్థానం లేదని శ్రీలంక పేర్కొంది. ఇది భయానకమంటూ పాకిస్థాన్ వెల్లడించింది. ఈ ఘటన తమను షాక్‌కు గురి చేసిందని, బాధితులకు చైనా ప్రభుత్వం, చైనా ప్రజల తరపున సానుభూతి తెలుపుతూ ఆ దేశాధ్యక్షుడు జిన్‌పింగ్ ఓ సందేశాన్ని పంపారు. రష్యా ఫెడరేషన్‌కు సంఘీభావం తెలుపుతూ... మృతులకు సంతాపాన్ని, బాధితులకు సానుభూతిని భారత ప్రధాని మోదీ ప్రకటించారు. పౌర మరణాలకు కారణమయ్యే ఘటనలను ఉపేక్షించరాదని ప్రపంచ దేశాలు పిలుపునిచ్చాయి. శాంతి-సుస్థిరతను ఆకాంక్షించాయి.

కూటమికి 160 సీట్లు

(మొదటిపేజీ తరువాయి)

ఎక్కువైంది. అభ్యర్థుల ఎంపికలో జాగ్రత్తలు తీసుకుంటేనే మంచి ఫలితాలు వస్తాయి. పొత్తులోని మూడు పార్టీలలో బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉంది. వైసీపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాష్ట్రం నష్టపోతుందన్న ఉద్దేశంతో వ్యతిరేక ఓటు చీలకుండా పొత్తు అంశంలో పవన్ కళ్యాణ్ ముందుకొచ్చారు. పవన్ కళ్యాణ్ పద్ధతైన వ్యక్తి. జనసేన కార్యకర్తలు కూడా పవన్ కళ్యాణ్ నాయకత్వంలో నిబద్ధతతో పనిచేస్తున్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి నేను అభ్యర్థుల ఎంపికలో కీలకపాత్ర పోషిస్తున్నా. టీడీపీకి ఒక విశ్వసనీయత ఉంది. పొత్తులో భాగంగా అందరికీ టికెట్లు ఇవ్వలేకపోయాం. సీట్లు త్యాగం చేసిన వారిని ఎప్పుడూ మర్చిపోను. వారికి తప్పకుండా న్యాయం చేస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఫేక్ పోస్టులతో జగన్ నీచ రాజకీయాలకు పాల్పడుతున్నాడని మండిపడ్డారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవికి పురందేశ్వరి రాజీనామా చేస్తున్నట్లు తప్పుడు వార్తలు సృష్టించారు. బీజేపీ, టీడీపీ పొత్తు తాత్కాలికం... పోలవరం, అమరావతి పూర్తయ్యాక పొత్తు ఉండదని నా పేరుతో తప్పుడు నోట్ వదిలేశారు. జనసేనతో సీట్ల పైనా ఫేక్ పోస్టులు పెట్టారంటూ కొన్నింటిని ఉదాహరించారు. ఏపీని జగన్ డ్రగ్స్‌కు అడ్డాగా మార్చారు. అక్రమాలకు ఏపీపీఎస్సీని వేదికగా చేసుకున్నారు. బాబాయ్ గొడ్డలి వేటు ఘటనకు ఐదేళ్లు. సీబీఐ ఆఫీసర్ పైనా కేసు పెట్టే పరిస్థితి మనం ఇంతవరకు ఎక్కడా చూడలేదు. అధికారం, డబ్బు, నేరచరిత్రతో ఏమైనా చేయొచ్చని వారి ఆలోచన. వలంటీర్లను విచ్చలవిడిగా వాడుతున్నారు. ఈ పోరాటం రాష్ట్ర భవిష్యత్ కోసం చేసే పోరాటం. లోక్ సత్తా మాదిరి అన్ని పార్టీలు ముందుకొచ్చి మద్దతు ఇవ్వాలి. సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకు రావాలని చంద్రబాబు పిలుపునిచ్చారు.

తూతూమంత్రపు తనిఖీలు

(మొదటిపేజీ తరువాయి)

సేవచేయాల్సిన వారు డ్రగ్స్ వ్యాపారం చేయడమంటే ఈ సమాజాన్ని మరింత దిగజార్చడం, యువత జీవితాలు చిన్నాభిన్నం చేయడమేనని మేధావులు ఆవేదన చెందుతున్నారు. నిందితులకు బీజేపీ, టీడీపీ నేతలతో ప్రత్యక్ష సంబంధాలు ఉన్నట్లు తెలుస్తోంది. వైసీపీ ప్రభుత్వ సహకారం కూడా ఉన్నట్లు అర్థమౌతోంది. దిగుమతి చేసిన డ్రగ్స్ విలువ రూ.50 వేల కోట్లు ఉంటుంది. ఇదంతా విశాఖ కంటైనర్ టెర్మినల్ నుండే జరిగింది. రూ.50 వేల కోట్ల డ్రగ్స్ పట్టుబడిన కంటైనర్ టెర్మినల్‌ను జేఎం భక్షీ (ముంబై) నిర్వహిస్తున్నది. విశాఖ కంటైనర్ టెర్మినల్ 33 ఏళ్ల పాటు పీపీపీ కింద 2002లో వాజ్‌పేయి ప్రభుత్వం లీజుకిచ్చింది. అప్పటి నుండి ఇది జేఎం భక్షీ నిర్వహణ కింద ఉంది. ఈ సంస్థకు, సంధ్య ఆక్వా సంస్థకు మధ్య గల సంబంధాలను దర్యాప్తు సంస్థలు బహిర్గతం చేయాల్సి ఉంది. ఇక్కడకు వచ్చిన ప్రతి కంటైనర్‌ను స్కాన్ చేసి లోపల కార్గో ఏమిటో నిర్ధారించాలి. కానీ అలా జరిగినట్లు లేదు. ప్రైవేట్ సంస్థ కింద పోర్టు బెర్తలు ఉండటం వలన ఇలాంటివి జరుగుతున్నాయి. వచ్చిన వెయ్యి బస్తాల్లో 20 బస్తాలను సీబీఐ అధికారులు బయటకు తీసి పరీక్షించగా వీటిలో కొకైన్, మార్ఫిన్, హెరాయిన్, మెదక్వలోన్, యాంఫీ టమిన్, మెస్కాలిన్ వంటి మాదకద్రవ్యాలు డ్రై ఈస్ట్‌లో ఉన్నట్లు గుర్తించారు. అంతర్జాతీయ మార్కెట్ లెక్కల ప్రకారం వీటి విలువ వేల కోట్లు ఉంటుందని అంచనా.

ఆంధ్రప్రదేశ్ గంజాయి, డ్రగ్స్ సరఫరా రాష్ట్రంగా గుర్తింపు పొందుతోంది. దీనిని నియంత్రించాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నాయి. ఎన్నికల సమయంలో కోట్లాది రూపాయల మాదక ద్రవ్యాలు పట్టుపడటం ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికైనా సంధ్య ఆక్వా ఎక్స్‌పోర్టు సంస్థపై సమగ్ర విచారణ చేపట్టాలని, దాని వ్యాపారాలపై దర్యాప్తు చేయాలని వామపక్షాలు, విద్యార్థి, యువజన సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ సంఘటన జరిగి నాలుగు రోజులైనా కేసు ఎందుకు నమోదు చేయలేదని, దానికి బాధ్యులను ఎందుకు కస్టడీలోకి తీసుకోలేదని ప్రశ్నిస్తున్నారు. దీనిపై ప్రజల్లో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మాదకద్రవ్యాల ఎగుమతి, దిగుమతులకు విశాఖ పోర్టునే ఎందుకు ఎంచుకున్నారన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. గతంలో పనిచేసిన పోర్టు చైర్మన్ ప్రభుత్వానికి అనుకూలమైన వ్యక్తి అన్న ప్రచారం సాగుతోంది. పోర్ట్‌లో నౌకల్లోకి ఎక్కించే కంటైనర్‌లలో కొన్నింటిని మాత్రమే తనిఖీ చేస్తున్నారని, అందుకే అక్రమార్కులు ఎగుమతి, దిగుమతులకు విశాఖ పోర్టును ఎంచుకున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో పనిచేసే నిఘా, ఎన్‌ఫోర్సుమెంటు ఏజెన్సీలు ఎందుకు వీటిని గుర్తించలేదన్న అనుమానం కలుగుతోంది. పైగా సీబీఐ అధికారులు డాగ్ స్క్వాడ్‌ను అడిగితే వెళ్లామని విశాఖ పోలీసులు చెప్పడంపైనే సందేహాలు తలెత్తుతున్నాయి. డ్రగ్ సరఫరాపై పూర్తిస్థాయిలో సమగ్ర విచారణ జరిపి దోషులను శిక్షించాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ప్రశాంత విశాఖను అశాంతి విశాఖగా మార్చేశారని ఆవేదన చెందుతున్నారు.

బీజేపీలో దుమారం

(మొదటిపేజీ తరువాయి)

అధ్యక్షులు సోము వీర్రాజు రాజమండ్రి పార్లమెంటు సీటుపై, పోటీ చేసే స్థానాలపై స్పష్టత రావాల్సి ఉంది. రాజంపేట ఎంపీ బరిలో మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి, బీజేపీ నేత సత్యకుమార్ పేర్లు వినిపిస్తున్నాయి. వైసీపీ కంచుకోటగా రాజంపేట ఎంపీ స్థానం ఉంది. అటు ఎమ్మెల్యే సీట్లపైనా బీజేపీ ఆశించిన సీట్లు కాకుండా, టీడీపీ ఓటమి పాలయ్యే సీట్లను బీజేపీకి కేటాయించడంపై ఆ పార్టీ నేతలు అసంతృప్తితో ఉన్నారు. ఓడిపోయే ఎమ్మెల్యే, ఎంపీ సీట్లను బీజేపీకి అంటగట్టి, టీడీపీ పొత్తు ధర్మాన్ని విస్మరిస్తోందని బీజేపీ శ్రేణులు వాపోతున్నారు.

నారా భువనేశ్వరి నగదు పంపిణీపై 24 గంటల్లో నివేదిక ఇవ్వాలి: ఈసీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: 'నిజం గెలవాలి' యాత్రలో భాగంగా నారా భువనేశ్వరి కొందరికి నగదు అందించడంపై 24 గంటల్లోగా నివేదిక ఇవ్వాలని అన్నమయ్య జిల్లా కలెక్టర్‌కు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీచేసింది. నిజం గెలవాలి పేరుతో యాత్ర నిర్వహిస్తూ నగదు అందించడం ఎన్నికల కోడ్ ఆఫ్ కండక్ట్‌కు విరుద్ధం అని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి ఫిర్యాదుపై ఎన్నికల కమిషన్ స్పందించింది. అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఈ నెల 20న భువనేశ్వరి నగదు అందజేసి ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించారని అప్పిరెడ్డి ఈ నెల 21న ఆధారాలతో సహా ఈసీకి ఫిర్యాదు చేశారు. దీనిపై విచారించి తక్షణమే తమకు నివేదిక పంపాలని కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసింది.

కాంగ్రెస్‌ను అణగదొక్కేందుకు బీజేపీ కుటిలయత్నం: గిడుగు రుద్రరాజు



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: దేశంలో కాంగ్రెస్ ఉనికే లేకుండా చేయాలనే కుటిల యత్నాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేస్తుందని సీడబ్ల్యూసీ సభ్యుడు, పీసీసీ మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు శనివారం ఓ ప్రకటనలో విమర్శించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఎప్పుడూ చూడని అత్యంత నీచమైన పాలనను నేడు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలకు అందిస్తుందని దుయ్యబట్టారు. స్వాతంత్ర్య సంగ్రామంలో కీలక భూమిక పోషించి, దేశాన్ని అన్ని విధాలా పురోగమన పథంలో నడిపించిన కాంగ్రెస్ పార్టీ... బ్యాంక్ అకౌంట్లను స్తంభింపచేయడం దారుణమని అన్నారు. అవినీతి నిరోధానికి, చట్ట వ్యతిరేక చర్యలను ఆపడానికి వినియోగించాల్సిన ఐటీ, ఈడీ, సీబీఐ వంటి జాతీయస్థాయి దర్యాప్తు సంస్థలను కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పనిచేయిస్తున్న కేంద్ర ప్రభుత్వం, రాజకీయంగా వాటిని దుర్వినియోగం చేస్తుందన్నారు. త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో బ్యాంక్ అకౌంట్లను స్తంభింప చేయడం ద్వారా కాంగ్రెస్‌ను ఆర్థికంగా ఇబ్బందులకు గురి చేసి, పార్టీని అణగదొక్కాలని కొందరు బీజేపీ పెద్దలు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అసలు దేశంలో ప్రతిపక్షమే లేకుండా చేయాలని ప్రధాని మోదీ అధ్వర్యంలోని బీజేపీ విశ్వ ప్రయత్నాలు చేస్తుందని ధ్వజమెత్తారు. పదేళ్ల ఎన్డీయే పాలనలో దేశంలో అసమానతలు పెరిగిపోయాయని పేర్కొన్నారు. వరల్డ్ ఇన్ ఈక్వాలిటీ ల్యాబ్ గణాంకాల ప్రకారం 2022-23 సంవత్సరాంతానికి దేశ ఆదాయంలో 22.6 శాతం, దేశ సంపదలో 40 శాతం కేవలం ఒక్క శాతం ప్రజల వద్ద మాత్రమే పేరుకుపోయిందని వాపోయారు. ఇదే పరిస్థితులు కొనసాగితే పేద, ధనిక తారతమ్యంతో అంతర్యుద్ధం వచ్చే ప్రమాదముందని హెచ్చరించారు. అనేక సామాజిక అంశాలపై పేదల పక్షాన పోరాటం చేస్తున్న రాహుల్ గాంధీ అధ్వర్యంలోని కాంగ్రెస్ పార్టీపై అనేక విధాలుగా బీజేపీ ప్రభుత్వం దాడులు చేస్తుందని మండిపడ్డారు. దేశ ప్రజల సంపదైన స్టేట్ బ్యాంక్ కూడా వందల కోట్ల రూపాయల ఎలక్టోరల్ బాండ్ల వివరాలను సరిగా అందజేయకుండా, బీజేపీ ప్రభుత్వానికి దాసోహం అయిందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలోకి వస్తేనే ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో జీవించే అవకాశాలు ఉంటాయని స్పష్టం చేశారు.

భారత్ పరువు తీస్తున్న బీజేపీ

ముప్పాళ్ల నాగేశ్వరరావు విమర్శ

విశాలాంధ్ర-మంగళగిరి: ప్రభుత్వ రంగ సంస్థలు, వ్యవస్థలను నిర్వీర్యం చేసి అంబానీ, అదానీలకు వేల కోట్లు దోచిపెడుతున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవినీతికి చిరునామాగా మారిందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు విమర్శించారు. ఎన్నికల బాండ్ల రూపంలో రూ.6 వేల కోట్లకు పైగా సేకరించి దేశంలోనే అతి పెద్ద కుంభకోణానికి బీజేపీ పాల్పడిందని మండిపడ్డారు. భారత కీర్తి ప్రతిష్ఠలను వీధిలో పెట్టిన బీజేపీని ఓడించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని వేములపల్లి శ్రీకృష్ణభవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి దాపురించిన అత్యంత గడ్డుకాలంలో ఈ సార్వత్రిక ఎన్నికలు జరగబోతున్నాయని అన్నారు. భారతీయ జనతా పార్టీ అధినాయకుడు నరేంద్ర మోదీ దేశ ప్రజల కళ్లకు గంతలు కట్టి...వారి భవిష్యత్తుని అంధకారం ముంచి...తిరిగి ఓట్లు పొందే క్రీడ ప్రారంభించారని ఆరోపించారు. అందులో భాగంగానే జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను భయపెట్టి రాజీనామా చేయించి అరెస్టు చేశారన్నారు. రెండు పర్యాయాలు దిల్లీ ముఖ్యమంత్రి అయిన కేజ్రీవాల్‌ను ప్రజాస్వామికంగా మోదీ ప్రభుత్వం ఈడీతో అరెస్టు చేయించటం దుర్మార్గమని వ్యాఖ్యానించారు. రూ.100 కోట్ల అవినీతి జరిగిందని ప్రధానమంత్రి మోదీ, హోంమంత్రి అమిత్ షా కలిసి కేజ్రీవాల్‌ను అరెస్టు చేయించారని, అయితే, అనేక ఆర్థిక నేరాలకు పాల్పడిన ఏపీ సీఎం జగన్‌మోహన్ రెడ్డిని ఎందుకు అరెస్టు చేయించలేదని ప్రశ్నించారు. బీజేపీ అనుకూలురుపై చర్యలు శూన్యమని, ప్రత్యర్థి పార్టీల నేతలపై మాత్రం ఈడీ, సీబీఐ, ఐటీలను ప్రయోగించడం హేయమైన చర్య అని ముప్పాళ్ల అన్నారు. మతతత్వ బీజేపీ హిందువులను రెచ్చగొడుతూ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని తుంగలో తొక్కుతోందని, రాముడు పేరు చెప్పుకొని ఓట్లు అడుగుతూ ప్రజలను మోసగిస్తోందని విమర్శించారు. బీజేపీ, దాని మిత్రపక్ష పార్టీలను ఓడించి...ఇండియా కూటమి పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ముప్పాళ్ల నాగేశ్వరరావు ఓటర్లకు విజ్ఞప్తిచేశారు.

సర్దార్ భగత్ సింగ్‌కు నివాళి

సర్దార్ భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా ముప్పాళ్ల నాగేశ్వరరావు భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, మండల కార్యదర్శి జాలాది జాన్‌బాబు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు జంగాల చైతన్య, నియోజకవర్గ అధ్యక్షుడు జాలాది నవీన్, దారా గురునాథం, హనోక్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ డ్రగ్స్‌పై సిట్టింగ్ జడ్జితో కమిటీ: షర్మిల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఒకప్పుడు ఆంధ్రప్రదేశ్... దేశానికి అన్నం పెట్టే అన్నపూర్ణగా పేరు గడించగా, ఇప్పుడు యావత్ డ్రగ్స్ సరఫరా చేసే డ్రగ్స్ క్యాపిటల్ ఆఫ్ ఇండియాగా మారిందని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. డ్రగ్స్ సరఫరాపై విచారణకు సిట్టింగ్ జడ్జితో కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. ఇండియాలో ఎక్కడ డ్రగ్స్ దొరికినా దాని మూలాలు ఏపీ వైపే ఉన్నాయని తెలిపారు. పదేళ్లలో రాష్ట్రాన్ని మాదక ద్రవ్యాలకు కేరాఫ్‌గా మార్చేశారని, డ్రగ్స్ రవాణా, వాడకంలో నెంబర్ వన్ ముద్ర వేశారన్నారు. 25 వేల కేజీల భారీ మాదక ద్రవ్యాలు బ్రెజిల్ నుంచి విశాఖ తీరం చేరితే, తమ తప్పు ఏమీ లేదని ఒకరిపై ఒకరు నిందలు వేసుకుంటున్న టీడీపీ, వైసీపీ, బీజేపీలకు సిగ్గుండాలని ధ్వజమెత్తారు. కేంద్ర, రాష్ట్రాల నిఘా వ్యవస్థ మద్దతు లేకుడా విశాఖ తీరానికి డ్రగ్స్ ఎలా చేరతాయని ప్రశ్నించారు. డ్రగ్స్ మాఫియాతో మీకు లింకులు లేకుంటే ఇది సాధ్యమయ్యే పనేనా అని అన్నారు. మీ అండదండలతోనే కదా డ్రగ్స్ రవాణాలో ఏపీ 'సేఫ్ హెవెన్'గా మార్చిందని పేర్కొన్నారు. దీని తెరవెనుక ఎంతటి వాళ్లున్నా నిజాలు నిగ్గు తేల్చాలని కోరారు.

అప్పల భారంలో దేశం: కేవీవీ ప్రసాద్

విశాలాంధ్ర-తాడికొండ: యువకులు, విద్యార్థులు, మహిళలు, రైతులు భగత్‌సింగ్‌ను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ కోరారు. గుంటూరు జిల్లా తాడికొండ మండలం పొన్నెకల్లులోని సీపీఐ కార్యాలయంలో శనివారం భగత్‌సింగ్ వర్ధంతి సభ జరిగింది. ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రసాద్ మాట్లాడుతూ, బ్రిటిష్ ప్రభుత్వ విధానానికి వ్యతిరేకంగా భగత్ సింగ్ పోరాటాలు కొనసాగించారని గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో నేడు దిల్లీలో రైతులు ఉద్యమాలు చేస్తూ పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని రెండున్నర సంవత్సరాలుగా అలుపెరగని పోరాటాలు కొనసాగిస్తున్నారని ప్రశంసించారు. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులపై ఉక్కు పాదం మోపుతుందని ధ్వజమెత్తారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో అప్పుల భారం పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో మతోన్మాద దాడులు పెరిగాయని, మహాత్మా గాంధీని చంపిన గాడ్సేకు ఆర్‌ఎస్‌ఎస్ గుడులు కడుతోందని మండిపడ్డారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం చేయాల్సిన ఆవశ్యకత ఎందుకు వచ్చిందని నిలదీశారు. మణిపూర్ రాష్ట్రంలో నేటికీ క్రైస్తవులపై దాడులు జరుగుతున్నాయని, ప్రధాని మోదీ ఆ రాష్ట్రాన్ని సందర్శించకపోవడం బాధాకరమన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కాబోతూ ఈశ్వరరావు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో మతోన్మాద పార్టీని, దానితో అంటగాగే పార్టీలను చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. సీపీఐ తాడికొండ నియోజకవర్గ కార్యదర్శి ముప్పాల శివశంకర్‌రావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు గుర్రంకొండ సత్యానందం, వ్యవసాయ కార్మిక సంఘం ఏరియా కార్యదర్శి కంభంపాటి దేవునిదయ, పొన్నెకల్లు గ్రామ కార్యదర్శి రామినేని రామారావు పాల్గొన్నారు.

యువతరం మేల్కోవాలి

భగత్‌సింగ్ వర్ధంతి సభలో శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: దేశాన్ని కార్పొరేట్ శక్తులు, డ్రగ్స్ మాఫియా కమ్మేశాయని, విప్లవ యోధులు భగత్‌సింగ్ స్ఫూర్తితో వాటికి వ్యతిరేకంగా పోరాడి దేశాన్ని కాపాడాలని, డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పిలుపు నిచ్చారు. భగత్‌సింగ్ 92వ వర్ధంతి శనివారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగింది. భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్ చిత్రపటాలకు పూలమాలలేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశ విముక్తి కోసం ఆనాడు భగత్‌సింగ్ అనన్యసామాన్యమైన పోరాటం నిర్వహించారని తెలిపారు. వారి త్యాగంతో దేశానికి విముక్తి లభించిందని, కానీ నేడు సామ్రాజ్యవాదుల చేతుల్లో దోపిడీకి గురవుతోందన్నారు. పాలకులు కూడా వారికి తొత్తులుగా మారి దేశాన్ని దోచుకుతింటున్నారని విమర్శించారు. డ్రగ్స్ మాఫీయా విచ్చలవిడిగా విస్తరిస్తోందనీ, దీనివల్ల రాబోయే తరాలు నిర్వీర్యం అయ్యే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. విశాఖ పోర్టులో దొరికిన డ్రగ్స్ మార్కెట్లోకి వెళితే మరోపదేళ్లలో యువత పూర్తిగా పనికిరాకుండా పోయే ప్రమాదముందని తెలిపారు. దీన్ని అడ్డుకునేందుకు యువత ముందుకు రావాలని, కార్పొరేట్‌శక్తుల దోపిడీని ఎదుర్కోవాలని కోరారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు జె.జయరాం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత రైతు సంఘం సీనియర్ నాయకులు వై.కేశవరావు, సీతారామ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి అనిల్ విప్లవ గీతాలు ఆలపించారు.

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారామ్, బి.తులసీదాస్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.అశోక్, కె.హరికిషోర్, ఆంధ్ర మాల్యాద్రి పాల్గొన్నారు.

భగత్ సింగ్‌కు ఘన నివాళి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: స్వాతంత్ర్య సమరయోధుడు భగత్ సింగ్ వర్ధంతిని శనివారం విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో నిర్వహించారు. పీసీసీ జనరల్ ప్రధాన కార్యదర్శి పీవై కిరణ్, అల్లం రాజేశ్ తదితర కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలేసి ఘననివాళులర్పించారు. భారత స్వాతంత్ర్యోద్యమంలో ఆయన చేసిన సేవలను కొనియాడారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో మోదీ, జగన్‌లను ఓడిద్దాం

ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ పిలుపు

విశాలాంధ్ర-విజయవాడ: భగత్‌సింగ్ పోరాటస్ఫూర్తితో నిరుద్యోగ యువతను మోసం చేసిన ప్రధాని మోదీ, సీఎం జగన్‌లను ఎన్నికల్లో ఓడించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పరుచూరి రాజేంద్రబాబు, నక్కి లెనిన్‌బాబు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి, ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు పి.చంద్రానాయక్ పిలుపునిచ్చారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వర్ధంతి సభను స్థానిక దాసరి భవన్‌లో ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ విజయవాడ నగర సమితి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ, మతోన్మాద శక్తులను, అప్రజాస్వామ్య విధానాలు అనుసరిస్తున్న మోదీతో జతకట్టిన పార్టీలను ఓడిద్దామని ప్రతినబూనారు. 12 ఏళ్ల ప్రాయంలోనే స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని 23 ఏళ్లకే దేశం కోసం ప్రాణాలర్పించి యువతకు స్ఫూర్తిగా నిలిచి దేశభక్తిని రగిలించిన సమరయోధుడు, విప్లవమూర్తి భగత్ సింగ్ అని కొనియాడారు. మతోన్మాద శక్తులను నిర్మోహమాటంగా వ్యతిరేకించారని అన్నారు. ప్రజల ఐక్యతను నిర్వీర్యపరచి బ్రిటీష్ సామ్రాజ్యానికి సహకరించేవేనంటూ వాటన్నింటినీ నిష్కర్షగా వ్యతిరేకించిన ధీశాలి భగత్‌సింగ్ అన్నారు.మతోన్మాద రాజకీయాలు నేడు దేశంలో విచ్చలవిడిగా కొనసాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మతోన్మాద రాజకీయాలను సమూలంగా ఓడించడమే భగత్ సింగ్‌కు మనమిచ్చే నిజమైన నివాళి అన్నారు. నేడు భారత దేశంలో రాజకీయ, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో మతోన్మాద శక్తులు విజృంభించడం మనం చూస్తున్నామని పేర్కొన్నారు. ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి లంకా గోవిందరాజులు, ఇన్సాఫ్ రాష్ట్ర కన్వీనర్ సయ్యద్ అఫ్సర్, ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎంవీ సుబ్బారావు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నాసర్ జి, ఏఐవైఎఫ్ నగర ఉపాధ్యక్షుడు శింగంశెట్టి మోహన్ ప్రసాద్, కరెపు కార్తీక్, గాడి అజయ్, ఏఐఎస్ఎఫ్ విజయవాడ నగర అధ్యక్ష కార్యదర్శులు రంజిత్, జగదీష్, అయ్యప్ప, సాయి పాల్గొన్నారు.

'గోశాలైట్స్' గుర్తింపు రద్దు చేయాలి: ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:

గోశాలైట్స్ విద్యా సంస్థలు గోల్ 100 పేరుతో పదో తరగతి విద్యార్థులకు ఈనెల 22 నుంచి ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా టాలెంట్ టెస్టులు నిర్వహిస్తున్నా ఇంటర్ బోర్డ్ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదో సమాధానం చెప్పాలని, తక్షణమే దాని గుర్తింపు రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ (అఖిల భారత విద్యార్థి సమాఖ్య) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ విజయవాడ నగర ముఖ్యుల సమావేశం శనివారం దాసరి నాగభూషణరావు భవన్‌లో జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన శివారెడ్డి మాట్లాడుతూ, పదో తరగతి విద్యార్థులకు పరీక్షలు పూర్తి కాకుండా ఇంటర్ కోర్సులకు ప్రవేశాలు ఎలా నిర్ణయిస్తారని ప్రశ్నించారు. టాలెంట్ టెస్ట్‌ల పేరుతో విద్యార్థులను మభ్యపెడుతుందన్నారని మండిపడ్డారు. గిఫ్ట్, గోల్ 100 కోర్సుల పేరుతో మోసపూరిత ప్రకటనలు ఇచ్చి విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి రూ.లక్షలు ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఆ విద్యాసంస్థల గుర్తింపును రద్దు చేయకుంటే టాలెంట్ టెస్ట్‌ను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల నాసర్, విజయవాడ నగర అధ్యక్ష, కార్యదర్శులు రంజిత్, జగదీశ్, ఉపాధ్యక్షుడు అయ్యప్ప, సహాయ కార్యదర్శి సాయి పాల్గొన్నారు.

మోదీతో ప్రమాదం

- ప్రభుత్వరంగ సంస్థలు, వ్యవస్థలు విధ్వంసం
- అమలుకాని హామీలతో మభ్యపెడుతున్న రాజకీయ పార్టీలు: ఓబులేసు

విశాలాంధ్ర బ్యూరో-అనకాపల్లి: ప్రధాని మోదీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్ల కార్మిక వర్గానికి ప్రమాదం పొంచి ఉందని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు ఆందోళన వ్యక్తం చేశారు. ఏఐటీయూసీ అనకాపల్లి జిల్లా ప్రథమ మహాసభ శనివారం సంఘ కార్యాలయంలో జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత వ్యవస్థలను మోదీ విధ్వంసం చేశారని మండిపడ్డారు. త్వరలో జరగనున్న పార్లమెంట్, శాసన సభ ఎన్నికలకు రాజకీయ పార్టీలు లెక్కకు మించి తప్పుడు వాగ్దానాలు ఇస్తున్నాయని ఆరోపించారు. మేనిఫెస్టోను విడుదల చేస్తూ అమలు కానీ హామీలతో ప్రజలను మభ్య పెడుతున్నాయని అన్నారు. సంపద సృష్టిస్తున్న 50 కోట్ల మంది కార్మికులను ఆదుకునే చర్యలు లేక పోగా వారిని ఇబ్బంది పెట్టే అనేక చర్యలకు కేంద్రం పూనుకుందని ఆరోపించారు. కార్మిక వర్గం ఉంటేనే సామాజిన న్యాయం జరుగుతుందని అన్నారు. దేశానికి విశ్వ గురువుగా ప్రపంచంలోనే భారత్‌ను మూడో ఆర్థిక దేశంగా తీర్చిదిద్దుతున్నామని మోదీ చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. 85 కోట్ల మంది పేద ప్రజలకు ఉచిత రేషన్ ఇస్తూ ప్రపంచంలోనే మూడో ఆర్థిక దేశంగా ఎలా నిలబెడతావు అని ప్రశ్నించారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తూ వ్యవస్థలను, దేశాన్ని నాశనం చేస్తున్నా దని మండిపడ్డారు. వ్యవస్థలను గుప్పెట్లో పెట్టుకొని ప్రొఫెసర్ సాయిబాబు వంటి వ్యక్తులను అక్రమంగా జైల్లో పెట్టించి ఇబ్బందులకు గురి చేశారని అన్నారు. దిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను ఉపముఖ్యమంత్రి మనిశ్ సిషోడియాను అన్యాయంగా అరెస్ట్ చేశారని అన్నారు. దేశంలో కార్మిక చట్టాలను 44కు కుదించి అందులో 29 చట్టాలను అదృశ్యం చేశారని అన్నారు. రాష్ట్రంలో స్వయం ప్రకటిత మేధావులు చాలామందే ఉన్నారని, జయప్రకాశ్ నారాయణ కూటమికి మద్దతు ప్రకటించి రాష్ట్ర ప్రయోజ నాల కోసం అని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా టీడీపీ, వైసీపీ, జనసేన వంటి పార్టీలు బీజేపీకి ఎందుకు సహకరిస్తున్నాయో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక హోదా, స్టీల్‌ప్లాంట్, గంగవరం పోర్టు తదితర ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తూ కార్పోరేట్ శక్తులను మరింత ఆర్థిక శక్తిగా తయారు చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలు మేల్కొని దేశంలో మోదీ, రాష్ట్రంలో మోదీకి కొమ్ముకాసే పార్టీలను తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అచ్యుతరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకట రమణ, సమితి సభ్యుడు డాక్టర్ బూసిరాజు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, జిల్లా కన్వీనర్ వై.ఎన్. భద్రం, గనిశెట్టి ఏసుదాసు, కోన లక్ష్మణ, ఎల్వీ రమణ, పెంటకోట సత్యనారాయణ పాల్గొన్నారు.

నీటిఎద్దడి అధిగమించే ప్రణాళిక అమలు చేయండి

- నీటి సరఫరా పథకాల నిర్వహణకు నిధుల కొరత లేదు
- సీఎస్ డా. కె.ఎస్.జవహర్ రెడ్డి

విశాలాంధ్ర-విజయవాడ: జూన్ నెల వరకు వేసవి నీటి ఎద్దడిని అధిగమించేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. కె.ఎస్.జవహర్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో మంచినీటి సరఫరా, ఉపాధి హామీ పనులపై శనివారం విజయవాడ సీఎస్ క్యాంపు కార్యాలయం నుంచి ఆయన జిల్లా కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ వేసవి దృష్ట్యా రాష్ట్రంలో ఎక్కడా తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎలాంటి నిధుల కొరత లేదని, ఇప్పటికే 15 ఆర్థిక సంఘం నిధులు 1000 కోట్ల రూపాయలు విడుదల చేసినట్లు తెలిపారు. ఈ నిధులతో వివిధ తాగునీటి పథకాల నిర్వహణ, నీటి ఎద్దడి గల ఆవాసాలకు ట్యాంకుల ద్వారా తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. 15 రోజులకు ఒకసారి మండల, జిల్లా స్థాయిలో భూగర్భజల మట్టాల స్థాయిని, వివిధ బోరు బావుల పరిస్థితిని కూడా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించేలా ప్రజల్లో పూర్తిగా అవగాహన కల్పించి నీటి వృధాను అరికట్టాలని, తాగునీటి అవసరాలకు కాలువల ద్వారా చెరువులు నింపేందుకు విడుదల చేసే నీరు శివారు ప్రాంతాలకు సక్రమంగా చేరేలా చూడాలని స్పష్టం చేశారు. అలాగే, కూలీలకు ఉపాధి హామీ పథకం ద్వారా తగిన పనులు కల్పించాలని, వంద రోజుల పని దినాల కల్పన లక్ష్యాన్ని అధిగమించాలన్నారు. ఎండ వేడిమి దృష్ట్యా ఉపాధి హామీ పనులను ఉదయం 5.30 నుంచి 10.30 గంటల వరకు నిర్వహించేలా చూడాలన్నారు. తాగునీటి సరఫరా, ఉపాధి పనుల విధులు నిర్వహించే అధికారులకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని జవహర్ రెడ్డి కలెక్టర్లకు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర జల వనరులు, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశి భూషణ్ కుమార్ మాట్లాడుతూ తాగునీటి సరఫరాకు సంబంధించి జిల్లా పరిషత్, మండల పరిషత్, గ్రామ పంచాయతీలకు మొత్తం 1000 కోట్ల రూపాయలను విడుదల చేసినట్లు చెప్పారు. ఇంకా అవసరమైన నిధులు కూడా విడుదల చేస్తామన్నారు. నీటి లభ్యతకు సంబంధించి మంచినీటి పథకం, సోర్సులు వారీగా మ్యాపింగ్ చేయడం జరుగుతుందన్నారు. అన్ని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను పూర్తిగా నీటితో నింపాలన్నారు. జిల్లా స్థాయిలో వేసవి కార్యాచరణ ప్రణాళికను రూపొందించి జలవనరులు, పీఆర్ అండ్ ఆర్డీ, మునిసిపల్ పరిపాలన శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి తాగు నీటికి ఇబ్బంది లేకుండా చూడాలని చెప్పారు. తాగునీటి అవసరాలకు అందుబాటులో ఉన్న నీటిని ఇతర అవసరాలకు వినియోగించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. ఈ సమావేశంలో పీఆర్ అండ్ ఆర్డీ శాఖ కమిషనర్ కె.కన్నబాబు వర్చువల్‌గా పాల్గొన్నారు. జలవనరుల శాఖ ఈఎన్సీ నారాయణ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్సీ కృష్ణారెడ్డి, గ్రౌండ్ వాటర్ తదితర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

సంపాదకీయం

బద్దలైన అమిత్ షా అబద్ధాల పుట్ట

సాధారణంగా కోర్టుల తీర్పులు, ఆదేశాల మీద ప్రతికూల వ్యాఖ్యలు చేసే వారు ఉండరు. కోర్టు తీర్పులను సవాలు చేయొచ్చు. కింది కోర్టుల నుంచి సుప్రీంకోర్టు దాకా వెళ్లొచ్చు. ఎన్నికల బాండ్ల విషయంలో సుప్రీంకోర్టు చాలా నిక్కచ్చిగా వ్యవహరించింది. కానీ కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఎన్నికల బాండ్లను రద్దు చేయడంవల్ల నల్లధనం పడగ విప్పుతుందంటున్నారు. అంటే అత్యున్నత న్యాయస్థానం తీర్పునే ఖండిస్తున్నారు. బాండ్ల వివరాలు అందించడానికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్.బి.ఐ.) మొరాయించింది. వచ్చే జూన్ 30 నాటికి కానీ వివరాలు అందించలేమని సుప్రీంకోర్టు ఆదేశించిన గడువు తీరడానికి ఒకటి రెండు రోజుల ముందు మరింత గడువు కావాలని అర్జీ పెట్టుకుంది. సుప్రీంకోర్టు ససేమిరా అనడంతో ఒక విడత కొంత సమాచారం అందించింది. కానీ ఏ బాండ్లు ఏ పార్టీకి అందాయో చెప్పలేదు. మళ్లీ సుప్రీంకోర్టు గట్టిగా గద్దిస్తే ఆ వివరాలూ బయట పెట్టింది. సమాచారం అందించడానికి 136 రోజుల గడువు కావాలని కోరిన ఎస్.బి.ఐ. రెండు మూడు రోజుల్లోనే ఈ సమాచారం అంతా వెల్లడించవలసి వచ్చింది. అంటే అంత సమాచారాన్ని అందించే సామర్థ్యం ఎస్.బి.ఐ.కి ఉంది. కానీ జూన్ 30 దాకా గడువు కోరడంలో మతలబు లేకపోలేదు. ఈ లోగా ఎన్నికలు ముగుస్తాయి కనక అప్పటిదాకా ఎన్నికల బాండ్ల వివరాలను తొక్కి పెట్టి మోదీ సర్కారును వెనకేసుకు రావాలనుకుంది. చివరకు సుప్రీంకోర్టు ఆదేశం అమలైంది. నల్ల ధనాన్ని అదుపు చేయడానికి ఎన్నికల బాండ్ల విధానాన్ని ప్రవేశపెట్టామన్న మోదీ సర్కారు కూట వాదం సుప్రీంకోర్టు జోక్యంతో దూదిపింజల్లా ఎగిరిపోయింది. రాను రాను ఎన్నికల వ్యయాన్ని భరించడం రాజకీయ పార్టీలకు చాలా భారం అయిపోతోంది. 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికలు అత్యంత ఖరీదైనవంటున్నారు. ఎన్నికల బాండ్లపై ఓ పక్క సుప్రీంకోర్టు విచారిస్తుండగానే మోదీ ప్రభుత్వం ఇటీవల మరోసారి ఎన్నికల బాండ్లు జారీ చేసింది. బాండ్లు ముద్రించడానికి అయిన ఖర్చును ప్రభుత్వ ఖజానా నుంచి భరించారు. అంటే రాజకీయ పార్టీలకు బాండ్లు కొనివ్వడానికి అయ్యే ఖర్చును ప్రజలు చెల్లించే పన్నుల నుంచి ఖర్చు పెట్టడం వింతల్లో కెల్లా వింత. రాజకీయ పార్టీలకు 2018 నుంచి మొన్నటి దాకా నిధులు సమకూరింది కేవలం ఎన్నికల బాండ్ల ద్వారా మాత్రమే కాదు. ఇంకా కొన్ని ట్రస్టులూ ఉన్నాయి. నగదు రూపంలో కూడా జనం రాజకీయ పార్టీలకు విరాళాలు అందించవచ్చు. ఎన్నికల బాండ్ల రూపంలోనే రాజకీయ పార్టీలకు డబ్బు అందలేదు. మన దేశంలో వందలాది రాజకీయ పార్టీలున్నా బాండ్ల ద్వారా విరాళాలందింది కేవలం 20 పార్టీలకే. ఎన్నికలలో పోటీ చేయడానికే కాదు రాజకీయ పార్టీలను నడపడానికి కూడా బోలెడు డబ్బు కావాలి. శక్తి మేరకు రాజకీయ పార్టీలు ఏదో ఓ రూపంలో సమకూర్చు కుంటున్నాయి. ఇలా సమకూర్చుకోవడం ఎంత చెట్టుకు అంత గాలి అన్న రూపంలో సాగుతోంది.

వీటన్నింటినీ పక్కన పెట్టి ఇటీవల కేంద్ర హోం మంత్రి అంతి షా ఒక టీవీ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆడిన అబద్ధం ఆడకుండా మాట్లాడారు. ఎన్నికల బాండ్ల ద్వారా మొత్తం దాదాపు 20,000 కోట్లు సమకూరితే బీజేపీకి అందింది కేవలం 6,000 కోట్లే అని బుకాయించారు. మిగతా 19 పార్టీలకు మిగిలిన 14,000 కోట్లు అందినప్పుడు ఇంకా ఏడుపు ఎందుకు అని కూడా ప్రశ్నించారు. నిజానికి బీజేపీకి అందింది ఆరు వేల కోట్లు కాదు. ఆ మొత్తం 8,252 కోట్ల రూపాయలు. అంటే బాండ్ల రూపంలో అందిన మొత్తంలో బీజేపీకి 50.03 శాతం నిధులు సమకూరాయి. వివిధ రూపాలలో బీజేపీకి అందిన మొత్తం రూ.12,930 కోట్లు. బీజేపీకి 303 మంది లోక్‌సభ సభ్యులున్నందువల్ల కాస్త ఎక్కువ డబ్బు అంది ఉండొచ్చునని అమిత్ షా వాదిస్తున్నారు.

కానీ బీజేపీకి 2019లో వచ్చిన ఓట్లు 38 శాతం దాటలేదు. తమ సభ్యులు పోగా మిగతా 242 మంది సభ్యులున్న ఇతర పార్టీలకు 14 వేల కోట్లు అందాయిగా అని అమిత్ షా అంటున్నారు. బీజేపీకి లోక్‌సభలో ఆధిపత్యం ఉండొచ్చు. కానీ అనేక రాష్ట్రాలలో ఇతర పార్టీల ప్రభుత్వాలున్నాయి. ఆ పార్టీలకు లోక్‌సభ సభ్యులున్నారు. శాసనసభ్యులూ ఉన్నారు. బీజేపీకి పడని ఓట్లు 62 శాతం పైగా ఉన్నాయి. బాండ్ల రూపంలో అందింది ప్రజాప్రతినిధుల సంఖ్యనుబట్టి కాదు. ఈ వాస్తవాన్ని అమిత్ షా ప్రస్తావించరు. ఇది కాక నగదు రూపంలో విరాళాలిచ్చేవారూ ఉంటారు. బీజేపీకే కాదు ఏ రాజకీయ పార్టీకైనా అందిన విరాళాల మొత్తాన్ని కచ్చితంగా చెప్పడానికి మార్గమేలేదు. ఎన్నికల బాండ్లు చట్టబద్ధం కాదని, రాజ్యాంగ విరుద్ధం అని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. పైగా నల్ల ధనాన్ని అరికట్టడానికి బాండ్లు ఒక్కటే మార్గం కాదనీ ఇతర మార్గాలు ఎన్నో ఉన్నాయని తేల్చి చెప్పింది.

కానీ అమిత్ షా మాత్రం ఈ తీర్పునే తప్పుపడ్తున్నారు. ఈ బాండ్లవల్ల నల్ల ధనం బెడద తప్పేదంటున్నారు. బాండ్లు రద్దు చేశారు కనక మళ్లీ నల్లధనం పడగెత్తుతుందని వాదిస్తున్నారు. అంటే ఆయన నేరుగా సుప్రీంకోర్టు నిర్ణయాన్నే వ్యతిరేకిస్తున్నారు. ఎన్నికల బాండ్ల ద్వారా నిధులు సమకూర్చుకోవడానికి బీజేపీ అనేక మార్గాలు అనుసరించింది. అనేక కంపెనీల మీద ముందు దాడులు చేయించింది. ఆ తరవాత ఆ కంపెనీలు బాండ్లు సమర్పించి బీజేపీని ప్రసన్నం చేసుకున్నాయి. అనేక బూటక కంపెనీలూ బాండ్లు కొన్నాయి. వాటిలో ఎక్కువ మొత్తం బీజేపీకే అందింది. ఔషధాలు తయారు చేసే ఏడు కంపెనీలు ఔషధ ప్రమాణాల పరీక్షలో విఫలమైనాయి. అవీ బాండ్ల ద్వారా విరాళాలు సమర్పించుకున్నాయి. రాష్ట్రాలలో అధికారంలో ఉన్న కొన్ని పార్టీలు కేంద్ర ప్రభుత్వ రీతిలోనే వ్యాపారస్థుల మీద దాడులు చేశాయి. ఆ తరవాతే ఆ వ్యాపారస్థులు బాండ్లు సమర్పించారు. బీజేపీ దాడులకు భయపడి బాండ్ల రూపంలో నిధులు సమకూర్చిన కంపెనీలు వందలాదిగా ఉన్నాయి. వ్యాపార వర్గాలు రాజకీయ పార్టీలకు నిధులు సమకూర్చడం కొత్తేమీ కాదు. ఈ రూపంలో అధికారంలో ఉన్న పార్టీలను సంతృప్తి పరచడంలో వ్యాపరస్థులూ ఆరితేరి పోయారు. కాంట్రాక్టులు సంపాదించిన వారూ నిధులు అందిస్తారు. నల్ల ధనం ఇంతకు ముందూ ఉంది. ఇప్పుడూ ఉంది. బూటకపు వాగ్దానాలు చేసే బీజేపీ అండతో ఇది మరింత పెరుగుతూనే ఉంటుంది. నల్లధనం మూలాలను నరికేసే ఉద్దేశం బీజేపీకి ఏ కోశానా లేదు. అందులో ఎక్కువ వాటా తమకే దక్కాలనుకుంటుంది. బంగారు బాతు గుడ్లు పెట్టే బాండ్లు పోయాయన్న చింత బీజేపీని వేధిస్తోంది.

మోదీ మాటలకు అర్థాలే వేరులే

సవ్యసాచి

రాజకీయ రణతంత్రం అనగానే పంచతంత్రం గుర్తుకు రావడం సహజం. విష్ణుశర్మ పంచతంత్రంలో మిత్రభేదం, మిత్రలాభం, కాకోలూకీయం, లబ్ధప్రణాశం, అపరీక్షిత కారకం ఉంటాయి. ఈ రచన ద్వారా ఆరు నెలలోనే రాకుమారులను నీతి శాస్త్రజ్ఞులను చెయ్యాలన్నది విష్ణుశర్మ సంకల్పం. అయితే పంచతంత్రంలో రాకుమారులకు కుట్రలు, కుయుక్తులు, అడ్డదారులు నేర్పలేదు. అవి ఎలా ఉంటాయో తన కథల ద్వారా పరిచయం చేస్తాడు. అందువల్లనే పంచతంత్రం కాలక్రమేణా హితోపదేశంగా, నీతిచంద్రికగా ప్రాచుర్యం పొందింది. మన కాలంలో ఆ పంచతంత్రం రాజకీయ రణతంత్రంగా వికృత రూపం పొందింది. పైగా మోదీ మార్క్ రాజకీయ రణతంత్రం ప్రత్యేకమైనది. మోదీ రణతంత్రం హితోపదేశం కాదు...విద్వేషోపదేశం, అది నీతి చంద్రిక కాదు, దుర్నీతి చంద్రిక ... మోదీ రణనీతి ప్రకృతి కాదు, వికృతి. అదొక విశ్వామిత్ర సృష్టి. స్వర్గానికి పోతున్నామన్న భ్రమ కల్పించి మనల్ని త్రిశంకు స్వర్గానికి చేరుస్తుంది. అందులో చిక్కుకుంటే సాలెగూడులో చిక్కుకున్నట్లే. పైకిపోలేం. కిందకు దిగలేం. 2024 ఎన్నికలు వస్తున్నాయి. మోదీ కొత్త నినాదాన్ని ఆలపిస్తున్నారు. 'మోదీ గ్యారంటీ' అంటూ జబ్బ చరిచి మరీ ప్రకటిస్తున్నారు. మోదీ మౌనం వెనుక, మాటల వెనుక ఒక రహస్యం వుంటుంది. స్వప్రయోజనం వుంటే మౌనం నటిస్తూ పనికానిచ్చేస్తారు. ఈ పనులకు బహిరంగ ప్రకటనలు వుండవు. జబ్బ చరుపులు వుండవు. అంతా నిగూఢ గుప్తమే. ఆదానికి విమానా శ్రయాలు, పోర్టులు, సహజ వనరులు దఖలు పరుస్తారు. అంబానీకి ఆయిల్, గ్యాస్ నిక్షేపాలను టెలి కమ్యూనికేషన్‌లు విస్తరించడానికి గేట్లు తెరుస్తారు. ఎన్నికల బాండ్లు సమర్పిస్తే ప్రాజెక్టులు, వారికి మంజూరవుతాయి. ఎలాంటి ప్రకటనలూ లేకుండానే ఆప్త మిత్రులకు కాసుల పంట పండిస్తారు. ఐటీ, ఈడీ, సీబీఐ ఆయన అంబులపొదిలో అస్త్రాలు. వాటితో దాడులు చేయిస్తారు. లొంగిన వాళ్లకు పార్టీ కండువాలు కప్పి కేసులను పక్కన పెడతారు. లొంగకపోతే జైళ్లపాలు చేస్తారు. వీటన్నింటినీ మోదీ చెప్పకుండా చేస్తారు. అడ్డదారుల్లో పార్టీ నిధులను పోగేస్తారు. ఎప్పుడైనా ఎన్నికలకు సిద్ధం అంటారు. ఈ డబ్బుతో ప్రతిపక్షాల ప్రభుత్వాలను కూల్చేస్తారు. వారిని భయభ్రాంతులను చేస్తారు. మోదీ మౌనతంత్రంతో సాగించే కుతంత్రాలకు ఇవి కొన్ని మచ్చు తునకలు మాత్రమే !

మనకు తెలిసిన రాజకీయ మోదీ హామీలు ఇచ్చే మోదీ. ఈ హామీలను పదేపదే వల్లిస్తారు. వీటినే ఎన్నికలప్పుడు గ్యారంటీలు అని జబ్బ చరిచి మరీ ప్రకటిస్తారు. ఏతావాతా ఇవన్నీ వారంటీ లేని గ్యారంటీలు. కొన్ని ప్రకటనలతోనే తుస్సు మంటాయి.. మరికొన్ని ఆచరణకు ఆమడదూరంలో మహిళా రిజర్వేషన్ల చట్టంలా మురిపిస్తాయి. ఎన్నికలలో అవసరమైన "పౌర సత్వ సవరణ" చట్టాలు లాంటి వాటిని బైటకు తీసి తక్షణం అమలులోకి తెస్తారు. మోదీ హామీల తంతు మనకు తెలియంది కాదు. 2014లో తెలుగుదేశం, బీజేపీ, జనసేన పార్టీలు తిరుపతిలో ఎన్నికల సభ నిర్వహించాయి. ఆ వేదిక మీద ప్రధాని అభ్యర్థిగా వున్న మోదీ విభజన వల్ల కలిగిన కష్టాల మీద భావోద్వేగ పూరిత ప్రసంగం చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తానని ప్రకటించారు. తిరుపతి దేవుని పాదపద్మాల చెంత మోదీ స్వయంగా చేసిన వాగ్దానం. అందరూ ఈ హామీని గ్యారంటీ అనుకున్నారు. అధికారంలోకి వచ్చాక "ప్రత్యేక హోదా"కు ఆయన వాయిదాల మీద తిరుక్షవరం చేశారు. 14వ ఆర్థిక సంఘం అడ్డు చెప్పిందని బుకాయించారు. ప్రత్యేక హోదా సమస్య తమ పరిధిలోనిది కాదని వారు ప్రకటించినా అదే పాట నేటికీ పాడుతున్నారు. దేశంలోనే అతి గొప్ప రాజధాని నిర్మాణం జరిపిస్తామని మోదీ ప్రకటించారు. ఈ రాజధానికి మోదీ స్వయంగా శంకుస్థాపన చేశారు. చారెడు మట్టి, చెంబుడు నీళ్లు ఇచ్చి సరిపెట్టారు.

విభజన చట్టంలో ఎన్నో హామీలున్నాయి. అవి చట్టబద్ధమైన హామీలు. కేంద్రం గ్యారంటీగా అమలు చేయాల్సిన హామీలు. కడపలో ఉక్కు ఫ్యాక్టరీ, దుగరాజపట్నంలో పోర్టు, ఉత్తరాంధ్ర, రాయలసీమలకు ప్రత్యేక తరహా నిర్దిష్టమైన ప్యాకేజీలు వీటన్నింటికీ మోదీ ఎగనామం పెట్టారు. పోలవరం ప్రాజెక్టుకు అరకొర నిధులు, కొన్ని విద్యా సంస్థల ఏర్పాటుతో సరిపెట్టారు. ఈ రాష్ట్రంలో 2014 నుంచి ఇప్పటి వరకు దాదాపు ప్రత్యక్షంగాను, పరోక్షంగాను డబుల్ ఇంజిన్ సర్కారులే నడిచాయి. ఇక్కడ ఎవరు అధికారంలో లేదా ప్రతిపక్షంలో వున్నా ఎడాపెడా మోదీకే జైకొట్టారు. అయినా మోదీ ప్రసన్నుడు కాలేదు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో పరుగులు తియ్యలేదు. ఇప్పుడు మోదీ డబుల్ ఇంజిన్ సర్కారు వస్తే రాష్ట్రాన్ని పరుగులు పెట్టిస్తామంటున్నారు. ఇది మోదీ గ్యారంటీ అంటున్నారు. మోదీ చేతల భాష మౌనం. మోదీ కోతల భాష హామీలు, గ్యారంటీలు. అందుకే ఆయన మాటలకు అర్థాలే వేరులే.

నాడు బ్రిటీష్ రాజ్యం - నేడు బిలియనీర్ల భోజ్యం !!

ఎం కోటేశ్వరరావు

తెల్లోడి రాజ్యమే బాగుంది, కమ్యూనిస్టులే మంచోళ్లు అని మా తాత చెప్పేవాడు. ఎందుకంటే రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో ఆంగ్ల పాలకులు ఆహార ధాన్యాల ఉత్పత్తి పెంచండి అన్న విధానంలో భాగంగా బండి పట్టాలకు అవసరమైన ఇనుము ఇచ్చారట, వాటిని పంపిణీ చేయటంలో ఆ నాడే కాంగ్రెస్ వారు తన, పంభేదాన్ని పాటిస్తే కమ్యూనిస్టులు అందరికీ ఇప్పించేందుకు చూశారట. తెల్లోడి పాలనను తప్పుపట్టనందుకు మా తాతను విమర్శించాలా ? ఒక రైతుగా తన పరిమిత ప్రయోజనాన్ని చూసి సంతోషించినందుకు విమర్శించాలా ? ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ ఉంటూనే ఉంటుంది. జనజీవితాలను దిగజారుస్తూ కార్పొరేట్లకు కట్టబెడుతున్న మోదీని వ్యతిరే కించాలా ? రామాలయం కట్టినందుకు సానుకూలంగా ఉండాలా ? ముఖ్య వైరుధ్యం ఏమిటన్నదే కీలకం. నరేంద్రమోదీ పదేళ్ల విజయ గీతాలాపన వికసిత భారత్ చెవుల తుప్పు వదిలిస్తున్నది. 2004లో ఇదే బీజేపీ దేశం వెలిగిపోతోం దంటూ తాను ఆరిపోయిందనుకోండి. ఇప్పుడూ అదే జరగనుందా ? ఎవరి అంచనాలు వారివి ! పదేళ్లలో తమను మరింతగా పెంచిన మోదీ ఏలుబడిని బిలియనీర్లు అంత తేలికగా వదులుకోరు, వారి చేతుల్లో ఉన్న మీడియాలో మోదీ భజన మరింత పెరుగుతుంది, దీనికి మతం మత్తు ఎలాగూ ఉంది. ఈ అంశాన్ని తక్కువ అంచనా వేయకూడదు. జాడలేని అచ్చేదిన్: వికసిత భారత్ అంటూ బీజేపీ ప్రచార గాలి తీస్తూ రెండు నివేదికలు తాజాగా వెలువడ్డాయి. ఒకటి ప్రపంచ సంతోష సూచికలో మనదేశ స్థానం గత పది సంవత్సరాల్లో దిగజారింది తప్ప జనానికి అచ్చేదిన్ జాడలేదని స్పష్టం చేసింది. ఐక్యరాజ్య సమితి రూపొందిస్తున్నది గనుక సంతోష సూచికను మేం అంగీకరించం అని బీజేపీ తలాయిస్తే కుదరదు.తలసరి జీడీపీ, సామాజిక మద్దతు, ఆరోగ్యం, జీవన విధానాన్ని ఎంచుకొనే స్వేచ్ఛ, ఉదారత, ప్రభుత్వం, ప్రైవేటు రంగాలలో అవినీతిని జనం ఎలా చూస్తున్నారు అనే ప్రాతిపదికల మీద ప్రతిదేశం తెచ్చుకొనే మార్కులను బట్టి సూచికలను ప్రకటిస్తారు. ప్రతి ఏడాది సూచిక అంతకు ముందు రెండు సంవత్సరాల తీరుతెన్నుల ప్రాతిపదిన ఉంటుంది. కొన్ని సార్లు పరిగణనలోకి తీసుకొనే దేశాల సంఖ్యలో తేడాలు ఉండవచ్చు. అందు వలన మార్కులను బట్టి దిగజారిందా మెరుగుపడిందా అన్నది కూడా చెప్పవచ్చు. మన ఇరుగు పొరుగు దేశాల వివరాలను చూద్దాం. 1.సూచిక, మార్కులు అంటే 2014-16 సంవత్సరాలకు సంబంధించి 2017వ సంవత్సర నివేదిక, 2 సూచిక, మార్కులు అంటే 2021-23కు సంబంధించి 2024 నివేదిక వివరాలు.

నరేంద్రమోదీ అధికారానికి వచ్చినపుడు ప్రపంచ జీడీపీలో పదవ స్థానంలో ఉన్నదానిని ఐదవ స్థానానికి చేర్చారని గొప్పలు చెప్పుకుంటారు. త్వరలో చైనాను అధిగమించి పోతామని అందుకే వికసిత భారత్ అని చెబుతున్నారు. గడచిన పదేళ్లలో చైనాకు పోటీగా దేశాన్ని నిలబెడతానని చెప్పిన మోదీ దానితో పోలిస్తే దేశాన్ని ఎక్కడ ఉంచారో పైన పేర్కొన్న సంతోష సూచికల్లోనే డొల్లతనం వెల్లడైంది. ఉన్నదాన్ని ఉన్నట్లుగా ఉంచటంలోనూ విఫలమయ్యారు. పదేళ్ల క్రితం ప్రపంచ జీడీపీలో చైనా వాటా 13.1శాతంగా ఉన్న దాన్ని 2023లో 17.7శాతానికి పెంచుకోగా మన వాటా 2.6 నుంచి 3.73కు పెరిగింది. పాకిస్థాన్ జీడీపి 2014లో 271.4బిలియన్ డాలర్ల నుంచి మధ్యలో ఒక ఏడాది 374.66 బిలియన్ డాలర్లకు పెరిగి 2023లో 340.64 బిలియన్ డాలర్ల వద్ద ఉంది. జీడీపీ పెరిగినా సంతోష సూచిక పతనంలో మనకూ పాకిస్థాన్‌కూ తేడా ఏముంది ? అచ్ఛేదిన్, వికసిత భారత్ నినాదాలు ఇచ్చిన వారూ, విదేశాల్లో దేశ ప్రతిష్ట పెంచినట్లు చెప్పుకున్నవారూ అక్కడ లేరు. బీజేపీ చెబుతున్నట్లు మనకు అన్నీ ఉన్నా జనాలు ఎందుకు సంతోషంగా లేకపోతున్నారు ? పదేళ్లలో పెరిగిన అసమానతలు : నాటి బ్రిటీష్ వలస పాలనలో కంటే నేటి స్వతంత్ర పాలనలో ఆర్థిక అసమానతలు ఎక్కువగా పెరిగినట్లు తాజాగా ప్రపంచ అసమానతల ప్రయోగశాల(వరల్డ్ ఇనీక్వాలిటీ లాబ్) 2024 మనదేశం గురించి ప్రకటించిన విశ్లేషణలో పేర్కొన్నది. నాడు మన జనాన్ని విదేశీ దొరలు దోచుకుంటే నేడు స్వదేశీ దొరలు ఆ పని చేస్తున్నారు. అనేక అంశాల మీద



అందుబాటులో ఉన్న సమాచారాన్ని క్రోడీకరించి ఆర్థికవేత్తలు నితిన్ కుమార్ భర్తీ, లూకాస్ ఛాన్సెల్, థామస్ పికెట్టీ, అన్‌మోల్ సోమాంచీ ఒక పత్రాన్ని రూపొందించారు. దానిలో పేర్కొన్న ప్రధాన అంశాలేమిటి ? స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి 1980దశకం వరకు అసమానతలు తగ్గాయి. తరువాత ముఖ్యంగా 1990వ దశకంలో సంస్కరణలు ప్రారంభించిన పదేళ్ల తరువాత విపరీతంగా పెరిగాయి. నరేంద్రమోదీ ఏలుబడిలో అది మరింత ఎక్కువైంది. 1982 నాటికి దేశంలోని ఎగువ ఒక శాతం మంది రాబడి 6.1శాతం, అది 2014-15 నుంచి 2022-23 వరకు పరిశీలించినపుడు 22.6శాతం ఉంటే వారి వద్ద పోగుబడిన సంపదలు 40.1శాతంగా ఉన్నాయి. ఎగువ పదిశాతం మంది వద్ద 2022 నాటికి దేశ సంపదల్లో 60శాతం ఉన్నాయి. ఇలాంటి పరిస్థితి ప్రపంచంలో ఎక్కడా లేదు. అంతరాలు ఎక్కువగా ఉన్నట్లు భావిస్తున్న దక్షిణాఫ్రికా, బ్రెజిల్, అమెరికాల్లో కూడా ఆదాయరాబడి వాటా ఇంతగా లేదు. పన్నుల విధానం, ప్రపంచీకరణ దీనికి కారణం. ధనికులుగా ఉన్న 167 కుటుంబాల సంపదపై రెండుశాతం పన్ను విధిస్తే జాతీయ ఆదాయం 0.5శాతం పెరుగుతుందని అంచనా వేశారంటే సంపద ఎలా గుట్టలుగా పడి ఉందో అర్థం చేసుకోవచ్చు. సక్రమంగా లేని సమాచారం మేరకే తాము అసమానతల గురించి చెబుతున్నా మని, నాణ్యమైన, సమగ్ర సమాచారం ఉంటే అసమానతలు ఇంకా ఎక్కువగా ఉంటాయని పేర్కొన్నారు. ధనికుల్లో ఉన్న ఎగువ తరగతిలో కూడా మిగతవారితో పోలిస్తే వారిలో 0.1శాతం మంది పదిశాతం రాబడిని పొందారు. ప్రస్తుతం రెండు భారత దేశాలు కనిపిస్తున్నాయని కొందరు చెప్పిన మాటలను నరేంద్రమోదీ నిజం చేస్తున్నారు. అందుకే కార్పొరేట్ మీడియా, ధనికుల ప్రతినిధులందరూ మరోసారి వచ్చే ఎన్నికల్లో మోదీని కోరుకుంటున్నా రన్నది స్పష్టం. దేశంలో అనేక సమస్యలకు జనాభా పెరుగుదలే కారణం అని గతంలో ఊదరగొట్టారు, కుటుంబ నియంత్రణ విధానాన్ని అమల్లోకి తెచ్చారు. ఇప్పటి పాలకులు అధిక జనాభా మన దేశానికి వరం అని ప్రపంచ పారిశ్రామిక కేంద్రంగా మారటానికి అవసరమైన చౌక శ్రామిక శక్తి అందు బాటులో ఉందని తమ జబ్బలను తామే చరుచుకుంటున్నారు. మరోవైపు గత పదేళ్లుగా కేంద్రంలో, వివిధ రాష్ట్రాలలో అధికారంలో ఉన్న కాషాయ దళాలు ముస్లిం జనాభా పెరిగి హిందువుల కంటే మెజారిటీగా మారనున్నదనే తప్పుడు ప్రచారం చేస్తున్నాయి. అది నిజమా, సంతోషం ఆవిరి అవుతున్న స్థితిలో ఏ మతానికి చెందిన వారైనా ప్రతి కుటుంబమూ పరిమితం చేసుకొనేందుకు చూస్తున్నాయని ఐదవ జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే వివరాలు వెల్లడిస్తు న్నాయి. జనన-మరణాల రేటును ప్రాతిపదికగా తీసుకున్నప్పుడు జననాల రేటు 2.1గా ఉండాలని ఆ రంగనిపుణులు పేర్కొన్నారు. కానీ తాజా సర్వే ప్రకారం రెండు శాతమే ఉన్నందున రానున్న రోజుల్లో జనాభా తగ్గుతుంది తప్ప పెరగదని చెబుతున్నారు. జనాభాలో పదిహేనేళ్ల లోపు వారు 2015-16లో 28.6శాతం ఉండగా 2019-21లో 26.5శాతానికి తగ్గారు. అంటే కుటుంబాల్లో పిల్లల సంఖ్య తగ్గుతోంది. జమ్ము-కశ్మీరు జనాభాలో 68శాతం ముస్లింలే ఉన్నారు. అక్కడ జననాల రేటు దేశ సగటు కంటే తక్కువగా 1.4శాతమే ఉంది. దేశంలోని ఇతర ప్రాంతాల్లో ఉన్న ముస్లిం జననాల సగటు కంటే కూడా ఇది తక్కువ. విద్య, ఉపాధి, వైద్య, ఆరోగ్య రంగాల్లో కేటాయింపులు ఎక్కువగా ఉండి జనాల పరిస్థితి మెరుగుపడితే కులం, మతంతో నిమిత్తం లేకుండా కుటుంబనియంత్రణ ఎవరికి వారు పాటిస్తారన్నది అందరికీ తెలిసిన సత్యం.

మెదడు గుడ్డిదైనప్పుడు కళ్లుండి లాభం లేదు!

డాక్టర్ దేవరాజు మహారాజు

ఖుద్ గలత్ హోకర్ ఖుద్ కొ సహీ
సాబిత్‌కర్‌నా ఇతనా ముష్కిల్ నహీ హోతా
జిత్‌నా సహీ హోకర్, ఖుద్‌కొ సహీ సాబిత్
కర్‌నా

తప్పు చేసి, చేసిన పని సరైనదేనని నిరూపించుకోవడం ఏమంత కష్టమైన పనికాదు. సరైన పనిచేసి, చేసింది సరైనదే అని నిరూపించుకోవడం ఈ రోజుల్లో చాలా కష్టం! అని పై చరణాలకు అర్థం. 'ఇదీ భారత్! ఇండియా కాదు' అని అంటాడొకడు. తాజ్‌మహల్‌ను తేజో మహల్ అని అంటానంటాడొకడు. అసలు యహూదీ-అనే పదమే తప్పు-దాన్ని యాదవ అని అనాలని అంటాడు-ఇంకొకడు. ఇక భార్యను హత్యచేసి తత్త్వవేత్తగా మారిన వాడొకడు ఆస్ట్రేలియాను అస్త్రాలయా అని పిలవాలంటాడు. ఇంతమంది మేతావులు ఈ దేశంలో ఎందుకు పుట్టుకొచ్చారంటే - ఆరో తరగతిలో స్కూల్లో పేరు తీసేస్తే పోయి, లేని రైల్వేస్టేషన్లో చాయ్ అమ్ముకున్నానన్నవాడు ఎంఏ డిగ్రీ కొనుక్కుని వచ్చి పరిపాలకుడైనందుకు! ఓ చోట తల్లిని, మరోచోట భార్యను విడివిడిగా వదిలేసి, నైతికత అనేది లేకుండా జాగ్రత్తపడి-శూద్రుడై ఉండి మనువాద పల్లకీ మోస్తున్నందుకు!! ప్రపంచ దేశాలు బలాదూరు తిరుగుతూ 'విశ్వగురువు' నయ్యాననే భ్రమలో బ్రతుకుతున్నందుకు!! దేశం ప్రమాదకర స్థితిలోకి దిగజారిపోయింది. మెదడు గుడ్డిదైనప్పుడు కళ్లుండి లాభంలేదని అంటున్నది ఇందుకే.. దేశం ఈ స్థితికి రావడానికి మూలకారణం ఆర్ఎస్ఎస్ సంస్థ. అది ఎలాంటిదో అది ఎన్నెన్ని ఘనకార్యాలు వెలగబెట్టిందో చూడండి. 1925లో ఆర్ఎస్ఎస్ స్థాపన జరిగింది. 1930 మార్చిలో ఉప్పు సత్యాగ్రహం జరిగినప్పుడు, అందులో ఆర్ఎస్ఎస్ పాల్గొనదని తేల్చి చెప్పాడు హెడ్గేవార్! పైగా 1940 డిసెంబరులో బ్రిటీష్‌వారి 'ఇంపీరియల్ సివిల్ గార్డ్'లో చేరిన ఆర్ఎస్ఎస్ వారికి భజనచేసింది. 1942 ఆగస్టులో క్విట్ఇండియా ఉద్యమం ఊపందుకున్నప్పుడు తాము అందులో పాల్గొనబోమని ఆర్ఎస్ఎస్ స్పష్టం చేసింది. 1947 ఆగస్టులో దేశానికి స్వాతంత్ర్యం లభించినప్పుడు, మువ్వన్నెల త్రివర్ణ పతాకాన్ని తాము జాతీయజెండాగా గౌరవించమని ఆర్ఎస్ఎస్ ప్రకటించింది. చాలాకాలం వారు దాన్ని ఎగురేయలేదు. అదీ వారి దేశభక్తి! 1948 జనవరిలో గాంధీని చంపినవాడెవరూ? ఆర్ఎస్ఎస్ కార్యకర్త గాడ్సేనే కదా? ఇది బహిరంగ రహస్యమే కదా? 1948 ఫిబ్రవరిలో చట్టవ్యతిరేక కార్యకలాపాలు చేస్తున్న సంస్థగా గుర్తింపుపొంది ఆర్ఎస్ఎస్ భారత ప్రభుత్వ నిషేధానికి గురైంది. 1949 నవంబరులో మనుస్మృతిని తప్పించి, అంబేద్కర్ రాసిన భారత రాజ్యాంగాన్ని ఒప్పుకోమని ఆర్ఎస్ఎస్ బహిరంగంగా ప్రకటించింది. 1951 ఫిబ్రవరిలో మహిళలకు సమానహక్కులు ప్రసాదించే 'హిందూ కోడ్‌బిల్'ను ఆర్ఎస్ఎస్ వ్యతిరేకించి దేశవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు చేపట్టింది. ఇవన్నీ నిశితంగా పరిశీలిస్తే ఏమనిపిస్తుంది? మెదడు గుడ్డిదైనప్పుడు కళ్లుండి లాభంలేదని అనిపించడంలేదా?

ఇస్రో చంద్రుడి ఉపరితలాన్ని ఫొటోలు తీయగలుగుతుంది. కానీ, 140 కోట్లకు పెరిగిన భారతదేశ జనాభాలోఉన్న మూర్ఖుల మెదళ్లలోంచి మూర్ఖత్వాన్ని ఇంకా మనం ఫొటో తీయలేకపోతున్నాం. చంద్రయాన్-3 విజయవంతమైంది గనక, అక్కణ్ణించి దేవుణ్ణడిగి మాకు వర్షాలెప్పుడు కురుస్తాయో అడిగి చెప్పాలని- బీహారుకు చెందిన ఒక వ్యక్తి ఆర్‌టీఐ యాక్ట్ కింద దరఖాస్తు చేసుకున్నాడు. సామాన్యుల్లో ఉంటే అర్థం చేసుకోవచ్చు. కానీ మూర్ఖత్వం ప్రముఖుల్లో ఉంటే దాన్ని ఏమనాలి? ఉదాహరణకు ఉత్తరప్రదేశ్‌లో ఒక డీజీపీ రాష్ట్ర పోలీసులకు ఆదేశాలు జారీ చేశాడు. హిందూ పంచాంగాన్ని అనుసరించి విధులు నిర్వహించాలన్న ఆదేశాలతోపాటు రాష్ట్రంలోని అన్ని పోలీస్‌స్టేషన్లకు పంచాంగాలు పంపిణీ చేశాడు. పోలీసులు పంచాంగాలు చూసుకుంటారు సరే, మరి దొంగలు, నేరగాళ్లు పంచాంగాల ప్రకారం, నేరాలు చేయరుకదా? మెదడు గుడ్డిదైనప్పుడు కళ్లుండి లాభంలేదు కదా? చంద్రయాన్-3 విజయవంతంకాగానే చంద్రుణ్ణి 'హిందూదేశ్'గా ప్రకటించాలని చక్రపాణి అనే స్వామి ప్రకటించాడు. లోగడ చంద్రయాన్-2 కూలి పోయిన చోటుకు 'తిరంగా పాయింట్' అనీ-చంద్రయాన్-3 ల్యాండర్ విజయవంతంగా దిగిన చోటుకి 'శివశక్తి' అని మోదీ ప్రభుత్వం పేర్లు పెట్టింది. తొలిసారి చంద్రుడి మీదికి మతాన్ని చేర్చగలిగామని చంకలు గుద్దుకుంది. అలా ఇష్టంవచ్చిన పేర్లు పెట్టడానికి వీలుండదు. దానికి అంతర్జాతీయ ప్లానిటరీ బాడీ విధించిన నియమాలు నిబంధనలూ కొన్ని ఉంటాయి. మూర్ఖత్వం వదులుకున్న వారికి మాత్రమే కదా విషయాలు అర్థమయ్యేదీ? చంద్రయాన్-3లో వెళ్లిన యాత్రికులకు సెల్యూట్ చేస్తున్నానని ప్రకటించాడొక బీజేపీ మంత్రి. ఆస్ట్రనాట్స్ ఎవరూ వెళ్లలేదన్న విషయం కూడా ఆ మహాపురుషుడికి తెలియదన్నమాట! కాంగ్రెస్ పాలనలో చైనా మన దేశపు 43,000 కి.మీ భూమిని ఆక్రమించింది అని అన్నాడు బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా. భూమి చుట్టు కొలతే 40,075 కి.మీ అయితే, అంత కన్నా ఎక్కువ భారత భూభాగాన్ని చైనా ఎలా ఆక్రమించిందీ? మన దేశపు మొత్తం భూభాగం ఉన్నదే 32,87,263 చ.కిమీలు. నడ్డా 43వేల చదరపు కిలోమీటర్లు అని అనాల్సింది. అంత తెలివే ఉంటే బీజేపీకి అధ్యక్షుడెట్లా అవుతాడూ? అని దేశ ప్రజలు నవ్వుకున్నారు. చుట్టుకొలత కిలోమీటర్లలో చెపుతాం. విస్తీర్ణం చదరపు కిలోమీటర్లలో చెపుతాం. బీజేపీ మేధావులు మెదళ్లు మూసుకుని, తమ కళు తెరిచే ఉన్నాయని అనుకుంటారు. మహిళలు బట్టల్లేకపోయినా అందంగానే ఉంటారంటూ పతంజలి బాబా రామ్‌దేవ్ వ్యాఖ్యానించాడు. మహారాష్ట్ర మాజీ సీఎం ఫడ్నవీస్ భార్యపైన కూడా వ్యాఖ్యలు చేశాడు. అమెకు వందేళ్లవరకు ముసలితనం రాదని సర్టిఫికేట్ ఇచ్చాడు. మెదళ్లు మూసుకున్న పరిపాలకులకు ఆశ్రితులు మెదడులేని మూర్ఖులే ఉంటారు. పైగా మెల్లకళ్లతో చూసినా వాళ్లేమీ చూడలేరు. "ఒక దేశానికి, ఇంకో దేశానికి మధ్య యుద్ధం జరుగుతున్నప్పుడు తటస్థంగా ఉండడమో-ఏదో ఒక దేశానికే మద్దతివ్వడమో చేయవచ్చు కానీ, ఒక దేశానికి, ఒక ఉగ్రవాద సంస్థకి యుద్ధం జరుగుతున్నప్పుడు బుద్ధి ఉన్నోడెవడైనా

ఉగ్రవాద సంస్థకి మద్దతిస్తాడా? మిమ్మల్ని, మీ కుటుంబాన్ని మీపార్టీని ఆరు దశాబ్దాలు భరించడం మా తప్పయిపోయింది. ఇక మీదట ఆ అదృష్టం మా కొద్దులే నాయనా"! అని ఒక తెలుగు సినీ గేయ రచయిత పరోక్షంగా కాంగ్రెస్‌ను విమర్శిస్తూ ఒక ప్రకటన చేశాడు. అతను జై శ్రీరామ్ అనలేదుగానీ, తానే ఆ శ్రీరామ్ అయినంతగా తన బత్తాయిరంగు ప్రదర్శించాడు. అయితే కాంగ్రెస్ పాలస్తీనా ప్రజలకు మద్దతిచ్చిన విషయం తెలుసుకోకుండా విమర్శించడం సరికాదని ఆనేక మంది బుద్ధి చెప్పారు. బుద్ధి ఉన్నోడెవడో లేనోడు ఎవడో అక్కడే అర్థమైంది. మిడిమిడి జ్ఞానంతో, వాట్సప్ యూనివర్సిటీ పట్టభద్రులు ఈ మధ్య ఇలాగే రెచ్చిపోతున్నారు. సినిమా పాటలురాసినా, మరోవైపు సాహిత్య రంగంలో కూడా విశిష్టమైన కృషి చేసిన మహనీయులకే దొరకాల్సిన గౌరవం దొరుకుతుంది. అల్పుడెప్పుడు పల్కు ఆడంబరముగాను అంటూ తమ అల్పత్వాన్ని ప్రదర్శించుకుంటూ ఉంటారు. చంద్రయాన్-3ని కూడా కొందరు మోసగాళ్లు తమ స్వార్థానికి వాడుకుంటున్నారు. ఆ ప్రాజెక్టు విజయవంతం కావడానికి 'రైస్‌పుల్లింగ్' కారణమనీ అందుకు ఉపయోగించిన పాత్ర తమ వద్ద ఉందంటూ కొందరు హైదరాబాద్ రియల్‌ఎస్టేట్ వ్యాపారి నుంచి ఇరవై కోట్లరూపాయలు కొట్టేశారు. అతను లబోదిబోమని మొత్తుకుని, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తుచేసిన, నలుగురు నిందితుల్ని పట్టుకున్నారు. అణ్వాయుధాల్లోను, శాటిలైట్స్‌లోను ఉపయోగించే రాగి చెంబు తమ మద్ద ఉందంటూ వారు జనాన్ని మోసం చేస్తున్నారని పోలీసులు కుంభకోణాన్ని బైటపెట్టారు. మోసగాళ్లు చెప్పారు సరే మరి అంత ధనవంతుడైన ఆ రియల్ ఎస్టేట్ వ్యాపారికి మెదడెందుకు పనిచేయలేదూ? కనీసమైన ఇంగితజ్ఞానం, లోకజ్ఞానం లేకుండా కూడా కోట్లు సంపాదించొచ్చా? మెదడు గుడ్డిదైతే అంతేనేమో! భార్య, భర్తకు కాళ్లు ఎందుకు నొక్కాలి? అనే విషయం మీద ఒక పైత్యేషు శర్మ ఇలా వివరణ ఇచ్చాడు. సంప్రదాయబద్ధమైన ఆ వివరణ విని, దైవ భక్తులంతా ముచ్చటపడ్డారు. "పురుషులకు కాలివేళ్లనుండి మోకాళ్లవరకు ఉన్న భాగం శనిది. స్త్రీల చేతివేళ్ల కొసల నుంచి ఆరచేయి వరకు ఉన్న భాగం శుక్రుడిది. భార్య, భర్త కాళ్లు పట్టడం ద్వారా శనిపై శుక్రుడి ప్రభావం పడి ఆ ఇంట ధనప్రాప్తి కలుగుతుంది!" చాలా పకడ్బందీగా సమాధానం కూర్చుకున్నారుగానీ, శనినీ, శుక్రుణ్ణీ నమ్మేదెవరూ? మెదడు గుడ్డిదైనవాళ్లు తప్ప? అందుకే ఎవరో సరిగానే చెప్పారు. "పురుషులు పురుషుల కోసం ఏర్పరుచుకున్నవే ఈ మతాలన్నీ" అని! ఈ మధ్య మహిళా ప్రవచనకారిణులు కూడా పెరిగిపోయారు. అలాంటావిడ ఇలా చెప్పింది. భర్త-భార్యను 'ఒసేయ్!' అని పిలవడంలో ఎంతో గౌరవ ముందట. ఒసేయ్- అంటే ఇంటి యజమానురాలా అని అర్థమట. అలాగైతే ఈ వీధిలో పొయ్యేవాళ్లంతా ఈ విషయం చెప్పినావిడని ఒసేయ్! అని పిలుచుకుంటూ పోతేసరి! ఆమెకు బోలెడంత గౌరవం దక్కుతుంది కదా? మెదళ్లు గుడ్డివైపోయిన మత విశ్వాసకులు మనస్తత్వాన్ని ఎత్తిచూపే సంఘటనలు ఎన్నో జరుగుతుంటాయి. అయితే, న్యూయార్క్‌లో జరిగిన ఒక సంఘటన ఇలా ఉంది. 1820లో ఉత్తర న్యూయార్క్‌లోని ఒక సరస్సు పక్కన ఒక మత బోధకురాలు ఉండేది. ఆమెకు అసంఖ్యాకంగా అనుచరగణం ఉండేది. ఆమె మీద వారికి ఎంతో విశ్వాసం. ఒకసారి ఆమె నీటిమీద నడుస్తానని ప్రకటించింది. నడవబోయే రోజూ, సమయం కూడా ప్రకటించింది. అంతే! ఆ రోజుకు, ఆ సమయానికి లెక్కలేనంతమంది ఆ సరస్సు చుట్టూ చేరారు. ప్రకటించిన సమయానికి ఆ మత ప్రచారకురాలు అక్కడికి వచ్చింది. అనుచరుల్ని సంతృప్తిగా చూసుకుంది. నవ్వుతూ నాలుగువైపులా చెయ్యి ఊపింది. అనుచరగణం ఉత్సాహంగా కేకలేసింది. మత ప్రచారకురాలు అక్కడి జనాన్ని ఉద్దేశించి బిగ్గరగా ఇలా అడిగింది. "నేను ఈ సరస్సులోని నీటి మీద నడుస్తానని మీరు నమ్ముతున్నారా" అని అంది. అనుచరులంతా ఏకకంఠంతో 'అవునూ అవునూ' అని అరిచారు. ఉత్సాహంగా చప్పట్లు చరిచారు. "అయితే సరే- మీకు ఆ నమ్మకం ఉండడమే ముఖ్యం! మీకు అంత నమ్మకం ఉన్నప్పుడు ఇక నేను నడవకపోయినా ఫరవాలేదు." అని మత ప్రచారకురాలు వెనక్కి తిరిగి వెళ్లిపోయింది. అనుచరులు కూడా నిరుత్సాహంగా వెళ్లిపోయారు. ఈ సంఘటనవల్ల మనకేం తెలుస్తోంది? విశ్వాసాన్ని బలపరుచుకోవడానికే మత ప్రచారకులు ప్రాధాన్యమిస్తారు. తప్పించి, చెప్పింది చేసి చూపలేరు. ఒక నిజ నిర్ధారణకు, నిలదీయనివారే మత విశ్వాసకులవుతారు! పైగా తమకు తాము భక్తులమని మురిసిపోతుంటారు. మెదడు గుడ్డిదైనప్పుడు ఇక అంతే!!

- సుప్రసిద్ధ సాహితీవేత్త, జీవశాస్త్రవేత్త

విరాళాలు లేకుండా పార్టీని నడపలేం

ఎన్నికల బాండ్లపై గడ్కరీ వ్యాఖ్యలు

అహ్మదాబాద్: లోక్‌సభ ఎన్నికల ముందు ఎన్నికల బాండ్ల వ్యవహారం తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ పథకాన్ని సుప్రీంకోర్టు రద్దు చేయడంతో కేంద్రంపై విపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తాజాగా దీనిపై స్పందించారు. మంచి ఉద్దేశంతోనే ఎన్నికల బాండ్ల పథకాన్ని కేంద్రం ప్రవేశపెట్టిందని తెలిపారు. విరాళాలు లేకుండా ఏ రాజకీయ పార్టీని నడపడం సాధ్యం కాదని అభిప్రాయపడ్డారు. గుజరాత్‌లోని గాంధీనగర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో గడ్కరీ మాట్లాడుతూ ఎన్నికల బాండ్ల అంశాన్ని ప్రస్తావించారు. అరుణ్ జైట్లీ ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడు ఈ పథకం గురించి జరిగిన చర్చల్లో తాను కూడా పాల్గొన్నానని, ఆర్థిక వనరులు లేకుండా ఏ పార్టీ మనుగడ సాధించలేదన్నారు. కొన్ని దేశాల్లో రాజకీయ పార్టీలకు ప్రభుత్వమే నిధులు సమకూరుస్తుందని, మన దగ్గర అలాంటి వ్యవస్థ లేదని, అందుకే కేంద్రం ఈ పథకం తీసుకొచ్చిందని వివరించారు. పార్టీలు నేరుగా నిధులు పొందడమే దీని ఉద్దేశమన్నారు. అయితే, అధికారంలో ఉన్న పార్టీ మారితే సమస్యలు తలెత్తుతాయన్న కారణంతో దాతల పేర్లను బయటపెట్టలేదని గడ్కరీ వెల్లడించారు. క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకోవాలని, నిధుల్లేకుండా పార్టీలు ఎన్నికల్లో ఎలా పోరాడుతాయని ఆయన ప్రశ్నించారు. విరాళాల్లో పారదర్శకత ఉండాలన్న మంచి ఉద్దేశంతోనే తాము ఈ బాండ్ల పథకాన్ని ప్రవేశపెట్టామన్నారు.

కేజ్రీవాల్‌కు శిక్ష పడేలా చేస్తా

సుకేశ్ చంద్రశేఖర్ ప్రకటన

న్యూఢిల్లీ: మనీలాండరింగ్ కేసులో ప్రధాన నిందితుడు సుకేశ్ చంద్రశేఖర్ ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌పై విరుచుకుపడ్డారు. కేజ్రీవాల్‌ను తీహార్ జైలుకు స్వాగతిస్తున్నానని, తాను అప్రూవర్‌గా మారి ఆయనకు శిక్ష పడేలా చేస్తానని వ్యాఖ్యానించారు. అరవింద్ కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్టు చేయడం, ఆయనను ఆరు రోజుల ఈడీ కస్టడీకి కోర్టు అనుమతించడం తెలిసిందే. ఈ క్రమంలో సుకేశ్ చంద్రశేఖర్ చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. 'నిజం గెలిచింది. నేను ఆయనను తీహార్ జైలుకు స్వాగతిస్తున్నాను. కేజ్రీవాల్‌కు, ఆయన బృందానికి వ్యతిరేకంగా సాక్షిగా మారతాను. కేజ్రీవాల్‌కు శిక్ష పడేలా చూస్తాను' అని చంద్రశేఖర్ అన్నారు. కేజ్రీవాల్ అవినీతికి రాజుగా మారారని సుకేశ్ ఆరోపించారు. వేల కోట్ల రూపాయలు దోచుకున్నారని మండిపడ్డారు. ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసులో కేజ్రీవాల్‌కు రక్షణ కల్పించవద్దని కోరారు. కాగా, ఆమ్ ఆద్మీ పార్టీ అగ్రనేతలకు బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత రూ.100 కోట్లు చెల్లించారని ఈడీ ఆరోపించింది. ఈ క్రమంలో లేఖ రాసిన సుకేశ్.. 'సత్యం గెలిచింది - రాజకీయ మంత్రగత్తె వేటకు తెరపడింది, మీ కర్మలన్నీ మీకు తిరిగి వస్తున్నాయి. చట్టం గతంలో కంటే ఇప్పుడు కఠినంగా మారింది' అని చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో కాక పుట్టించాయి. మోసం చేసి దోపిడీకి పాల్పడ్డారనే ఆరోపణలతో సుకేశ్ చంద్రశేఖర్‌ను ఈడీ అరెస్టు చేసింది.

ప్రజాస్వామ్యం ఖూనీ: గెహ్లాత్

జైపూర్: మద్యం కేసులో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్టు చేయడంపై రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాత్ స్పందించారు. కేంద్ర ప్రభుత్వాన్ని, ఈడీ దర్యాప్తు సంస్థను విమర్శించారు. మోదీ పాలనలో దేశంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గెహ్లాత్ శనివారం విలేకరులతో మాట్లాడుతూ 'ఎలాంటి రుజువు లేకుండానే కేజ్రీవాల్‌పై దర్యాప్తు సంస్థ చర్యలు తీసుకుంది. సిట్టింగ్ సీఎంను అరెస్టు చేసిన తీరు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే. ఈ వ్యక్తులు ప్రజలచే ఎన్నుకోబడ్డారు. వారేమన్నా హత్య చేశారా లేదా తీవ్రమైన నేరానికి పాల్పడ్డారా లేదా వారెక్కడికైనా పారిపోయారా... వారేమన్నా ప్రజలను ప్రభావితం చేస్తున్నారా?' అని పశ్నించారు. ఎలాంటి రుజువు లేకుండా, పూర్తిగా ఒకరి వాంగ్మూలం ఆధారంగా ఈడీ అధికారులు చర్యలు తీసుకున్నారని గెహ్లాత్ విమర్శించారు. అయితే కేజ్రీవాల్ అరెస్టుతో ఆ రాష్ట్రంలో ఇప్పుడు ఎన్నికలు జరుగుతాయా లేదా అని ప్రజలు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారని అన్నారు.

73 మంది అభ్యర్థులపై అనర్హత వేటు

రాయపూర్: ఎన్నికల వేళ ఛత్తీస్‌గఢ్ రాజకీయాల్లో సంచలనం చోటుచేసుకుంది. ఎన్నికల నిబంధనలు పట్టించుకోని 73 మంది అభ్యర్థులపై భారత ఎన్నికల సంఘం అనర్హత వేటు వేసింది. ఛత్తీస్‌గఢ్‌లో మూడు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. తొలి విడత ఎన్నికలకు నామినేషన్ల దాఖలు ప్రక్రియ ప్రారంభమైంది. వీటిని పరిశీలించాక సంబంధిత అధికారులు అనర్హుల జాబితాను విడుదల చేశారు. జిల్లా డిప్యూటీ ఎన్నికల అధికారి యుఎస్ బాండే మాట్లాడుతూ రాయపూర్ జిల్లా నుంచి గరిష్ఠంగా 17 మంది అభ్యర్థులను అనర్హులుగా ప్రకటించామన్నారు. ఈ అనర్హుల జాబితాను భారత ఎన్నికల సంఘం వెబ్ సైట్‌లో అప్‌లోడ్ చేసిందని చెప్పారు. ఖర్చు వివరాలు తెలియజేయని లేదా ఇతర నిబంధనలు పాటించని ఈ అభ్యర్థులు రాబోయే ఎన్నికల్లో పోటీ చేయడానికి అవకాశం లేదంటూ తన వెబ్‌సైట్‌లో జాబితాను వెల్లడించింది. అనర్హతకు గురైన 73 మందిలో 65 మంది అభ్యర్థులు 2024 వరకు, ఎనిమిదిమంది అభ్యర్థులు 2025 వరకు ఎన్నికల్లో పోటీ చేయలేరు. ఇదిలాఉండగా ఛత్తీస్‌గఢ్‌లో 11 స్థానాలకు మూడు దశల్లో పోలింగ్ నిర్వహించనున్నారు. ఏప్రిల్ 19న ఒక స్థానానికి, 26న మూడు స్థానాలకు, మే 7న ఏడు స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. జూన్ నాలుగున ఫలితాలు వెల్లడవుతాయి.

మహువా మొయిత్రా నివాసంలో సీబీఐ సోదాలు

కోల్‌కతా: పార్లమెంట్‌లో ప్రశ్నలు అడిగేందుకు డబ్బులు తీసుకున్నారంటూ తృణమూల్ కాంగ్రెస్ మాజీ ఎంపీ మహువా మొయిత్రాపై వచ్చిన ఆరోపణలపై సీబీఐ దర్యాప్తు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగానే దర్యాప్తు అధికారులు శనివారం సోదాలు చేపట్టారు. పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని మహువా నివాసంతో పాటు ఇతర నగరాల్లో ఆమెకు చెందిన కార్యాలయాల్లో తనిఖీలు జరిగాయి. ఈ కేసులో బీజేపీ ఎంపీ నిషికాంత్ దుబే ఫిర్యాదు మేరకు మహువాపై దర్యాప్తు చేపట్టాలని సీబీఐని లోక్‌పాల్ ఆదేశించింది. ఆరువారాల్లోగా నివేదిక సమర్పించాలని సూచించింది. దీంతో గురువారం ఎఫ్ఐఆర్ నమోదు చేసిన కేంద్ర దర్యాప్తు సంస్థ సోదాలు చేపట్టింది. అదానీ గ్రూప్‌ను, ప్రధాని మోదీని లక్ష్యంగా చేసుకునేలా ప్రశ్నలు అడిగేందుకు ప్రముఖ వ్యాపారవేత్త దర్శన్ హీరానందానీ నుంచి మహువా రూ.2 కోట్లతోపాటు ఖరీదైన బహుమతులు తీసుకున్నారని ఎంపీ నిషికాంత్ దుబే ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపిన లోక్‌సభ నైతిక విలువల కమిటీ... ఆమె అనైతిక ప్రవర్తనకు, సభా ధిక్కరణకు పాల్పడ్డారని తేల్చింది. ఈ నివేదిక ఆధారంగా గతేడాది డిసెంబరులో స్పీకర్ బహిష్కరణ వేటు వేయడంతో ఆమె లోక్‌సభ సభ్యత్వం రద్దయింది. దీన్ని మహువా తీవ్రంగా ఖండించారు. బహిష్కరణ వేటుపై సుప్రీంకోర్టును ఆశ్రయించారు. మరోవైపు, ఇదే వ్యవహారానికి సంబంధించిన విదేశీ మారక ద్రవ్య నిర్వహణ చట్టం నిబంధనల ఉల్లంఘన కేసులో ఈడీ ఆమెకు సమన్లు జారీ చేసింది.

పోలీసు అధికారి దురుసుగా ప్రవర్తించారు

కేజ్రీవాల్ ఆరోపణ

న్యూఢిల్లీ: ఢిల్లీ పోలీసు అధికారి ఒకరు తనతో దురుసుగా ప్రవర్తించారని ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. గతంలో తమ నేత మనీశ్ సిసోడియాను బలవంతంగా లాక్కెళ్లింది కూడా ఆయనేనని వెల్లడించారు. రౌస్‌అవెన్యూ కోర్టులో సమర్పించిన దరఖాస్తులో ఈ మేరకు కేజ్రీవాల్ ఫిర్యాదు చేశారు. తన భద్రతా వలయంలోని సిబ్బంది నుంచి ఆయనను తొలగించాలని కోరారు. ఈడీ సిబ్బంది తనతో మర్యాదగానే ప్రవర్తించారని వెల్లడించారు. ఈడీ వేసిన రిమాండ్ పిటిషన్ విచారణలో భాగంగా శుక్రవారం కేజ్రీవాల్‌ను రౌస్‌అవెన్యూ కోర్టుకు తీసుకువచ్చారు. ఆ సమయంలో అసిస్టెంట్ కమిషనర్ ఏకే సింగ్ తనతో దురుసుగా ప్రవర్తించారని సీఎం వెల్లడించారు. గతంలోనూ ఆ అధికారిపై ఇలాంటి ఆరోపణలే వచ్చాయి. అప్పట్లో వాదనల అనంతరం కోర్టు గది నుంచి సిసోడియాను బయటకు తీసుకువస్తుండగా మీడియా ఆయనను చుట్టుముట్టింది. అప్పుడు సింగ్ విలేకర్ల ఫోన్లు తోసేశారు. రౌస్ అవెన్యూ కోర్టులో సిసోడియాతో ఓ పోలీసు దురుసుగా ప్రవర్తించారని, ఆయనను వెంటనే సస్పెండ్ చేయాలని ఢిల్లీ మంత్రి అతిశీ డిమాండ్ చేశారు.

ఆప్ ఎమ్మెల్యే గులాబ్ సింగ్ ఇంట్లో సోదాలు

కేజ్రీవాల్ అరెస్టు వేళ.. ఆప్ ఎమ్మెల్యే గులాబ్ సింగ్‌కు చెందిన ప్రాంగణాల్లో ఐటీ అధికారులు సోదాలు చేపట్టారు. ఈ మేరకు పార్టీ వర్గాలు వెల్లడించాయి. దీనిపై ఢిల్లీ మంత్రి సౌరభ్ భరద్వాజ్ స్పందించారు. ప్రతిపక్ష నేతలందరినీ జైల్లో పెట్టడంలో బీజేపీ బిజీగా ఉన్నట్లు ఈ దేశంతో పాటు ప్రపంచంలో ఉన్న ప్రజలందరికీ తెలుసని విమర్శించారు.

ఇది మా అంతర్గత వ్యవహారం

జర్మనీ ప్రకటనపై కేంద్రం మండిపాటు

న్యూఢిల్లీ: మద్యం విధానానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్టు చేయడంపై జర్మనీ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రకటన దుమారం రేపింది. కేజ్రీవాల్ విచారణ పారదర్శకంగా జరగాలని జర్మనీ పేర్కొంది. దీనిపై భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఢిల్లీలోని జర్మనీ రాయబారిని కేంద్ర విదేశాంగ శాఖ పిలిచి నిలదీసింది. కేజ్రీవాల్ అరెస్టుపై జర్మనీ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి శుక్రవారం ఓ అధికారిక ప్రకటన విడుదల చేశారు. భారత్ ప్రజాస్వామ్య దేశమని, ఆరోపణలు ఎదుర్కొంటున్న కేజ్రీవాల్ న్యాయపరమైన, నిష్పాక్షికమైన విచారణకు అర్హులని తెలిపారు. అందుబాటులో ఉన్న చట్టపరమైన మార్గాలను ఎలాంటి పరిమితులు లేకుండా ఆయన వినియోగించుకోవచ్చని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

జర్మనీ స్పందనపై కేంద్రం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఢిల్లీలోని ఆ దేశ రాయబారికి సమన్లు పంపింది. దీంతో శనివారం ఉదయం జర్మనీ ఎంబసీ డిప్యూటీ హెడ్ జార్జ్ ఎంజ్‌వీలర్ కేంద్ర విదేశాంగ శాఖ కార్యాలయానికి వచ్చారు. ఆయన వద్ద భారత్ తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. ఇది తమ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడమేనని మండిపడింది.

'ఇండియా'కు ప్రజలే మిత్రపక్షం



- ఎన్నికలకు ముందే మా కూటమి ఊపందుకుంది
- బీజేపీ ఎన్నికల బాండ్ల పేరుతో భారీ దోపిడీకి పాల్పడింది
- ఎన్నికల తర్వాత మమతా బెనర్జీ 'గేమ్ ఛేంజర్' అవుతారు
- టీఎంసీ నాయకుడు, ఎంపీ శతృఘ్న సిన్హా

కోల్‌కతా : ఎన్నికల బాండ్ల పేరుతో బీజేపీ భారీ కుంభకోణానికి పాల్పడిందని, బ్లాక్‌మెయిల్ చేసి దోపిడీ చేసిందని టీఎంసీ నాయకుడు, ఎంపీ శతృఘ్న సిన్హా విమర్శించారు. లోక్‌సభ ఎన్నికలకు ముందే 'ఇండియా' కూటమి ఊపందుకుందని, దానికి ప్రజలే అతిపెద్ద మిత్రపక్షమని అన్నారు. పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ 'ఇండియా' కూటమిని 'ఫిల్టర్ కాఫీ' లాంటిదిగా అభివర్ణించారు. కాంగ్రెస్ పార్టీ పునరాగమనాన్ని తోసిపుచ్చలేమని, అయితే సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత టీఎంసీ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఒక 'గేమ్ ఛేంజర్' అవుతారని అసన్‌సోల్ ఎంపీ అయిన సిన్హా నొక్కి చెప్పారు. దేశవ్యాప్తంగా 'క్రాంతికారి (విప్లవ) యాత్రలు' నిర్వహిస్తున్నందుకు కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీని ప్రశంసించారు. ఎన్నికల బాండ్లు అనేది బీజేపీకి చెందిన ఒక భారీ కుంభకోణం, దోపిడీ రాకెట్ అని నటనా రంగం నుంచి రాజకీయ నాయకుడిగా మారిన శతృఘ్న సిన్హా అన్నారు. 'ఎన్నికల బాండ్ల రూపంలో కాషాయ శిబిరం దోపిడీ, బ్లాక్‌మెయిల్ రాకెట్‌ను బహిర్గతం చేయడానికి ప్రతిపక్ష పార్టీలకు ఏడు దశల ఎన్నికలు ఒక వరం' అని అన్నారు. 'ఈ ఎన్నికల్లో బీజేపీ ఓడిపోతుంది. ఎన్‌డీఏకు సీబీఐ, ఈడీ, ఇన్‌కమ్ ట్యాక్స్‌ల మద్దతు ఉంటే. 'ఇండియా' కూటమికి బహుజనుల మద్దతు ఉంది. 'ఇండియా'కు భాగస్వాములు లేరని చాలా మంది అనుకుంటారు. కానీ వాస్తవం ఏమిటంటే ప్రజలు దాని అతిపెద్ద మిత్రపక్షం. దేశంలోని వివిధ ప్రాంతాల్లో ప్రతిపక్ష కూటమి ఊపందుకుంది' అని తెలిపారు. సమాజ్‌వాదీ పార్టీకి చెందిన అఖిలేశ్ యాదవ్, ఆర్‌జేడీకి చెందిన తేజస్వి యాదవ్, అనేక మంది కూటమిలో భాగమైన 'ఘనమైన నాయకులు'తో ఇండియా కూటమి 'ఫిల్టర్ కాఫీ' లాంటిదని పేర్కొన్నారు. 'దేశవ్యాప్తంగా చాలా మంది ముఖ్యమైన 'ఇండియా' కూటమిలో భాగమయ్యారు. అందుకే నేను దీనిని ఫిల్టర్ కాఫీ అని పిలుస్తాను. ఎన్నికల తర్వాత ఇతర ప్రతిపక్ష నాయకులు కూడా ఇందులో చేరినప్పుడు ఈ ఫిల్టర్ కాఫీ చాలా రుచిగా ఉంటుంది' అని ఆయన అన్నారు. కాగా, ప్రతిపక్ష కూటమికి కాంగ్రెస్ నాయకత్వం వహించడంపై ఆప్, టీఎంసీ వంటి పార్టీల విముఖత గురించి అడిగిన ప్రశ్నకు సిన్హా సమాధానమిస్తూ, 'కాంగ్రెస్ ఒక జాతీయ పార్టీ, దానిని తోసిపుచ్చకూడదు. దానికి పునరాగమనం చేసిన చరిత్ర, ట్రాక్ రికార్డ్ ఉంది. 2019లో కూడా ప్రతిపక్ష పార్టీలలో అత్యధిక సీట్ల వాటాను సాధించింది' అని తెలిపారు. ఆప్, టీఎంసీ జాతీయ స్థాయిలో ప్రతిపక్ష కూటమిలో భాగమైనప్పటికీ పంజాబ్, బెంగాల్ వంటి రాష్ట్రాల్లో 'ఇండియా' కూటమి పట్టు సాధించకపోవడంపై సిన్హా మాట్లాడుతూ కొన్ని రాష్ట్రాల్లో క్షేత్ర స్థాయిలో పొత్తులు సాధ్యం కావు, ఎందుకంటే ఇది విపక్షాల స్థలం బీజేపీకి వెళుతోంది. బహుశా అధికారిక పొత్తు లేకపోవచ్చు. కానీ మమతా బెనర్జీ వంటి 'ఇండియా' కూటమి నాయకులు బెంగాల్‌లో ఎన్నికల్లో స్వీప్ చేస్తారు' అని తెలిపారు. అయితే 'రాష్ట్రాలలో ప్రతిపక్ష కూటమిలో భాగం కాకపోవడం అంటే ఎన్నికల తర్వాత కలిసి రారని కాదు. ఇప్పుడు 'ఇండియా' కూటమిలో లేని వారు లేదా విడివిడిగా పోరాడుతున్న వారు ఎన్నికల తర్వాత ప్రతిపక్ష కూటమిలో చేరరని అర్థం కాదు. ఎన్నికల తర్వాత బీజేపీని గద్దె దించేందుకు ప్రతిపక్షాలు కలిసి వస్తాయి' అని అన్నారు. స్వతంత్రంగా 370 సీట్లు సాధించడంతో పాటు ఎన్‌డీఏ 400 సీట్లను అధిగమిస్తుందని బీజేపీ చెప్పడంపై సిన్హా స్పందిస్తూ, 'ఇలాంటి వాదనలు కాషాయ పార్టీ శిబిరంలో నిరాశను ప్రతిబింబిస్తున్నాయి' అని ఎద్దేవా చేశారు. 'బీజేపీ అవకతవకల ద్వారా మాత్రమే ఈ సంఖ్యను సాధించగలదు. వారు కర్నాటక, మధ్య ప్రదేశ్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినట్లు వారు ఏదో ఒకదానిని నిర్వహించగలరు లేదా వారు 150-175 స్థానాలను చేరుకోలేరు' అని ఆయన అన్నారు. గత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 303 సీట్లు గెలుచుకున్న విషయం తెలిసిందే. 'ఎన్నికల బాండ్ అనేది ఒక పెద్ద కుంభకోణం. దాడులు, అరెస్టుల ద్వారా బెదిరించి డబ్బు వసూలు చేయడానికి సీబీఐ, ఈడీని ఉపయోగించి బీజేపీ చేస్తున్న దోపిడీ రాకెట్... విరాళాల పేరుతో వ్యాపారం ఇప్పుడు బహిరంగంగా ఉంది' అని తెలిపారు. ఎన్నికల బాండ్ల ద్వారా టీఎంసీతో సహా ప్రతిపక్ష పార్టీలు నిధులు పొందడం గురించి అడిగిన ప్రశ్నకు 'మీరు రెండింటినీ పోల్చలేరు. అది కాంగ్రెస్, టీఎంసీ లేదా మరే ఇతర ప్రతిపక్ష పార్టీ అయినా, వారు వ్యవస్థ కింద డబ్బు పొందారు. కానీ కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేయలేదు' అని అన్నారు. 'దాదాపు రెండున్నర నెలల పాటు ఏడు దశల ఎన్నికలు జరగడం వల్ల బీజేపీ ఎన్నికల బాండ్ల కుంభకోణాన్ని ప్రజల ముందు బహిర్గతం చేయడానికి ప్రతిపక్ష పార్టీలకు ఇది అవకాశం ఇస్తుంది' అని తెలిపారు. దేశం మొత్తం మీదుగా రెండు యాత్రలు చేసినందుకు రాహుల్ గాంధీని సిన్హా కొనియాడారు. 'రాహుల్ గాంధీ సమర్థుడైన నాయకుడు. అయితే అదే సమయంలో ఎన్నికల తర్వాత ప్రభుత్వ ఏర్పాటు విషయంలో మా పార్టీ అధిష్ఠానం గేమ్ ఛేంజర్‌గా ఉంటుందని నేను నమ్ముతున్నాను. అయితే ఎవరు ప్రధాన మంత్రి అవతారనేది ఎన్నికల తర్వాత ప్రతిపక్ష పార్టీలు నిర్ణయం తీసుకుంటాయి' అని చెప్పారు. సిన్హా 80వ దశకం ప్రారంభంలో బీజేపీలో చేరారు. అటల్ బిహారీ వాజ్‌పేయి-ఎల్‌కె అద్వానీ కాలంలో కాషాయ పార్టీ శిబిరానికి స్టార్ క్యాంపెయినర్‌గా పని చేశారు. పాట్నా సాహిబ్ నుంచి రెండు సార్లు బీజేపీ ఎంపీ అయిన తరువాత ప్రస్తుత నాయకత్వంతో విభేదాల కారణంగా పార్టీ నుంచి వైదొలిగి, 2019 లోక్‌సభ ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లో చేరారు. 1970, 1980లలోని బాలీవుడ్ నటుడు 2022లో టీఎంసీ లోకి మారారు. పశ్చిమ బెంగాల్‌లోని పారిశ్రామిక పట్టణమైన అసన్‌సోల్ నుంచి ఉపఎన్నికలను విజయవంతంగా ఎదుర్కొన్నారు. అసన్‌సోల్ స్థానం నుంచి రెండవ సారి తిరిగి ఎన్నికయిన సిన్హా, 2022 ఉప ఎన్నిక కంటే ఎక్కువ తేడాతో సీటును నిలుపుకోగలమన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

రైతుల ఆదాయం రెండింతలు పెరగలేదు

- పాలకులు పట్టించుకోవడం లేదు
- ఎన్‌సీపీ (ఎస్‌పీ) నేత శరద్ పవార్

పూణే : అధికారంలో ఉన్న వారు దేశంలోని రైతులను పట్టించుకోవడం లేదని, 2024 నాటికి వారి ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ఎన్‌సీపీ (ఎస్‌పీ) అధ్యక్షుడు శరద్ పవార్ శనివారం విమర్శించారు. మహా వికాస్ అఘాడి (ఎంవీఏ) నాయకులు సంజయ్ రౌత్, బాలాసాహెబ్ థోరట్, సుప్రియా సూలే సమక్షంలో మహారాష్ట్రలోని పూణే జిల్లాలోని ఇందాపూర్‌లో జరిగిన రైతుల ర్యాలీలో ప్రముఖ రాజకీయ నాయకుడు ప్రసంగించారు. ఎంవీఏలో కాంగ్రెస్, ఎన్‌సీపీ (ఎస్‌సీపి), ఉద్ధవ్ థాకరే నేతృత్వంలోని శివసేన (యూబీటీ) ఉన్నాయి. ఇది ప్రతిపక్ష 'ఇండియా' కూటమిలో భాగం. 'దేశంలో ఇప్పుడు పరిస్థితి భిన్నంగా ఉంది. రానున్న (లోక్‌సభ) ఎన్నికలు చాలా ముఖ్యమైనవి. 2024 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని ప్రధాని హామీ ఇచ్చారు. కానీ అది జరలేదు' అని అన్నారు. 48 మంది ఎంపీలను ఎన్నుకునే మహారాష్ట్ర లోక్‌సభ ఎన్నికలు ఏప్రిల్ 19 నుంచి మే 20 మధ్య ఐదు దశల్లో జరగనున్నాయి. బారామతి లోక్‌సభ నియోజకవర్గంలో భాగమైన ఇందాపూర్‌లో జరిగిన ఈ సభలో పవార్ మాట్లాడుతూ 'దేశంలోని రైతులు ఉల్లిపై ఉపశమనం కల్పించాలని డిమాండ్ చేశారు. కానీ అధికారంలో ఉన్న వారు రైతులను పట్టించుకోవడం లేదు' అని విమర్శించారు. పవార్ కుమార్తె, మూడుసార్లు ఎంపీగా ఎన్నికయిన సుప్రియా సూలే బారామతి నుంచి పోటీ చేయనున్నారు. 2022లో మనీలాండరింగ్ కేసులో రాజ్యసభ ఎంపీని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అరెస్టు చేసిన విషయాన్ని ప్రస్తావిస్తూ, ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడిన తర్వాత సేన (యూబీటీ) నాయకుడు సంజయ్ రౌత్‌ను జైలులో పెట్టారని ఈ కేంద్ర వ్యవసాయ శాఖ మాజీ మంత్రి అన్నారు. 'అతను ఎంత కష్టపడినా, అరవింద్ కేజ్రీవాల్‌ను జైలుకు పంపించారు. గత ఎన్నికల్లో బీజేపీ కేవలం 2 శాతం సీట్లు మాత్రమే గెలుచుకుంది. మిగిలినవి కేజ్రీవాల్ (ఆప్)కు అనుకూలంగా ఉన్నాయి' అని ఆయన అన్నారు. ఈ ర్యాలీలో సంజయ్ రౌత్ మాట్లాడుతూ బీజేపీ నేతృత్వంలోని కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాన్ని కూడా లక్ష్యంగా చేసుకున్నారు. 'మీ 'అచ్ఛే దిన్' మాకు వద్దు. 2014కి ముందు ఉన్న రోజులను మాకు ఇవ్వండి. అజిత్ పవార్ వారి కూటమిలో చేరిన తర్వాత మాపై ఎలాంటి ప్రభావం లేదు. ఏక్‌నాథ్ షిండే మమ్మల్ని విడిచిపెట్టిన తర్వాత మా పార్టీ మరింత బలపడింది. మమ్మల్ని విడిచిపెట్టిన వారి తర్వాత మహారాష్ట్రలో తేడా కనిపించలేదు' అని అన్నారు. 'మమ్మల్ని బెదిరించకండి. మేము దేనికీ భయపడబోము. మరో నాలుగు నెలల్లో దేశంలో ప్రభుత్వ మార్పును చూస్తాం. మా ప్రభుత్వం ఏర్పాటయ్యాక మీ పార్టీలో ఎవరూ మిగలరు' అని రౌత్ తెలిపారు.

ఎన్నికల బాండ్లపై సుప్రీంతో విచారణ

కాంగ్రెస్ డిమాండ్

న్యూఢిల్లీ : ఎన్నికల బాండ్ల అంశంపై కాంగ్రెస్ పార్టీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని తీవ్ర స్థాయిలో దుయ్యబట్టింది. ఈ 'అపారదర్శక పథకం' ప్రీపెయిడ్, పోస్ట్‌పెయిడ్, పోస్ట్-రైడ్ లంచాలను కూడా బ్యాంకింగ్ ఛానెల్ ద్వారా మళ్లించవచ్చని నిర్ధారిస్తుందని ఆరోపించింది. ఈ అంశంపై సుప్రీం కోర్టు పర్యవేక్షణలో విచారణ జరగాలని ప్రతిపక్ష పార్టీ తన డిమాండ్‌ను పునరుద్ఘాటించింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 'నల్లధనాన్ని వెనక్కి తీసుకువస్తామని' హామీ ఇచ్చి, అవినీతిని చట్టబద్ధం చేసి, దాచేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్న ప్రధాని ఈయనే' అని విమర్శించారు. ప్రతిపక్ష పార్టీ 'పైథాన్ కోడ్'ను విడుదల చేసింది. దీని కారణంగా దాతలను రాజకీయ పార్టీలతో సరిపోల్చడానికి 15 సెకన్ల కంటే తక్కువ సమయం పట్టిందని పేర్కొన్నారు. సుప్రీం కోర్టు అడిగిన వివరాలు అందించడానికి నెలల సమయం పడుతుందన్న ఎస్‌బీఐ హాస్యాస్పదమైన వాదనను ఇది బహిర్గతం చేసిందన్నారు. ఎన్నికల బాండ్ల కుంభకోణంలో 'భారీ అవినీతి'కి సంబంధించిన నాలుగు నమూనాలను కాంగ్రెస్ ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ, 'చందా దో, ధందా లో అంటే ప్రీపెయిడ్ లంచం, 'ఠేకా లో, రిష్వత్ దో అంటే పోస్ట్‌పెయిడ్ లంచం, హఫ్తా వసూలీ అంటే దోపిడీ, పోస్ట్-రైడ్ లంచం ఫర్జీ కంపెనీ అంటే షెల్ కంపెనీలు' అని జైరాం రమేశ్ తెలిపారు. కేంద్ర లేదా బీజేపీ రాష్ట్ర ప్రభుత్వాల నుంచి 179 మేజర్ కాంట్రాక్టులు, ప్రాజెక్టుల అనుమతులు పొందిన 38 కార్పొరేట్ గ్రూపులు ఎన్నికల బాండ్లను విరాళంగా ఇచ్చాయని కోడ్‌ను ఉపయోగించి విశ్లేషణలు వెలుగులోకి తెచ్చాయని ఆయన అన్నారు. ఈ కంపెనీలు మొత్తం రూ.3.8 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులు, కాంట్రాక్టులు పొందాయని, దానికి బదులుగా రూ.2,004 కోట్ల ఎన్నికల బాండ్ల విరాళాలను బీజేపీకి ఇచ్చారని జైరాం రమేశ్ చెప్పారు. 'ఇండియా' కూటమి అధికారంలోకి రాగానే ఎన్నికల బాండ్ల కుంభకోణంపై సిట్‌తో విచారణ జరిపిస్తామని ఆయన చెప్పారు.

ఇండియా కూటమి అధికారంలోకి వస్తే, అదానీ అంశంపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) ఏర్పాటు చేస్తామని, అలాగే, పీఎం-కేర్స్ నిధిపై కూడా సిట్ వేస్తామని తెలిపారు. 41 కార్పొరేట్ గ్రూపులు మొత్తం 56 ఈడీ/సీబీఐ/ఐటీ దాడులను ఎదుర్కొన్నాయని, బీజేపీకి రూ.2,592 కోట్లు ఇచ్చారని, అందులో రూ.1,853 కోట్లు దాడుల తర్వాత ఇచ్చారని జైరాం రమేశ్ ఆరోపించారు.

బీజేపీ గూటికి అనర్హులైన ఎమ్మెల్యేలు

సిమ్లా: హిమాచల్ ప్రదేశ్‌లో రాజకీయ సంక్షోభం వేళ మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. అనర్హత వేటు పడిన ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీజేపీలో చేరారు. కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్, ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి జైరాం ఠాకూర్ నేతృత్వంలో శనివారం పార్టీ కండువా కప్పుకొన్నారు. త్వరలో జరిగే ఉపఎన్నికల్లో వారు కమలం గుర్తుపై పోటీ చేయనున్నట్లు తెలుస్తోంది. హిమాచల్‌ప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ తన హామీల అమల్లో విఫలమైందని అనురాగ్ ఠాకూర్ విమర్శించారు. కాంగ్రెస్ సర్కారుపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. ఇటీవల రాజ్యసభ ఎన్నికల్లో ఆ పార్టీ నేతలు బీజేపీకి అనుకూలంగా ఓటేయడం ప్రజల్లో ఆగ్రహానికి నిదర్శమని చెప్పారు. బీజేపీలో చేరిన వారిలో సుధీర్ శర్మ, రవి ఠాకూర్, రాజేందర్ రాణా, ఇందర్ దత్ లఖన్‌పాల్, చైతన్య శర్మ, దేవీందర్ కుమార్ భుట్టో ఉన్నారు. గత నెల జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో వారంతా పార్టీ విప్‌ను ధిక్కరించి బీజేపీకి అనుకూలంగా ఓటు వేశారు. దీంతో ఫిబ్రవరి 29న వీరిపై స్పీకర్ అనర్హత వేటు వేశారు. వారితో పాటు మరో ముగ్గురు స్వతంత్ర ఎమ్మెల్యేలు సైతం తమ పదవులకు రాజీనామా చేశారు. వారు కూడా త్వరలో బీజేపీలో చేరనున్నట్లు తెలుస్తోంది.

మోదీకి ఎన్నికల భయం...

- అందుకే ప్రతిపక్ష నేతలను జైళ్లలో పెడుతున్నారు
- శివసేన (యూబీటీ)

ముంబై : వచ్చే లోక్‌సభ ఎన్నికలను ఎదుర్కోవాలనే భయంతోనే ప్రధాని నరేంద్ర మోదీ దేశంలోని ప్రతిపక్ష నేతలను జైళ్లలో పెడుతున్నారని శివసేన (యూబీటీ) శనివారం ఆరోపించింది. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అరెస్టు చేసిన నేపథ్యంలో ఆ పార్టీ తన పత్రిక 'సామ్నా'లో సంపాదకీయంలో ప్రధానిని లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేసింది. కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడంలో ఆశ్చర్యం లేదు. ఎందుకంటే ఒక నియంత ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆ పార్టీ పేర్కొంది. ఆ సంపాదకీయంలో మోదీని మహాభారత పాత్రధారి కంసుడుతో పోల్చారు. 'కంసుడు తాను భయపడిన వారందరినీ జైలులో పెట్టాడు. అయినప్పటికీ చివరికి అతనిని చంపిన శ్రీకృష్ణుడు జన్మించాడు' అని అది పేర్కొంది. 'మోదీకి భయం... అందుకే ప్రతిపక్ష నేతలను జైల్లో పెట్టి ఎన్నికలను ఎదుర్కొంటున్నారు' అని తెలిపింది. 'ఔరంగజేబు ప్రత్యర్థులను తన సామంతులుగా చేసుకుంటాడు లేదా వారిని నిర్మూలిస్తాడు. అదే ఔరంగజేబు ధోరణి దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వంలో కనిపిస్తుంది. ప్రతిపక్షాల గొంతుక ఉండకూడదన్న ప్రస్తుత పాలకుల విధానం నష్టదాయకంగా ఉందన్నారు. చైనా, రష్యాలలో ప్రతిపక్ష నాయకులు హత్యకు గురవుతారు లేదా అదృశ్యమవుతారు. కానీ భారతదేశంలో వారిని తప్పుడు కేసులలో ఇరికించి నెలల తరబడి జైలుకు పంపుతున్నారు' అని సంపాదకీయం పేర్కొంది. 2014 నుంచి కేంద్ర ఏజెన్సీల కేసులలో 95 శాతం ప్రతిపక్ష నాయకులపై ఉన్నాయని, బీజేపీ ప్రతిపక్ష నాయకులను నిర్మూలించడానికి కేంద్ర ఏజెన్సీలను దుర్వినియోగం చేస్తోందని ఆరోపించింది.

పోటీ నుంచి వైదొలిగిన ఇద్దరు బీజేపీ ఎంపీలు

న్యూఢిల్లీ: గుజరాత్‌కు చెందిన ఇద్దరు బీజేపీ అభ్యర్థులు లోక్‌సభ ఎన్నికల బరి నుంచి వైదొలిగారు. వ్యక్తిగత కారణాల వల్ల తాము పోటీకి దూరమవుతున్నామని వెల్లడించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టులు పెట్టారు. వదోదర సిట్టింగ్ ఎంపీ రంజన్ భట్‌కు బీజేపీ మరోసారి టికెట్ ఇచ్చింది. అలాగే సబర్‌కాంతా నుంచి భికాజీ ఠాకూర్‌కు టికెట్ ప్రకటించింది. భట్‌కు మరోసారి టికెట్ ఇవ్వడంపై స్థానికంగా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. అందుకు నిరసనగా నియోజకవర్గంలో బ్యానర్లు వెలిశాయి. 2014లో మోదీ వారణాసి, వదోదర నియోజకవర్గాల నుంచి పోటీ చేశారు. వారణాసి నుంచి కొనసాగాలని నిర్ణయించుకోవడంతో వదోదర ఖాళీ అయింది. అప్పుడు అక్కడ నిర్వహించిన ఉపఎన్నికలో భట్ విజయం సాధించారు. 2019లో ఆ గెలుపు పునరావృతమైంది.

కేజ్రీవాల్‌కు మరింత ఆదరణ

- దిల్లీలో ఆప్ హ్యాట్రిక్ తప్పదు
- ఆప్ అధినేత అంటే మోదీకి భయం
- అందుకే ఈడీతో అరెస్టు
- రాజకీయ పండితుల అంచనా



న్యూదిల్లీ:
లోక్‌సభ ఎన్నికలకు ముందు ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత, దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్టు చేసింది. ఎన్నికల ముందే కేజ్రీవాల్‌ను ఎందుకు అరెస్టు చేశారు? ఆప్ బలపడుతోందని బీజేపీ భావించిందా? అందుకే కేజ్రీవాల్‌ను అరెస్టు చేసి జైలుకు తరలించిందా? అంటే ఔననే రాజకీయ పండితులు విశ్లేషిస్తున్నారు. బీజేపీ తీరును ఆప్ నేతలు తీవ్రంగా ఖండిస్తున్నారు. 'అరవింద్ కేజ్రీవాల్ అంటే ప్రధాని మోదీకి భయం. కేజ్రీవాల్‌ను అక్రమంగా అరెస్టు చేశారు. ఆప్ ఏర్పాటు చేసి 12 ఏళ్లు అవుతోంది. ప్రాంతీయ పార్టీ నుంచి జాతీయ పార్టీగా గుర్తింపు వచ్చింది. కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేసి, పార్టీని భూ స్థాపితం చేయాలని అనుకుంటున్నారు. కేజ్రీవాల్‌పై కేసు నమోదు చేసి అణగదొక్కాలని చూస్తున్నారు. అక్రమంగా అదుపులోకి తీసుకోవడం సరికాదు. కాంగ్రెస్- ఆప్ కలిసి కూటమిగా ఏర్పడ్డాయి. కూటమి ప్రభావం ఎన్నికల్లో కచ్చితంగా కనిపించనుంది. 2019 లోక్ సభ ఎన్నికల్లో ఆప్, కాంగ్రెస్ కూటమి 16 శాతం ఓట్లు సాధించింది. సీ ఓటర్‌కు చెందిన మూడ్ ఆఫ్ ద నేషన్ సర్వే ప్రకారం ప్రతిపక్ష కూటమికి నాయకత్వం వహించే వ్యక్తుల్లో కేజ్రీవాల్ ఒకరు. ప్రతిపక్ష కూటమికి రాహుల్ గాంధీ నాయకత్వం వహించాలని ఎక్కువ మంది అభిప్రాయపడ్డారు. కేజ్రీవాల్, మమతా బెనర్జీ 17 శాతం ఓట్లతో రెండు, మూడు స్థానాల్లో ఉన్నారు. మరికొద్ది రోజుల్లో లోక్‌సభ ఎన్నికలు జరగనున్నాయి. వచ్చే ఏడాది దిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయి. ఆ ఎన్నికలపై ఆప్ దృష్టి సారించనుంది. లోక్‌సభ ఎన్నికల కన్నా దిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు ఆప్ ప్రాధాన్యత ఇస్తోంది. 2014 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 7 సీట్లు గెలిచింది. ఆ మరుసటి ఏడాది జరిగిన దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం 3 సీట్లకే పరిమితమైంది. 2019లో బీజేపీ మళ్లీ 7 లోక్‌సభ సీట్లు కైవసం చేసుకుంది. 2020లో మాత్రం 8 అసెంబ్లీ సీట్లలో జయభేరి మోగించింది. 2015లో ఆప్ 67 సీట్లు గెలువగా 2020లో 62 స్థానాలు సొంతం చేసుకుంది. గత పరిణామాలను బట్టి 2025లో ఆప్, కేజ్రీవాల్‌ను దెబ్బకొట్టాలని బీజేపీ భావించింది. గత పదేళ్ల నుంచి తమ కంటిమీద కునుకు లేకుండా చేస్తోన్న కేజ్రీవాల్‌ను లక్ష్యంగా చేసుకుంది. అందుకోసం మీనాక్షి లేఖి, పర్వేశ్ సింగ్‌కు దిల్లీ బాధ్యతలు అప్పగించింది. దిల్లీ ప్రజలకు ఉచిత కరెంట్, ఉచిత నీరు హామీ వల్ల అరవింద్ కేజ్రీవాల్ దగ్గరయ్యారు. దిల్లీలో కేజ్రీవాల్‌కు మంచి కరిష్మా ఉంది. 2020 దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కేజ్రీవాల్ సీఎం అభ్యర్థిగా బరిలోకి దిగడంతో 30 శాతం మంది ఓటు వేశారు. ఆ సమయంలో పార్టీ, అభ్యర్థులు ఎవరని చూడలేదు. ఆప్‌కు 53.8 శాతం ఓట్లు రాగా 16 శాతం ఓట్లు కేజ్రీవాల్ పేరు మీద వచ్చాయి. బీజేపీ కన్నా ఆప్ 15 శాతం ఎక్కువ ఓట్లు పొందింది. జైలుకు వెళ్లి వచ్చిన తర్వాత లాలు ప్రసాద్ యాదవ్, జయలలిత, జగన్‌మోహన్‌రెడ్డికి ఆదరణ పెరిగింది. వైఎస్ జగన్ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి అయ్యారు. ఇప్పటికే ప్రజల్లో మంచి పేరున్న కేజ్రీవాల్ క్రేజ్ మరింత పెరుగుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్టు చేయడంతో ఆప్ హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని విశ్లేషిస్తున్నారు. అరెస్టు చేయడంతో కేజ్రీవాల్‌కు సానుభూతి పెరిగినట్లు లెక్కలు వేస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో ఆప్ ఓటు శాతం మరింత పెరుగుతుందని చెబుతున్నారు.

బీజేపీ రాజకీయాల బాధితుడు కేజ్రీవాల్

- సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా
- దిల్లీ సీఎం నివాసంలో సునీతా కేజ్రీవాల్‌తో భేటీ, సంఘీభావం

న్యూదిల్లీ:
దిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ బీజేపీ మురికి రాజకీయాల బాధితుడని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. సొంత ప్రయోజనాల కోసం ఈడీ, సీబీఐ వంటి దర్యాప్తు సంస్థలను బీజేపీ దుర్వినియోగిస్తోందని వ్యాఖ్యానించారు. విపక్షాలను అణచివేసేందుకు, వారి గొంతు నొక్కేందుకు చేసే ఇలాంటి ప్రయత్నాలను దేశ ప్రజలే తిప్పికొడతారని, రాబోయే ఎన్నికల్లో తమ ఓటు ద్వారా ఈ పార్టీకి బుద్ధి చెబుతారని రాజా అన్నారు. ఆయన శనివారం దిల్లీలోని కేజ్రీవాల్ నివాసానికి వెళ్లి సీఎం భార్య సునీతా కేజ్రీవాల్, కుమార్తె హర్షితను కలిసి సంఘీభావం తెలిపారు. కేజ్రీవాల్ అరెస్టును ఖండించారు. రాజా వెంట సీపీఐ కార్యదర్శులు డాక్టర్ బాలచంద్ర కాంగో, రామకృష్ణ పాండా, దిల్లీ కార్యదర్శి దినేశ్ చంద్ర వార్ష్నే ఉన్నారు.

నేడు 'సార్వత్రిక ఎన్నికలు-మీడియా పాత్ర'పై సదస్సు

విశాలాంధ్ర-విజయవాడ:
ఆంధ్ర ప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఏపీయూడబ్ల్యూజే) అధ్వర్యంలో 'సార్వత్రిక ఎన్నికలు-మీడియా పాత్ర' అనే అంశంపై సదస్సు నిర్వహించనున్నట్లు యూనియన్ నాయకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక గాంధీనగర్‌లోని శ్రీరామ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఉదయం 10.30 గంటలకు ఈ కార్యక్రమం జరుగుతుందని, ముఖ్యఅతిథిగా ఐజేయూ అధ్యక్షులు, తెలంగాణ మీడియా అకాడమి చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యవక్తలుగా సిటిజన్ ఫర్ డెమోక్రసీ సంయుక్త కార్యదర్శి వి.లక్ష్మణ్‌రెడ్డి, ప్రొఫెసర్ ఎంసీ దాస్, వక్తలుగా ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షులు ఐవీ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి చందు జనార్దన్, ఐజేయూ కార్యదర్శి డి.సోమసుందర్, కార్యవర్గ సభ్యులు ఆలపాటి సురేష్‌కుమార్ పాల్గొంటారని వివరించారు.

టీడీపీ వర్క్‌షాపులో ఫోన్ ట్యాపింగ్ కలకలం

రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిన కానిస్టేబుల్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:
విజయవాడలో తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నిర్వహించిన పార్టీ వర్క్‌షాప్‌లో ఫోన్ ట్యాపింగ్ కలకలం రేపింది. ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నాడంటూ ఓ కానిస్టే బుల్‌ను నేతలు పట్టుకున్నారు. కొందరు పోలీసు ఉన్నతాధికారులు కావాలనే తమ ఫోన్ ట్యాప్ చేస్తున్నారని టీడీపీ నేతలు ఆరోపించారు. విజయవాడ పార్లమెంటు టీడీపీ అభ్యర్థి కేశినేని చిన్ని ఫోన్ ట్యాప్ చేస్తున్నట్టు నేతలు ఆధారాలు బయట పెట్టారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్, పురందేశ్వరి ఫోన్లు కూడా ట్యాప్ చేస్తున్నారని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు ఆరోపించారు. ఐజీ పంపితేనే వచ్చానని కానిస్టేబుల్ చెప్పాడ న్నారు. కేశినేని చిన్ని కదలికలపై నిఘా పెట్టినట్టు తమకు తెలిసిందన్నారు. తమ ఫోన్లు ట్యాపింగ్ చేస్తున్న ఆధారాలు కానిస్టేబుల్ ఫోన్‌లో లభ్యమయ్యాయన్నారు. ఉన్నతాధి కారి సీతారామాంజనేయులు నేతృత్వంలో ట్యాపింగ్ వ్యవహారం జరుగుతోందని మండిపడ్డారు. తెలంగాణ ప్రభుత్వం పెగాసెస్ సాఫ్ట్‌వేర్ కొనుగోలు చేసినప్పుడే ఏపీ సీఎం జగన్ అదే తరహా సాఫ్ట్ వేర్ కొనుగోలు చేశారని ఆరోపించారు. తామిచ్చిన ఫిర్యాదుపై ఈసీ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తన ఫోన్ ట్యాప్ చేసేలా ఇంటెలిజెన్స్ విభాగం ప్రయత్నించిందని తెలుగుదేశం విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని చిన్ని తెలిపారు. కానిస్టేబుల్‌ను పట్టుకుంటే అసలు విషయాలు వెలుగులోకి వచ్చాయన్నారు. వ్యక్తిగత స్వేచ్ఛను హరించేలా కొందరు పోలీస్ ఉన్నతాధికారులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

రెవెన్యూ అధికారుల తీరుతో

చేనేత కుటుంబం ఆత్మహత్య

విశాలాంధ్ర-ఒంటిమిట్ట:
డబ్బులకు అమ్ముడుపోయిన రెవెన్యూ అధికారుల తీరుతో చేనేత కార్మికుడి కుటుంబం శనివారం ఆత్మహత్యకు పాల్పడింది. వైసీపీ నేతల ఒత్తిడితో సాగుభూమి రికార్డులు తారు మారు చేయడంతో మనస్తాపం చెందిన ఆ కుటుంబం భూలోకంలో బతకడం కష్టమని అనంతలోకానికి పయనమైంది. వివరాల్లోకి వెళితే... కడప జిల్లా ఒంటిమిట్ట మండలం కొత్తమాధవరంలో మూడు ఎకరాల సాగు భూమి పొలం సుబ్బారావు (45) తండ్రి పేరుతో ఉంది. కొందరు వైసీపీ నాయకుల ఒత్తితో రెవెన్యూ అధికారులు డబ్బులకు అమ్ముడుపోయి రికార్డులు తారుమారు చేసి కట్టా శ్రావణి పేరు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. అది తెలియడంతో సుబ్బారావు మనస్తాపానికి గురయ్యాడు. కరోనా సమయంలో తన తండ్రికి కరోనా సోకడంతో సుబ్బారావు రూ. ఐదు లక్షలు అప్పుగా తెచ్చి చికిత్స చేయించినా మృతి చెందాడు. తన సోదరుడి వివాహానికి రూ. మూడు లక్షలు అప్పు చేశాడు. ఎనిమిది లక్షల అప్పు తీర్చేందుకు మూడుకరాల భూమిని అమ్ముదామని నిర్ణయానికి వచ్చాడు. రికార్డులు తన పేరుపై కాకుండా ఇతరుల పేరుతో ఉండడంతో కొనేందుకు ఎవరూ ముందుకు రాలేదు. డబ్బులు తీసుకునైనా ఆ భూమిని తన పేరుపై ఆన్‌లైన్ చేయాలని రెవెన్యూ అధికారులను సుబ్బారావు ప్రాధేయపడినా ఫలితం లేదు. అప్పులబాధ ఎక్కువ కావడంతో తన చావుకు కట్టా శ్రావణి, రెవెన్యూ అధికారులే బాధ్యులు అని రాసి సుబ్బారావు రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న భార్య పాల పద్మావతి (35), కుమార్తె వినయ (17) విషం తాగి ఆత్మహత్య చేసుకున్నారు. సమాచారం అందుకున్న డీఎస్పీ షరీఫ్, ఒంటిమిట్ట సీఐ పురుషోత్తమరాజు, ఎస్ఐ మధుసూదన్‌రావు ఘటనా స్థలానికి హుటాహుటిన చేరుకున్నారు. కడప నుంచి డాగ్ స్క్వాడ్‌ను, క్లూస్‌టీమ్‌ను రప్పించి పరిశీలించారు. నిందితులపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని డీఎస్పీ చెప్పారు. మృతదేహాలను కడప రిమ్స్‌కు తరలించారు.

నా జీవితం వైఎస్ కుటుంబానికి అంకితం

నెల్లూరులో వైసీపీ క్లీన్‌స్వీప్: విజయసాయి రెడ్డి ధీమా

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు:
తన జీవితం వైఎస్ కుటుంబానికి అంకితమని, ఆ కుటుంబం వల్లనే ఈస్థాయికి చేరుకోగలిగానని వైసీపీ ఎంపీ విజయసాయి రెడ్డి అన్నారు. వైఎస్ కుటుంబంతో 30 ఏళ్ల అనుభవం ఉందని, చివరి వరకు సీఎం జగన్‌తో ఉంటానని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో నెల్లూరు పార్లమెంటు స్థానం నుంచి పోటీ చేస్తున్న తనను అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. రాష్ట్రంలోని అసెంబ్లీ, పార్లమెంటు స్థానాలను వైసీపీ క్లీన్ స్వీప్ చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. విజయసాయి రెడ్డి శనివారం కోవూరు నియోజకవర్గం, బుచ్చిరెడ్డిపాలెం మండలం, పంచేడు గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇదే సందర్భంగా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తనపై కొందరు అసత్య ప్రచారం చేస్తున్నారని, తానేమిటో నెల్లూరు ప్రజలకు బాగా తెలుసన్నారు. 'నేను నెల్లూరు బిడ్డను. ఇక్కడే పుట్టిపెరిగాను. నా విద్యాభ్యాసం మొత్తం నెల్లూరులోనే జరిగింది. ఈ ప్రాంతం అణువణువు తెలుసు. రాజకీయమే నా జీవితం' అని అన్నారు. చివరి శ్వాస వరకు వైఎస్ జగన్ వెంట నడుస్తానని ప్రకటించారు. ఐదేళ్ల పాలనలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యాక్రమాలు చేపట్టామని విజయసాయి రెడ్డి చెప్పారు. తమ పార్టీకి, జగన్‌కు జనాదరణ ఉందన్నారు. డబ్బుతో కొందరు నేతలను కొనవచ్చేమోగానీ ప్రజలను కొనలేరని నొక్కి చెప్పారు. మరోసారి అధికారాన్ని కట్టబెడితే మరింత మెరుగైన పాలన అందిస్తామని హామీనిచ్చారు. ఎప్పుడూ నెల్లూరు ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. ప్రత్యర్థి పార్టీ తరపు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి తన వ్యాపారాలను చూసుకునేందుకు సమయం సరిపోదు ఇక నెల్లూరు ప్రజల కోసం సమయం ఎలా కేటాయిస్తారని వ్యాఖ్యానించారు.

మద్దతు ధర హామీకి తూట్లు

మోదీ సర్కారును ఓడించాలి
రావుల వెంకయ్య

విశాలాంధ్ర- గన్నవరం:
రైతు, కార్మిక వ్యతిరేకి మోదీ ప్రభుత్వాన్ని ఓడించాలని అఖిల భారత కిసాన్ సభ జాతీయ అధ్యక్షుడు రావుల వెంకయ్య పిలుపునిచ్చారు. సీపీఐ, సీపీఎం రైతుసంఘాల అధ్వర్యంలో శనివారం కృష్ణా జిల్లా గన్నవరం సీపీఐ కార్యాలయంలో రైతుసంఘం నాయకులు కాట్రగడ్డ రామచంద్రజోషి, ఎస్. సాంబశివరావు సంయుక్త అధ్యక్షతన భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్ 93వ వర్ధంతి కార్యక్రమం జరిగింది. రావుల వెంకయ్య మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన విప్లవ వీర కిశోరాలు సర్దార్ భగత్ సింగ్, రాజగురు సుఖదేవ్ అని కొనియాడారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొనని పార్టీలు పోరాటాలు చేశామని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. మోదీ ప్రభుత్వం రైతు, కార్మిక చట్టాలను రద్దు చేసి మూడు నల్లచట్టాలు తీసుకొచ్చిందన్నారు. గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు చేసిన పోరాటంలో 780 మంది అశువులు బాశారని గుర్తుచేశారు. ఎన్నికలు దగ్గరకొచ్చినా రైతులకు మోదీ ఇచ్చిన హామీ అమలు చేయలేదని విమర్శించారు. పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తేనే రైతుకు మేలు జరుగుతుందన్నారు. గిట్టుబాటు ధరలేక రైతులు రుణగ్రస్తులుగా మారుతున్నారని చెప్పారు. రైతులకు రుణమాఫీ చేయాలని, తక్కు వడ్డీకే రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులకు ఉచితంగా విద్యుత్ అందించాలని కోరారు. దోపిడీదారులకు ఓటు ద్వారా బుద్ధి చెప్పాలన్నారు. జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం కార్పొరేట్‌లకు రుణాలు మాఫీ చేసి రైతులను విస్మరించిందని విమర్శించారు. గత పదేళ్లుగా డీజిల్, పెట్రల్ ధరలు పెంచిన మోదీ ప్రభుత్వం... రైతులపై మరింత భారం మోపిందన్నారు. మాజీ ఎమ్మెల్యే దాసరి బాలవర్ధన రావు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజలపై భారాలు మోపిందన్నారు. కాంగ్రెసు పార్టీ జిల్లా అధ్యక్షుడు వింత సంజీవ్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో మోదీ అరాచక పాలన చేస్తున్నారని విమర్శించారు. సీబీఐని అడ్డు పెట్టుకొని ప్రతిపక్ష నాయకులను జైలుకు పంపటమే లక్ష్యంగా పరిపాలన చేస్తున్నారని మండిపడ్డారు. దేశంలోని అన్ని వర్గాలపై భారాలు మోపి... రామజపం చేస్తున్నారన్నారు. రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్నీడి యల్లమందారావు, కృష్ణాజిల్లా గౌరవాధ్యక్షుడు వెలగపూడి ఆజాద్ ప్రసంగించారు. తొలుత భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి విప్లవ జోహార్లు అర్పించారు. అనంతరం కాగడాల ప్రదర్శన చేశారు. రైతు సంఘం కృష్ణాజిల్లా అధ్యక్షులు ముక్కమాల ఉమా మహేశ్వరవు, కార్యదర్శి పెద్దు వాసుదేవరావు, రైతుసంఘం నాయకులు శనగల సుబ్బారెడ్డి, గొంది శోభనా చలపతిరావు, ఎస్టీయూ రాష్ట మాజీ అధ్యక్షుడు పెద్దు వెంకటరత్నం, నాయకులు డి.విద్యాసాగర్, సీపీఎం కార్యదర్శి ఎం.ఆంజనేయులు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు టి.లక్ష్మణస్వామి, మిరప నాగేశ్వరరావు, సర్దార్ ఉదయ్, అవుటపల్లి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టుల 'కోర్కెల దినం'

అధికారులకు, మంత్రులకు, అభ్యర్థులకు ఏపీయూడబ్ల్యూజే వినతిపత్రాలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
దేశం కోసం ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన యువకిశోరం, పాత్రికేయుడు, సర్దార్ భగత్ సింగ్ అమరత్వాన్ని స్మరించుకుంటూ ఐజేయూ పిలుపు మేరకు శనివారం రాష్ట్రవ్యాప్తంగా ఏపీయూడబ్ల్యూజే అధ్వర్యాన జర్నలిస్టులు కోర్కెల దినం పాటించారు. జిల్లా కలెక్టర్లకు, ఆర్డీవోలకు, తహసీల్దార్‌లకు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎన్నికల్లో పోటీ చేసే ఆయా రాజకీయ పార్టీల అభ్య ర్థులకు వినతిపత్రాలు సమర్పించారు. విజయ వాడ ప్రెస్‌క్లబ్ వద్ద ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందు జనార్ధన్ పాల్గొని ప్రసంగించారు. మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. 1978లో ఏర్పాటయిన రెండవ ప్రెస్ కమిషన్ నివేదిక 1982లో వెలువడిందని, ఆ తర్వాత దేశంలో ప్రెస్ కమిషన్ ఏర్పాటు జరగలేదని తెలిపారు. సోషల్ మీడియా సైతం అపారంగా విస్తరించినందున తక్షణమే మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఇటీవల కాలంలో పత్రికా స్వేచ్ఛపై దాడులు విపరీతంగా పెరిగిపోతుండడంతో పాత్రికేయులు తీవ్ర వత్తిళ్లకు, భౌతిక దాడులకు గురవుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల పాత్రికేయులకు, మీడియా సంస్థలకు భద్రత కల్పించడం కోసం కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలోనే ఒక ప్రత్యేక చట్టం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. దేశంలో వర్కింగ్ జర్నలిస్టులు, నాన్ జర్నలిస్టుల వేతనాలను సవరించేందుకు కేంద్ర ప్రభుత్వం 2007లో మజీధియా వేజ్ బోర్డును ఏర్పాటు చేసింది. అప్పటి నుంచి దేశంలో ధరలు పెరిగిపోయాయి. గత 15 ఏళ్లలో ప్రభుత్వ, ప్రైవేటు రంగ ఉద్యోగులకు కనీసం రెండుసార్లు వేతన సవరణ జరిగింది. వారి జీతాలు పెరిగాయి. కానీ వార్తాపత్రికల పరిశ్రమకు చెందిన ఉద్యోగులను మాత్రం గాలికి వదిలేశారు. సరైన వేతన వ్యవస్థ లేకపోవడం, వేజ్ బోర్డు సిఫార్సులను కూడా అమలు చేయకపోవడం పాత్రికేయుల జీవితాలను దుర్భరం చేస్తున్నాయి. అందువల్ల వెంటనే జర్నలిస్టుల కోసం ఒక వేజ్ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రిటైర్డు జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని, ఇవన్నీ ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ప్రాధాన్యత ప్రాతిపదికన పరిష్కరించాలని కోరారు. ఏపీయూడబ్ల్యూజే విజయవాడ యూనిట్ అధ్యక్షులు చావా రవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఉపాధ్యక్షులు కంచల జయరాజ్, సామ్నా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ రమణారెడ్డి పాల్గొన్నారు. శ్రీకాకుళంలో మంత్రి ధర్మాన ప్రసాద రావుకు ఐజేయూ కార్యవర్గ సభ్యులు నల్లి ధర్మారావు అధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. తిరుపతిలో ఎమ్మెల్యే భూమన కరు ణాకర్ రెడ్డికి ఐజేయూ కార్యవర్గ సభ్యులు డాక్టర్ ప్రసాద్, కర్నూలులో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, తణుకులో మంత్రి కారుమూరు నాగేశ్వరరావుకు యూనియన్ నేతలు వినతి పత్రాలు అంద జేశారు. ఎన్ని కల కోసం పార్టీలు రూపొందించే ఎన్నికల మేనిఫెస్టోలో జర్నలిస్టుల సమస్యలు చేర్చాలని కోరారు.

2 నుంచి ఎన్నికల పాటల వర్క్‌షాప్

జయప్రదానికి చిన్నం పెంచలయ్య పిలుపు

విశాలాంధ్ర-తిరుపతి:
సార్వత్రిక ఎన్నికలకు నగారా మోగడంతో ఎన్నికల పాటల వర్క్‌షాపు నిర్వహించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి సిద్ధమైంది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రాపురంలో డాక్టర్ చెలికాని రామారావు భవన్‌లో రాష్ట్రస్థాయి రచయితలు-కళాకారుల కోసం వర్క్‌షాప్ నిర్వహించబోతోంది. ఇందుకు సంబంధించిన కరపత్రాలను ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య శనివారం స్థానిక బైరాగి పట్టేడలోని సీపీఐ కార్యాలయంలో విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ కోనసీమ జిల్లాలో ఏప్రిల్ 2, 3, 4 తేదీలలో జరిగే రాష్ట్ర స్థాయి రచయితలు, కళాకారుల వర్క్‌షాప్‌ను జయప్రదం చేయాలని కోరారు. అన్ని జిల్లాల కళాకారులు తప్పక హాజరు కావాలన్నారు. మోదీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై, జగన్ అసమర్థ విధానాలపై రచయితలు, కళాకారులు గళం విప్పాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థుల గెలుపు-ప్రజాస్వామ్య రక్షణ కోసం ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి కృషి చేయాలని పెంచలయ్య పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి జింక నాగరాజు, బి.నాగభూషణం, పి.ముకుందా, ఏఐటీయూసీ నగర కార్యదర్శి రవి, పౌరాణిక కళాకారుడు పద్మనాభ రెడ్డి, ఆర్.బలరాం, బాలు, నవీన్, అల్లాబక్షు, ఓంరాజ్, వీరబోయిన శ్రీనివాస్ పాల్గొన్నారు.

మైపాడు బీచ్ రిసార్ట్స్ లీజు ఉత్తర్వులు రద్దు చేయాలి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి రామకృష్ణ లేఖ

విశాలాంధ్ర-విజయవాడ:
సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన తర్వాత మైపాడు బీచ్ రిసార్టును లీజుకిస్తూ ఏపీటీడీసీ జారీ చేసిన ఉత్తర్వులను రద్దుచేయాలని, ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా హడావుడిగా ఉత్తర్వులిచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనాకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ శనివారం లేఖ రాశారు. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని మైపాడు వద్ద గల ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీటీడీసీ)కి చెందిన హరిత మైపాడు బీచ్ రిసార్ట్‌లో భవనాలను, స్థిర చరాస్తుల నిర్వహణను 'ఆఫ్ హోం హోటల్స్ అండ్ రిసార్ట్స్'కు లీజుకిస్తూ మార్చి16వ తేదీన ఏపీటీడీసీ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పేరుతో హడావుడిగా ఉత్తర్వులు జారీచేసినట్లు పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదలైన తదుపరి ప్రభుత్వ ఆస్తులకు సంబంధించి ఎటువంటి లీజు ఒప్పందాలు చేయకూడదని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎన్నికల నిబంధనలను త్రోసిరాజని, మైపాడు బీచ్ రిసార్ట్స్ నిర్వహణను 'ఆఫ్ హోం హోటల్స్ అండ్ రిసార్ట్స్'కు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీచేసిందని స్పష్టం చేశారు. ఇది ఎన్నికల నిబంధనలకు పూర్తి విరుద్ధమని పేర్కొన్నారు. తక్షణమే ఈ లీజు ఒప్పందాన్ని రద్దుచేయాలని, ఇందుకు బాధ్యులపై చర్యలు చేపట్టాలని కోరారు.

'నేటి ఎన్నికల తీరుతెన్నులు'పై అరసం కవితల పోటీ

విశాలాంధ్ర-గుంటూరు:
ఆంధ్ర ప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం (అరసం), విశాలాంధ్ర దినపత్రిక సంయుక్తంగా కవితల పోటీ నిర్వహిస్తున్నట్లు అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇది ఎన్నికల తరుణం అయినందున 'నేటి ఎన్నికల తీరుతెన్నులు' అంశంపై కవిత్వ రచనను ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు. రచన 50 పాదాలు (పంక్తులు) కు మించకుండా ఉండాలని, తమ కవితలను 2024 ఏప్రిల్ 20వ తేదీలో లోపు 401, శ్రావణి రెసిడెన్సీ, 6/3 ఎస్‌వీఎన్ కాలనీ, గుంటూరు-522006 (ఫోన్ నంబరు 9291530714) అనే చిరునామాకు పంపాలని సూచించారు. ఎంపికయిన కవితలకు ప్రథమ బహుమతిగా రూ.3 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.2 వేలు, తృతీయ బహుమతిగా రూ.1000, ప్రోత్సాహక బహుమతిగా రూ.500 (2 బహుమతులు) అరసం అందజేస్తుందని వివరించారు.

కవితను పంపించే వారు కొన్ని నిబంధనలు అనుసరించాలని కోరారు. ఒకరు ఒక కవితను మాత్రమే పంపాలని, కవిత 50 పాదాలు (పంక్తులు) మించరాదు. పేజీకి ఒక వైపు మాత్రమే రాయాలి. మహిళలు, దళితులు, మైనారిటీలను కించపరిచే వస్తువు, ప్రతీకలు ఉన్న కవితలను పరిశీలనకు స్వీకరించడం జరగదు. రచన తమ సొంతమని, ఏ ఇతర పత్రికలలో ప్రచురించలేదని ప్రసార సంస్థలకూ, సామాజిక మాధ్యమాలకూ పంపలేదని హామీ పత్రం జతచేయాలి. మీ పేరు, చిరునామా, ఫోన్ నంబరు వివరాలు హామీ పత్రంలో మాత్రమే పేర్కొనాలి. కవిత రాసిన ప్రతిపై పేరు ఉండకూడదు. మీ కవితను చేతి రాతతో గానీ డీటీపీ చేసినదిగానీ పోస్టు లేదా కొరియర్ ద్వారా పైన తెలిపిన చిరునామాకు పంపాలి. ఫోన్ వాట్సాప్, ఈమెయిల్ ద్వారా పంపే కవితలు స్వీకరించడం జరగదు. ఎంపికయిన కవితలు విశాలాంధ్ర దినపత్రిక ఆదివారం ప్రత్యేక సంచికలో ప్రచురించడం జరుగుతుందని పేర్కొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com